PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 158 | విజయవాడ, గురువారం 11 జనవరి 2024 | 8+8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 11 January 2024 | Rs

గ్రూప్-2 దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-2 పోస్టుల దరఖాస్తు గడువును ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) పొడిగించింది. ఈ మేరకు కమిషన్ కార్యదర్శి జె ప్రదీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 10వ తేదితో ముగిసిన గడువును ఈ నెల 17వ తేది వరకు పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 25వ తేదిన స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని, ఇందులో ఎలాంటి మార్పు ఉండదన్నారు.

ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగుల చర్చలు సఫలం .. సమ్మె విరమణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్‌ఎస్‌ఎ) ప్రాజెక్టు డైరెక్టర్ బి శ్రీనివాసరావుతో ఎస్‌ఎస్‌ఎ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల చర్చలు సఫలమయ్యాయి. బుధవారం అర్ధరాత్రి వరకు జరిగిన ఈ చర్చలు సఫలం కావడంతో సమ్మెను విరమిస్తున్నట్లు ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి ప్రకటించింది.

ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలుపై కమిటీ నియమిస్తామని, అలాగే పిఎఫ్, మినిమం టైం స్కేల్ దశల వారీ అమల్జేస్తామని, 10 విభాగాల ఉద్యోగులకు వేతనాలు పెంచేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు జెఎసి అధ్యక్షులు బి కాంతారావు చెప్పారు. అలాగే సమ్మె కాలానికి వేతనం ఇచ్చేందుకు, ఉద్యోగుల తొలగింపు ఉత్తర్వులను, షోకాజ్ నోటీసులను వెనక్కి తీసుకుంటామని కూడా హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ చర్చల్లో సమగ్ర శిక్ష ఎఎస్‌పిడి శ్రీనివాసులు రెడ్డి, కెజిబివి కార్యదర్శి మధుసూధనరావు, జెఎసి చైర్మన్ ఎవి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల

సమ్మె తాత్కాలిక వాయిదా

• చాలా వరకూ పరిష్కరించామన్న మంత్రి బొత్స • అభ్యంతరం తెలిపిన సిఐటియు అనుబంధ సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలికంగా వాయిదా పడింది. బుధవారం మూడో దఫా చర్చలు జరిగాయి. ఈ చర్చల అనంతరం నాయకులు ఈ మేరకు ప్రకటన చేశారు. మూడో దఫా చర్చల్లో మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సిఐటియు), మున్సిపల్ ఉద్యోగుల జెఎసి నాయకులు పాల్గొన్నారు. రెండున్నరగంటలపాటు జరిగిన చర్చల్లో పలు అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చిందని, అలాగే తీసుకున్న నిర్ణయాలపై వెంటనే జిఓను ఇచ్చేందుకు అంగీకరించిందని, దీంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని నాయకులు ప్రకటించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఫిబ్రవరి నుండి సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. సిబ్బంది వేతనం రూ.21 వేలు చేయడంతోపాటు కనీసం రెండు లేదా మూడువేల



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి బొత్స, శ్రీలక్ష్మి

రూపాయలు పెంచాలని తాము కోరామని, దీనికి ప్రభుత్వం అంగీకరించకపోవడంతో అభ్యంతరం(డీసెంట్) నోట్ ఇచ్చినట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు తెలిపారు. మున్సిపల్ కార్మికులు 16 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రెండు సార్లు చర్చలు జరిపినా ఫలితం కనిపించకపోవడంతో బుధవారం మరో విడత చర్చలకు ప్రభుత్వం ఆహ్వానించింది. సాయంత్రం వెలగపూడి సచివాలయంలో మూడుగంటలపాటు జరిగిన చర్చల్లో అనేక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమయంలో కొన్ని సంఘాల నాయకులు సమ్మెను విరమిస్తున్నట్లు చెప్పగా సిఐటియు అనుబంధ సంఘ నాయకులు అలా కుదరదని, తాత్కాలికంగా వాయిదా వేస్తామని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే మరలా సమ్మె చేపడతామని స్పష్టం చేశారు.

సానుకూల నిర్ణయం తీసుకున్నాం

మంత్రి బొత్స, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి

మున్సిపల్ కార్మికుల సమ్మెకు సంబంధించి సానుకూల నిర్ణయం తీసుకున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి తెలిపారు. అనేక అంశాలపై మిగతా 7లో

హామీలు సంతృప్తికరంగా లేవు

'చర్చలు సానుకూలంగా జరిగినప్పటికీ కార్మికులందరూ పూర్తి సంతృప్తి చెందేలా జరగలేదు. ఈ నేపథ్యంలో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నాము. చర్చల్లో అభ్యంతరాన్ని(డీసెంటు) ఇచ్చాము. మినిట్స్ కాపీ వచ్చిన తరువాత ఒప్పుకున్న జీత భత్యాలు, సమ్మెకాలం జీతం, కేసుల ఎత్తివేత, ఇంజనీరింగ్ కార్మికుల సమస్య పరిశీలనకు కమిటీ, క్లాప్ డ్రైవర్ల సమస్యల పరిష్కారంపై ఉత్తర్వులు రావాల్సి ఉంది. రూ.21 వేల వేతనానికి తోడు అదనంగా రెండువేలు లేదా మూడువేలు పెంచాలని, కనీసం ఒకనెల బోనస్ అన్నా ఇవ్వాలని కోరాము. ప్రభుత్వం అంగీకరించ లేదు. ఇంజనీరింగ్ కార్మికులకు 11వ పిఆర్‌సి ప్రకారం వేతనాల ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లకు జీతాలు పెంచి, పిఎఫ్, ఇఎస్‌ఐ సమస్యలు పరిష్కరించాలని కోరాము. సిఆర్‌డిఎ పరిధిలో మున్సిపాలిటీలో కలిసిన గ్రామాల్లో వారికి మున్సిపల్ వేతనాలు ఇస్తామని మంత్రులు చెప్పారు. సిఆర్‌డిఎ అధికారులతో మాట్లాడి మిగిలిన గ్రామాల్లో వారికి కూడా న్యాయం చేయాలని కోరాము. వారినీ మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశాము. ఇంజనీరింగ్ కార్మికులకు సర్టిఫికెట్ లేనివారికి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా సర్టిఫికెట్లు ఇప్పిస్తామని మంత్రులు తెలిపారు. దీనిపైనా ఉత్తర్వులు ఇవ్వాలని కోరాము. ఔట్‌సోర్సింగ్ కార్మికులను కాంట్రాక్టులోకి మార్చే అంశంపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశాము. ప్రభుత్వాన్ని కోరాల్సినవన్నీ కోరాము.



కె.ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి
ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సిఐటియు)

అనేక అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి

'చర్చల సందర్భంగా ప్రభుత్వం హామీలు ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశాం. 21 అంశాలపై ప్రతిపాదనలు ఇచ్చాము. వాటి పరిష్కారానికి సంబంధించి జిఓ ఇవ్వాల్సి ఉంది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరాము, సరెండర్ లీవులు మూడున్నర సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే వేతనాల్లో వ్యత్యాసానికి సంబంధించిన అంశాలపైనా చర్చించాలని కోరాము. అధికారులతో వేసే కమిటీల్లో సంఘ నాయకులను కూడా చేరుస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నాము.

పి.సుబ్బారాయుడు, మున్సిపల్ జెఎసి



విజయవాడలో డివైఎఫ్ఐ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

మెగా డిఎస్‌సి అడిగితే

నిరుద్యోగ ఉపాధ్యాయులు అరెస్ట్

- డివైఎఫ్ఐ నేతలకు గాయాలు
- ఉద్రిక్తంగా సిఎం కార్యాలయ ముట్టడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా మెగా డిఎస్‌సిని నిర్వహించాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగ ఉపాధ్యాయులు చేసిన ఆందోళనపై ప్రభుత్వం విరుచుకుపడింది. సిఎం క్యాంపు కార్యాలయ పరిసరాల్లోకి వారిని రానీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులను దాటుకుపోవడానికి నిరుద్యోగులు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు దూకుడుగా వ్యవహరించి, అరెస్ట్‌లు చేయడంతో పలువురు డివైఎఫ్ఐ నేతలకు గాయాలయ్యాయి. డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల కోసం పిఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి డివైఎఫ్ఐ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా పెద్దసంఖ్యలో నిరుద్యోగ ఉపాధ్యాయులు బుధవారం విజయవాడకు చేరుకున్నారు. రాణిగారితోట నుంచి తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం వద్దకు ప్రదర్శనగా బయలుదేరారు. అక్కడ ముందుగానే మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య స్వల్ప తోపులాట జరిగింది. దీంతో పోలీసులు విచక్షణా రహితంగా నిరుద్యోగులను ఈడ్చుకుంటూ తీసుకువెళ్లారు. ఈ క్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కర్నూలు హుసేన్ భాష, రాజు, ఇమ్రాన్‌లకు గాయాలయ్యాయి. ఇళ్లల్లో ఉన్న డిఎస్సి అభ్యర్థులను సైతం పోలీసులు వదల్లేదు. వారిని కూడా బలవంతంగా అరెస్టులు చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై రాము, జి రామన్నలను పోలీసులు ముందుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో డివైఎఫ్ఐ ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, రాజు, నగేష్, బాబు, నాయకులు పి కృష్ణ, ఆంజనేయరాజు, కృష్ణకాంత్, పిచ్చయ్య, హరిష్, శివాజి, ప్రసన్న సింగ్, శర్మ, నరసింహ, చరణ్, శివ మధు తదితరులు ఉన్నారు. ముట్టడి నేపథ్యంలో తాడేపల్లి, వారధి చుట్టుపక్కల పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు.

జాబ్ క్యాలెండర్ పేరుతో నయవంచన

ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ మిగతా7లో

జంపింగుల జోరు

- టికెట్ రాకపోవడంతో పక్క పార్టీలవైపు చూపు
- వైసిపిలోకి కేశినేని నాని
- వైసిపికి కర్నూలు ఎంపి సంజీవ్ రాజీనామా
- జనసేన అధినేతను కలిసిన అంబటి రాయుడు



ముఖ్యమంత్రి జగన్‌తో కేశినేని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ నాయకుల జంపింగులు జోరందుకున్నాయి. రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం రాకపోతే ఇతర పార్టీల్లోకి జంప్ చేస్తున్నారు. టికెట్ రాదని తెలియడంతో కొందరు ముందుగా పార్టీ ఫిరాయింపులకు సిద్ధమయ్యారు. ఏ పార్టీ టికెట్ ఇస్తుందో తెలుసుకుని జంప్ అయ్యేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీ మారడంతోపాటు ప్రస్తుతం ఉన్న పార్టీలపై విమర్శలు చేస్తూ చేరిన పార్టీలను, ఆ పార్టీ అధినేతలను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. విజయవాడ టిడిపి ఎంపి కేశినేని నానికి ఆ పార్టీ అధిష్ఠానం విజయవాడ లోక్‌సభ సీటును నిరాకరించడంతో ఆయన వైసిపిలో చేరేందుకు సిద్ధమయ్యారు. నాని సోదరుడు చిన్నికి పార్టీలో ప్రాధాన్యత ఇవ్వడంతో టిడిపి కార్యక్రమాలకు కూడా ఆయన దూరంగా ఉన్నారు. దీంతో వైసిపి అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం క్యాంపు కార్యాలయంలో కేశినేని నాని కలిశారు. అలాగే కర్నూలు ఎంపి సంజీవ్ కుమార్ వైసిపికి రాజీనామా చేశారు. తన సన్నిహితులతో చర్చించి ఏ పార్టీలో చేరాలో నిర్ణయం తీసుకుంటానని వెల్లడించారు. రాష్ట్ర విభజన తరువాత పూర్తిగా ఖాళీ అయిన కాంగ్రెస్ పార్టీలోకి పదేళ్ల మిగతా2లో

మూడు కేసుల్లో

చంద్రబాబుకు ముందస్తు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బుధవారం హైకోర్టులో భారీ ఊరట లభించింది. మూడు వేర్వేరు కేసుల్లో ముందస్తు బెయిళ్లు మంజూరయ్యాయి. ఇన్నర్ రింగ్‌రోడ్డు భూమి కేసు, ఉచిత ఇసుక, మద్యం విధానాల్లో అక్రమాలపై సిఐడి నమోదు చేసిన వేర్వేరు కేసుల్లో హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం వేర్వేరు తీర్పులు వెలువరించారు. మద్యం కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్‌శాఖ అప్పటి కమిషనర్ శ్రీనరేష్‌కు కూడా ముందస్తు బెయిల్ మంజూరు చేశారు. 'ఒక వ్యక్తి నిర్బంధ అధికారం సత్యనిష్ఠతో కూడినది. వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది చాలా జాగ్రత్తగా వినియోగించాలి. అరెస్టు చేసేసి ఆ తర్వాత ఇతర విషయాలు చూద్దామనుకోవడం హేయమైనది. ఈ పరిస్థితుల్లో చంద్రబాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వడం వల్ల కేసు విచారణను ఏమాత్రం ప్రభావితం మిగతా 7లో

రాముడి పేరుతో బిజెపి డ్రామా

- ఆర్‌ఎస్‌ఎస్ చెప్పుచేతల్లో కేంద్ర ప్రభుత్వం
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి విమర్శ
- అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే వైసిపి పతనం
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు హెచ్చరిక
- సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.ఎ బేబి, బి.వి.రాఘవులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మూడు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో రాముడు పేరుతో బిజెపి ప్రభుత్వం రాజకీయ డ్రామా ఆడుతోందని, ఈ నెల 22న అయోధ్యలో రాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి విమర్శించారు. ఏలూరులోని శ్రీ హోటల్ కన్వెన్షన్ హాలులో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలకు విచ్చేసిన పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి, బివి.రాఘవులు బుధవారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎం.ఎ.బేబి మాట్లాడుతూ... పార్లమెంట్ భద్రతపై ప్రధానమంత్రిగాని, హోంమంత్రి గాని నోరు మెదపకపోవడం దారుణమని విమర్శించారు. దీనిపై నిలదీసిన ప్రతిపక్షాలను బయటకు గెంటివేసి కీలక బిల్లులు ఆమోదింపచేసుకుంటున్నారని విమర్శించారు. ప్రతిపక్షాల డిమాండ్లను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకపోవడం అప్రజాస్వామిక మన్నారు. బిల్కిస్ బానో నేరస్తులను గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా విడుదల చేసిందని, ఈ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సైతం తప్పు పట్టిందని తెలిపారు. ప్రజలు వివిధ మతాలను విశ్వసిస్తారని, ఇది లౌకిక రాజ్యమని తెలిపారు. బిజెపి మాత్రం రాముడి నినాదంతో ముందుకు సాగుతూ దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ లౌకిక తత్వానికి తూట్లు పొడుస్తోందని, రాజకీయాల్లోకి మతాన్ని తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. ఎవరైనా ఇల్లు పూర్తయిన తర్వాత గృహప్రవేశం చేస్తారని, అయితే అందుకు విరుద్ధంగా రామాలయం పూర్తి కాకుండానే పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బిజెపి కుటిల ప్రయత్నాలు చేస్తోందని మిగతా 7లో

ప్రకృతి సాగు సాకు

ఎరువులకు కేంద్రం కోత

- నేచురల్ అగ్రికల్చర్‌పై రాష్ట్రం నుంచి తప్పుడు సమాచారం
- లేని విస్తీర్ణం ఉన్నట్లు బోగస్ వివరాలు
- ఆ డేటా ఆధారంగా లక్షల టన్నులు కట్
- అదనుకు రైతుకు దొరకని ఫెర్టిలైజర్స్
- వ్యవసాయశాఖలో అంతర్మథనం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయం సాకుతో కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సిన రసాయన ఎరువులకు కోత పెడుతోంది. ఎరువుల సరఫరా తగ్గిపోవడంతో రైతులకు అదనుకు అవసరమైన ఎరువులు దొరకట్లేదు. ప్రకృతి వ్యవసాయంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపుతున్న తప్పుడు సమాచారమే రైతుల కొంప ముంచుతోంది. లేని ప్రకృతి వ్యవసాయాన్ని ఉన్నట్లు రికార్డుల్లో నమోదు చేయడంతో ఈ పరిస్థితి దాపురించిందని తెలుస్తోంది. ఇ-క్రాప్ బుకింగ్ సమయంలో ఉద్దేశపూర్వకంగా బోగస్ ఎంట్రీలతో ప్రకృతి సాగు విస్తీర్ణాన్ని రికార్డుల్లో పెంచడం వలన రాష్ట్రానికి అవసరమైన ఎరువులు రావట్లేదని వ్యవసాయశాఖ లోపల్లోపల మథన పడుతోంది. కోత లక్షల టన్నుల్లో ఉందని తెలుస్తోంది. లేని ప్రకృతి సాగు ఉన్నట్లు కలర్ ఇస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ సి హరికిరణ్ జిల్లాల అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ప్రకృతి వ్యవసాయ వివరాలను తప్పుగా నమోదు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం.

పెద్ద దందా

కేంద్ర బిజెపి ప్రభుత్వమే ఖర్చు లేని ప్రకృతి వ్యవసాయాన్ని (జీరోబేస్డ్ నేచురల్ ఫార్మింగ్) ఉద్యమం మాదిరి ముందుకు తెచ్చింది. ఆవు ఆధారంగా ప్రకృతి వ్యవసాయం కోసం ప్రత్యేకంగా నిధులిస్తోంది. ఆవు మూత్రం, పేడతో తయారు చేసే జీవామృతాలు, కషాయాలు, ప్రకృతిలో దొరికే వస్తువులే పంటలకు ఎరువులుగా వేయాలి. రసాయన ఎరువులు వాడకూడదు. గత టిడిపి ప్రభుత్వంలో ఈ వ్యవహారం ముమ్మరంగా నడవగా, వైసిపి వచ్చాకా కొనసాగుతోంది. ఆర్గానిక్ మిల్క్, ఆర్గానిక్ ఉత్పత్తులకు మార్కెటింగ్, నాణ్యతా ప్రమాణాల పరిశీలనకు ప్రత్యేక ల్యాబ్‌లు, బ్రాండ్‌లు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం అమితంగా ప్రోత్సహిస్తోంది. ఇదంతా కేంద్రం మెప్పు కోసమేనన్న వాదనలూ ఉన్నాయి. గత టిడిపి ప్రభుత్వంలో పని చేసిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారే ఇప్పటికీ ప్రకృతి వ్యవసాయానికి అన్నీ తానై చూసుకుంటున్నారు. ఏడాదికి అన్ని లక్షల ఎకరాలు, ఇన్ని లక్షల ఎకరాలను ప్రకృతి వ్యవసాయం కిందికి మిగతా 7లో


అది బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమం

- మేమూ వెళ్లడం లేదు
- 'అయోధ్య' ఆహ్వానంపై కాంగ్రెస్

న్యూఢిల్లీ : అయోధ్య రామమందిర్ ప్రారంభోత్సవ ఆహ్వానంపై తర్జన భర్జన అనంతరం కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని స్పష్టం చేసింది. ఇది ఆరెస్సెస్, బిజెపి కార్యక్రమమని, అందుకే మేం హాజరుకారాదని నిర్ణయించామని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటనను ఆ పార్టీ ప్రధానకార్యదర్శి జైరాం రమేష్ బుధవారం నాడిక్కడ విడుదలజేశారు. ఈ నెల 22న జరిగే ఆ కార్యక్రమంలో తమ పార్టీకి చెందిన నాయకులెవరూ పాల్గొనబోరని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. అయోధ్యలో రామ మందిర నిర్మాణం పూర్తికాకపోయినప్పటికీ, త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి కోసం హడావుడిగా ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఆ ప్రకటనలో పేర్కొంది. 'రాముడిని మన దేశంలో లక్షలాది మంది పూజిస్తారు. అయితే మతం అనేది వ్యక్తిగత విషయం. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ అనేక సంవత్సరాలుగా అయోధ్యలో ఆలయాన్ని ఒక రాజకీయ ప్రాజెక్టుగా మార్చేశాయి' అని ఆ ప్రకటనలో కాంగ్రెస్ పేర్కొంది.

ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు

- రాష్ట్రంలో 4.07 కోట్ల ఓటర్లు
- మహిళా ఓటర్లే ఎక్కువ
- రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే క్రిమినల్ కేసులు
- సిఇసి రాజీవ్‌కుమార్



మీడియాతో మాట్లాడుతున్న సిఇసి రాజీవ్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ ఏడాది జరగనున్న సాధారణ ఎన్నికలను ప్రజాస్వామ్య బద్ధంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ పెద్దయెత్తున సన్నాహాలు చేస్తోందని భారత ప్రధాన ఎన్నికల కమిషనరు (సిఇసి) రాజీవ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఇంకా ఏమేమి చేయాలనే అంశంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి వారి ఫిర్యాదులు, అభ్యంతరాలు, సలహాలు, సూచనలు స్వీకరించామన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో సాధారణ ఎన్నికలకు సంబంధించిన మొదటి సమావేశం నిర్వహించారు. మూడు రోజుల పర్యటనలో చివరిరోజు బుధవారం ఉదయం సిఇఒ, నోడల్ ఆఫీసర్లు, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్, రాష్ట్ర పోలీసులతో, అనంతరం సెంట్రల్, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీస్, సాయంత్రం చీఫ్ సెక్రటరీ, డిజిపి, సెక్రటరీస్‌తో ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌తో మీడియా సమావేశం నిర్వహించారు.

రాష్ట్రంలో మొత్తం 4.07 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని సిఇసి పేర్కొన్నారు. పురుష ఓటర్లు 1.99 కోట్ల మంది కాగా, మహిళా ఓటర్లు 2.07 కోట్ల మంది ఉన్నారన్నారు. ఓటు హక్కు ఎవరికైనా సరే రెండు చోట్ల ఉండకూడదన్నారు. రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే అటువంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. తుది జాబితా విడుదల ముందు ఎక్కడైనా ఓటరుగా రిజిస్టర్ చేసుకోవచ్చున్నారు.

ఎన్నికల్లో పెద్దయెత్తున ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతున్నామని, రాజకీయ పార్టీల నుంచి ఓటర్ల చేర్పులు, తొలగింపులు, ఎన్నికల అధికారులు అవలంభిస్తున్న వైఖరి, కేంద్ర బలగాలతో ఎన్నికలు నిర్వహించాలని, గిరిజన ప్రాంతాల్లో ఎక్కడికక్కడే పోలింగ్ మిగతా 7లో

9,836 గ్రామాల్లో వికసిత్ సంకల్పయాత్ర పూర్తి

- అజయ్‌జైన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 9,836 గ్రామాల్లో వికసిత్ సంకల్పయాత్ర పూర్తయ్యిందని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ వెల్లడించారు. విజయవాడలోని ఆటోనగర్‌లో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమం ఈ నెల 26 వరకు ఉంటుందన్నారు. ఈ యాత్ర కోసం కేంద్ర ప్రభుత్వం 121 వాహనాలను రాష్ట్రానికి పంపించిందన్నారు. ఈ యాత్ర సందర్భంగా ప్రజలకు కేంద్ర పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అందని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం, అందినవారి సక్సెస్ స్టోరీలను గుర్తిస్తున్నట్లు చెప్పారు. నోడల్ డిపార్టుమెంట్‌గా గ్రామ, వార్డు సచివాలయాలశాఖ వ్యవహరిస్తోందన్నారు. వికసిత్ సంకల్ప యాత్రలో భాగంగా 7 చోట్ల గవర్నరు పాల్గొన్నారని, విజయవాడ, హిందూపురంలలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ హాజరయ్యారన్నారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

బీచ్ శాండ్ తవ్వకాల టెండర్లు ఖరారు చేయొద్దు

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం, శ్రీకాకుళం జిల్లా గార మండలం పరిధుల్లో బీచ్ శాండ్ తవ్వకాల టెండర్లను ఖరారు చేయొద్దని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే టెండర్ల విషయంలో ప్రాజెక్టు డెవలపర్ అండ్ ఆపరేటర్ (పిడిఒ) ఎంపికకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను కొనసాగించేందుకు అనుమతినిచ్చింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర గనులశాఖ కార్యదర్శి, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ కార్యదర్శి, అణుశక్తి కార్యదర్శి, రాష్ట్ర గనులశాఖ కార్యదర్శి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఎమ్‌డిలను ఆదేశించింది. టెండర్లను ఆహ్వానిస్తూ గత ఏడాది డిసెంబరు 14న జారీ చేసిన డాక్యుమెంట్‌ను సవాల్ చేస్తూ విశాఖలోని అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన జెవిఎస్ మూర్తి వేసిన పిల్‌పై విచారణను వచ్చే నెల 21కి హైకోర్టు వాయిదా వేసింది.

అంగన్‌వాడీల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

అంగన్‌వాడీల సమ్మె వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 22కు విచారణను వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. అంగన్‌వాడీల సమ్మెను విరమింపజేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. కృష్ణా జిల్లాకు చెందిన న్యాయవాది కొలుసు ఉషారాణి వేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని భోజన విరామ సమయంలో (లంచ్‌మోషన్ పిటిషన్)పై విచారణ జరపాలని కోరారు. న్యాయవాది సుధాకర్ వాదిస్తూ.. అంగన్‌వాడీలు సమ్మె చేయడం వల్ల పౌష్టికాహారం అందక గర్భిణులు, శిశువులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనిపై ఎజి ఎస్ శ్రీరామ్ స్పందిస్తూ.. అంగన్‌వాడీల సమ్మె విరమింపజేసేందుకు ప్రభుత్వం చర్చలు జరుపుతోందన్నారు. ఎస్మా కూడా ప్రయోగించినట్లు చెప్పారు. ఇతర శాఖల ద్వారా సేవలకు అంతరాయం లేకుండా చేస్తున్నట్లు పేర్కొన్నారు. విధుల్లో చేరకపోతే చర్యలు తీసుకుంటామని నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

అభద్రతా భావంతోనే పార్టీ మారిన నాని : దేవినేని ఉమా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి నుంచి ఎంపి సీటు రాదన్న అభద్రతా భావంతోనే కేశినేని నాని పార్టీ మారారని మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. పదవి కోసం చంద్రబాబు నాయుడు, లోకేష్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిన్నటివరకు దుర్మార్గుడిలా కనిపించిన జగన్ ఇప్పుడు సన్మార్గుడు అయ్యాడా అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులతో లాలూచీ పడి పార్టీకి అన్యాయం చేశారని ఆరోపించారు.

నోటీసులకు భయపడం

- సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళనలు
- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె



విజయవాడ ధర్నా చౌక్‌లో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించినా, విధుల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడిన మొక్కవోని దీక్షతో 30 రోజులుగా అంగన్‌వాడీలు తమ ఆందోళనను కొనసాగిస్తూనే ఉన్నారు. ఎంపిడిఒ, ఐసిడిఎస్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టారు. రాష్ట్రవ్యాపంగా బుధవారం ఆందోళనలు కొనసాగాయి. అంగన్‌వాడీల ఇళ్లకు విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, మహిళా పోలీసులు షోకాజ్ నోటీసులు అంటించారు.

ఏలూరు జిల్లా కేంద్రంలోని సమ్మె శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ సందర్శించి మాట్లాడారు. అంగన్‌డీల ఉద్యమం ఆకలి ఉద్యమం అని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఆకలి విలువ తెలియదన్నారు. ఇలాంటి నీరో చక్రవర్తి పరిపాలనలో మరింత ఐక్యతతో కార్మిక సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీల మద్దతుతో మరింత పట్టుదలగా ఉద్యమించాలని కోరారు. కలిదిండిలో షోకాజ్ నోటీసులు జారీచేయడాన్ని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు.

నెల్లూరు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలకు మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మద్దతు తెలిపారు. తిరుపతి జిల్లా నాయుడుపేటలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. చిత్తూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె, రిలే దీక్షలు కొనసాగించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద మోకాళ్ళపై నిల్చుని నిరసన తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా మైలవరంలో గంగిరెడ్డుకు వినతిపత్రం ఇచ్చారు. శ్రీకాకుళంలోని జ్యోతిరావు పూలే పార్కు వద్ద 24 గంటల రిలే నిరాహార దీక్ష కొనసాగుతుంది. వైఎస్‌ఆర్, అన్నమయ్య జిల్లాల్లోని ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట బైటాయించి నిరసన కొనసాగించారు. అనంతపురం, శ్రీసత్యసాయి,. కర్నూలు, నంద్యాలలో నిరసన దీక్షలు చేపట్టారు.

గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో 30 సంఖ్య ఆకారంలో అంగన్‌వాడీలు కూర్చున్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట ప్రాజెక్టు పరిధిలోని పలువురు అధికారులు అంగన్‌వాడీల స్వగృహాలకు వెళ్లి షోకాజు నోటీసులిచ్చారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో 30 నంబర్ ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. అల్లూరి జిల్లా డుంబ్రిగుడలో థింసా నృత్యం చేస్తూ తమ పోరాటాన్ని కొనసాగించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో గడ్డిని తింటూ, కోలాటం నృత్యాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. నరసాపురంలో సమ్మెకు సిఐటియు రాష్ట్ర నాయకులు తులసీరామ్ సంఘీభావం తెలిపారు. విజయనగరం జిల్లాగజపతినగరంలో గర్భిణులు, బాలింతలు చిన్నారులతో సమ్మె శిబిరంలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఇళ్లకు నోటీసులు

అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం వడ్డాది, బుచ్చయ్యపేట, దిబ్బిడి, గున్నంపూడి, కొన్నంపూడి గ్రామాలకు చెందిన అంగన్‌వాడీల ఇళ్లకు విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, మహిళా పోలీసులు నోటీసులు అంటించారు. సబ్బవరంలో పది మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు నోటీసులు ఇచ్చారు. విశాఖ జిల్లా భీమునిపట్నం మండలంలో పలువురికి విలేజ్ పోలీసులు ఫోన్లు చేసి నోటీసులు వచ్చాయని సమాచారమిచ్చారు.

అంగన్‌వాడీ హెల్పర్ మృతి

బాపట్ల జిల్లా బల్లికురవ పంచాయతీ శివారు గ్రామమైన కొండాయపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో కొణిదెల అంజమ్మ (52) హెల్పర్‌గా పనిచేస్తున్నారు. సమ్మె ప్రారంభమైన దగ్గర నుంచి శిబిరంలో పాల్గొంటున్నారు. ఎస్మా చట్టం ద్వారా షోకాజ్ నోటీసులిస్తామన్న హెచ్చరికల నేపథ్యంలో అంజమ్మ తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. మంగళవారం స్పృహ తప్పిపడిపోయారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం మృతిచెందారు.

భూ హక్కు చట్టం రద్దు చేస్తాం

- ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు
- 'రా... కదలిరా' సభల్లో చంద్రబాబు



విజయనగరం జిల్లా బొబ్బిలి సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/కాకినాడ ప్రతినిధి

టిడిపి అధికారంలోకి వస్తే భూ హక్కు చట్టాన్ని రద్దు చేస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, విద్యుత్ ఛార్జీలు పెంచకుండా ఉండేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. విజయనగరం, కాకినాడ జిల్లాల్లో బుధవారం నిర్వహించిన 'రా కదలిరా' సభల్లో చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. జగన్ పాలనపై ధ్వజమెత్తారు. అంగన్‌వాడీలు కడుపు మంటతో పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగాలు ఊడదీస్తామంటూ ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని అదే అంగన్‌వాడీలు ఎన్నికల్లో ఓడించడం ఖాయమన్నారు. టిడిపి హయాంలో సంక్రాంతి, క్రిస్మస్ కానుకలు ఇచ్చామని గుర్తు చేశారు. అన్న క్యాంటీన్ ద్వారా రూ.5కే పేదలకు మూడు పూటలా అన్నం పెట్టామన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్లు మూసేసి పేదల పొట్టకొట్టారని విమర్శించారు. మద్యపాన నిషేధం అమలుచేయకపోగా.. టిడిపి అధికారంలో వస్తే ఐదేళ్లలో ఏటా 4 లక్షల చొప్పున 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఐటి రంగంలో ఇంటి దగ్గర నుంచే పనిచేసే విధానం తీసుకొస్తామని, నియోజకవర్గాల్లో వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకొచ్చిన జగన్ నిరంతరం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూనే ఉన్నారన్నారు. ఐదేళ్లలో రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడకపోగా నిత్యావసర ధరలు పెరిగాయని తెలిపారు. జాబ్ క్యాలెండర్, మెగా డిఎస్‌సి ఏమైందని జగన్‌ను ప్రశ్నించారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మంత్రి దాడిశెట్టి రాజా అక్రమాల రాజాగా మారారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వస్తే అమరావతే రాజధానిగా ఉంటుందని స్పష్టం చేశారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. అన్న క్యాంటీన్లు మళ్లీ ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చుతామని తెలిపారు.



పల్నాడు జిల్లా నరసరావుపేటలో మున్సిపల్ కార్మికులు భిక్షాటన



విజయవాడలో మున్సిపల్ కార్మికులతో కలిసి నినాదాలు చేస్తున్న ఎవి నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావు

భిక్షాటనతో మున్సిపల్ కార్మికుల నిరసన

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- 16వ రోజుకు చేరిన ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 16వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు వివిధ రూపాల్లో నిరసన ప్రదర్శనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చాలీచాలని వేతనాలు ఇస్తుందని, ధర్మం చేయండి అంటూ కార్మికులు భిక్షాటన చేశారు. వంటావార్పు, అర్ధనగ్న ప్రదర్శనలు, ముగ్గులు వేస్తూ నిరసనలు కొనసాగించారు. పలుచోట్ల పారిశుధ్య పనులు చేస్తున్న పోటీ కార్మికులను, చెత్త వాహనాలను అడ్డుకున్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విశాఖలోని మధురవాడలో చెత్త సేకరణకు వచ్చిన పోటీ కార్మికులను, వాహనాలను జివిఎంసి 5, 6, 7, 8 వార్డుల పరిధిలోని పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు. దీంతో 40 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. పి.ఎం.పాలెంలో కార్మికులు వంటా వార్పు చేశారు. విజయనగరం, రాజాంలో భిక్షాటన చేసి ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. నెల్లిమర్లలో మున్సిపల్ అధికారులు పోటీ కార్మికులతో పారిశుధ్య పనులు చేయించేందుకు ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో వేప కొమ్మలు పట్టుకొని, సాలూరులో సమ్మె 16 రోజులైన సందర్భంగా ఆ నెంబరు ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. శ్రీకాకుళంలో మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తిలు సందర్శించి సంఘీభావం తెలిపారు. చిత్తూరులో అర్ధనగ్న ప్రదర్శన, గుంటూరులో భిక్షాటన చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో అధికారులు పోటీ కార్మికులతో పనులు చేయిస్తుండగా సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకున్నారు. పిడుగురాళ్లలో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. వినుకొండలో వంటావార్పు నిర్వహించారు.

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, ఏలూరులో భిక్షాటన చేశారు. నంద్యాలలో భిక్షాటన, కర్నూలులో సాష్టాంగ నమస్కారం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా జగయ్యపేటలో మోకాళ్లపై నిరసన తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో భిక్షాటన, ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి నిరసన తెలిపారు. నెల్లూరులో నిరసన ర్యాలీ చేపట్టారు. తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, తిరుపతి, కృష్ణా, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వ్యాప్తంగా నిరసనలు కొనసాగించారు.

జంపింగుల జోరు

(మొదటిపేజీ తరువాయి)

తరువాత వలసలు ప్రారంభమయ్యాయి. ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్కం ఠాకూర్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేలు డేవిడ్ రాజు, డివై దాస్ కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సోదరి షర్మిల కాంగ్రెస్‌లో చేరడంతో మరికొంత మంది ఆ పార్టీలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇప్పటికే మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల వైసిపికి గుడ్‌బై చెప్పిన రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డితోపాటు ప్రస్తుతం పార్టీలో కొనసాగుతున్న విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైనట్లు సమాచారం. పెనమలూరు వైసిపి ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి టిడిపిలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థిగా మరోసారి అవకాశం కల్పించకపోతే ఎంపి లావు కృష్ణదేవరాయలు వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

వైసిపిలో చేరిన పదిరోజులకే రాజీనామా చేసిన క్రికెటర్ అంబటి రాయుడు ఇటీవల చర్చనీయాంశంగా మారారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో బుధవారం సమావేశమయ్యారు. ఎన్నికల తేదీలు దగ్గర పడేకొద్దీ ఈ జంపింగులు మరింత ఊపందుకునే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

చంద్రబాబు మోసగాడు : కేశినేని నాని

విజయవాడ అంటే తనకు ఎంతో ప్రేమ అని, చంద్రబాబు మోసగాడు అని ఎంపి కేశినేని నాని విమర్శించారు. టిడిపి కోసం ఎంతో శ్రమించినా అవమానాలకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలకు అండగా ఉన్న సిఎం జగన్ వెంట వుండాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. తన కుటుంబంలో చిచ్చుపెట్టి కొట్టించాలని చూశారని ఆరోపించారు. అమరావతి కడతానని చంద్రబాబు గొప్పలు చెబుతున్నారని పేర్కొన్నారు. విజయవాడ నిజం అయితే అమరావతి ఒక కల అని అన్నారు.

నియోజకవర్గ సభ్యులకు ఏమీ చేయలేకపోయా : సంజీవ్

పార్లమెంటు సభ్యునిగా తన నియోజకవర్గ ప్రజలకు ఏమీ చేయలేకపోయానని కర్నూలు ఎంపి సంజీవ్ కుమార్ అన్నారు. సమస్యలు సిఎం దృష్టికి తీసుకెళ్తే 'ఎమ్మెల్యేలు చూసుకుంటారు మీరు చూస్తూ ఉండండి' అని అనడం తనకు బాధించిందన్నారు.

పవన్ భావజాలం నాది ఒక్కటే : రాయుడు

జనసేన అధినేత పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు, ఆలోచనలు, తన భావజాలం, ఆలోచనలు ఒకేలా అనిపించాయని అంబటి రాయుడు ట్విట్టర్ (ఎక్స్)లో పేర్కొన్నారు. తన భావజాలానికి, వైసిపి సిద్ధాంతాలకు ఏమాత్రం సారుప్యత లేదని గ్రహించి ఆ పార్టీకి రాజీనామా చేశానని తెలిపారు. రాజకీయాలను వదిలేద్దామనుకున్నానని, తన సన్నిహితుల సూచనతో పవన్‌ను కలిశానని వివరించారు.

పండగలా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

- మంత్రులు రాజన్న దొర, చెల్లుబోయిన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణను రాష్ట్రంలో పండగ వాతావరణంలో నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పీడిత రాజన్న దొర, బిసి సంక్షేమం, సమాచారశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ తెలిపారు. ఈ నెల 19న విజయవాడలో జరిగే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తాడేపల్లిలో రాష్ట్రంలోని 139 కులాలకు సంబంధించి 56 బిసి కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఇతర కార్పొరేషన్లలోని ఛైర్మన్లు, డైరెక్టర్ల సమావేశం బుధవారం జరిగింది. శాసనమండలి విప్, పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జి లేళ్ల అప్పిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు మాట్లాడారు. అంబేద్కర్ సిద్ధాంతాలను, ఆశయాలను, లక్ష్యాలను నమ్మి సిఎం జగన్ రాష్ట్రంలో సామాజిక న్యాయం చేస్తున్నారన్నారు. విగ్రహం కింద ఏర్పాటు చేస్తున్న వేదికతో కలిపి 195 అడుగుల ఎత్తులో అంబేద్కర్ విగ్రహం కనిపిస్తుందన్నారు.

షోకాజ్ నోటీసులను ఉపసంహరించాలి

- అంగన్‌వాడీ సంఘాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలకు ఇచ్చిన షోకాజు నోటీసులు ఉపసంహరించుకోవాలని అంగన్‌వాడీ సంఘాలు కోరాయి. ఈ మేరకు బుధవారం ఎపి అంగన్‌వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(ఐఎఫ్‌టియు) రాష్ట్ర కార్యదర్శి వి.ఆర్.జ్యోతి ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు. డిసెంబరు 12 నుండి సమ్మె చేస్తుంటే 24 రోజుల తరువాత అత్యవసర సర్వీసులుగా గుర్తించి ఎస్మా ప్రయోగించిందని తెలిపారు. చట్టబద్ధంగా తాము నవంబరు 11న నోటీసు ఇచ్చామని పేర్కొన్నారు. సమ్మె చేయడం న్యాయపరమైన హక్కని పేర్కొన్నారు. దీనిపై ఎస్మా ప్రయోగించి సర్వీసు నుండి ఎందుకు తొలగించకూడదో చెప్పాలని ప్రభుత్వం కోరుతోందని తెలిపారు. బెదిరించడం మానుకుని, నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. చర్చలకు సిద్ధమని చెప్పినా షోకాజు ఇవ్వడాన్ని ఖండించారు. అంగన్‌వాడీ కేంద్రాలను తాళాలు పగుకొట్టి బలవంతంగా తెరిపించిందని, లబ్దిదారులు ఎవరూ కూడా కేంద్రాలకు రావడం లేదని పేర్కొన్నారు. వారెవరూ అంగన్‌వాడీలపై ఫిర్యాదు చేయలేదని తెలిపారు. ప్రభుత్వం ఈ వాస్తవాలను విస్మరించి అంగన్‌వాడీలపై కక్షగట్టిందని తెలిపారు. పిచ్చుకపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించడం మానుకుని, నోటీసు ఉపసంహరించుకుని చర్చలు జరపాలని వారు కోరారు.



మంత్రి బొత్సకు వినతిపత్రం అందజేస్తున్న దయా రమాదేవి తదితరులు

పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించాలి

- మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్
- మంత్రి బొత్సకు వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు పెండిగ్ వేతనాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ కోరింది. విజయవాడలో బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను యూనియన్ ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి, నాయకులు సమ్మక్క, ఎం లలితకుమారి, కె మణి కలిసి వినతిపత్రం అందించారు. పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, 12 నెలలకు వేతనాలు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు రూ.20కి పెంచాలని, ప్రమాదబీమా, సౌకర్యం కల్పించాలని కోరారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఇఎస్‌ఐ సౌకర్యం తదితర డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ వేతనాలను త్వరలో చెల్లిసామని మంత్రి నాయకులతో చెప్పారు.



ధర్నా చేస్తున్న స్టీల్ సిఐటియు, మిత్రపక్షాల నాయకులు

జిందాల్‌తో ఎంఒయును రద్దు చేయాలి

- స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



జిందాల్‌తో జరిగిన ఎంఒయును రద్దు చేయాలని, కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలని, బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్టీల్ సిఐటియు, దాని మిత్రపక్షాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ... ఉక్కు కార్మికుల సమస్యల పట్ల యాజమాన్యం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం పేరు చెప్పి స్థానిక స్టీల్ యాజమాన్యం తనకు పోటీదారుగా ఉన్న జిందాల్‌తో ఒప్పందం చేసుకోవడం విశాఖ స్టీల్ ప్రతిష్టకు భంగమేనని విమర్శించారు. ఒప్పందంతో అనేక లాభాలు కలుగుతాయని సిఎమ్‌డి అరచేతిలో వైకుంఠం చూపుతున్నారని మండిపడ్డారు. అనుమానాలను నివృత్తి చేయకపోవడం దారుణమన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ.. ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమాలు చేస్తుంటే చూసి తట్టుకోలేక కార్మిక వర్గాన్ని ఆర్థికంగా దెబ్బతీయడం కోసం నూతన వేతనాలను అమలు చేయడం లేదన్నారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, మిత్రపక్షాల నాయకులు డివి.రమణారెడ్డి, డి.సురేష్ బాబు, సిహెచ్.సన్యాసిరావు మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ యాజమాన్యం అనాలోచిత నిర్ణయాల వల్ల కార్మికులు సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గత సంవత్సరం రూ.9500, ఈ సంవత్సరం రూ.8000ను బోనస్‌గా యాజమాన్యం చెల్లించలేదని తెలిపారు. ఆ సమస్యలను పరిష్కరించకుండా యాజమాన్యంతో గుర్తింపు యూనియన్ సహజీవనం సాగిస్తోందని విమర్శించారు. ధర్నాలో నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, యు.వెంకటేశ్వర్లు, కె.గంగాధర్, టివికె.రాజు, మిత్రపక్షాలైన డివిఆర్‌ఎస్‌ఇసి, సిఎఫ్‌టియుఐ, ఎఐసిటియు సంఘాల నాయకులు గల్లా శంకరరావు, కర్ర ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే వైఎస్‌ఆర్ కుటుంబానికి గుర్తింపు

- ఎఐసిసి రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్కం ఠాకూర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ ఎంతో గుర్తింపునిచ్చిందని, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కలను సాకారం చేసేందుకే ఆయన కుమార్తె వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరారని ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్కం ఠాకూర్ అన్నారు. ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జిగా మాణిక్కం ఠాకూర్ మొదటిసారి విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌కు రావడంతో ఆయనకు పిసిసి ఘనస్వాగతం పలికింది. పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, సిడబ్ల్యుసి సభ్యులు ఎన్ రఘువీరారెడ్డి, కేంద్ర మాజీ మంత్రులు జెడి శీలం, పళ్లం రాజు తదితరులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు డేవిడ్‌రాజు, డివై దాసుతోపాటు సినీ నిర్మాత కళ్యాణ్ చక్రవర్తి, తదితరులు మాణిక్కం ఠాకూర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ రెండో విడత చేపట్టనున్న భారత్ జోడో న్యాయ యాత్రకు సంబంధించిన పోస్టరు, స్టిక్కరు, బ్యాడ్జీలను వారు ఆవిష్కరించారు. దేశంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని ప్రజలకు చాటి చెప్పేందుకే రాహుల్ గాంధీ రెండో విడత పాదయాత్రను చేపట్టనున్నారన్నారు. రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బిజెపికి బి టీమ్‌గా అన్ని ప్రజా వ్యతిరేక విధానాలకు మద్దతుగా నిలిచిందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా, మైనార్టీలకు వ్యతిరేకంగా సిఎఎ తెచ్చినా జగన్ ప్రభుత్వం వ్యతిరేకించలేదని అన్నారు. రాష్ట్రంలోని ఎంపిలంతా బిజెపికి అనుకూలంగా వున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 2024 ఎన్నికలకు కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైఎస్ షర్మిలకు కాంగ్రెస్‌లో తగిన ప్రాధాన్యత వుంటుందన్నారు.

మున్సిపల్ కార్మికుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక మున్సిపల్ కార్మికుడు ఆత్మహత్య పాల్పడ్డారు. తన ఆత్మహత్యకు గల కారణాలను సెల్ఫీ వీడియో తీసి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన నంద్యాల జిల్లా మహానంది మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల మారుతి నగర్‌కు చెందిన హరికృష్ణ (29) మున్సిపాల్టీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నారు. మాజీ కౌన్సిలర్, వడ్డీ వ్యాపారి కన్నయ్య అధిక వడ్డీకి రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నారు. సమ్మె కారణంగా జీతాలు రాక వడ్డీ చెల్లించలేక పోయారు. కొద్ది రోజులు ఆగాలని హరికృష్ణ ఎంత చెప్పినా వినకుండా కన్నయ్య అప్పు చెల్లించాలని బెదిరించారు. దీనితో తీవ్ర ఆందోళనకు గురై రైలు కిందపడి హరికృష్ణ ఆత్మహత్య చేసుకున్నారు. వడ్డీ వ్యాపారి కన్నయ్య తనను బెదిరించినట్లు హరికృష్ణ సెల్ఫీ వీడియో తీసుకున్నారు. తన పిల్లలకు న్యాయం చేయాలని వీడియోలో పేర్కొన్నారు. హరికృష్ణ ఆత్మహత్య విషయం తెలిసిన వెంటనే కార్మికులు, కార్మిక సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హరికృష్ణ మృతికి కారణమైన వడ్డీ వ్యాపారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంతవరకు మృతదేహాన్ని పోస్టుమార్టం చేయొద్దంటూ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

ధాన్యం కొనుగోళ్లకు ఆన్‌లైన్ చిక్కులు

- చిన్న మిల్లులకు వెల్లువెత్తుతున్న ధాన్యం
- అన్‌లోడింగ్‌కు రెండు, మూడు రోజుల నిరీక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లా పలాస మండలం సున్నాడికి చెందిన కుమ్మరి సింహాద్రి అనే రైతు రెండు ఎకరాల్లో వరి సాగు చేశారు. 60 బస్తాల (80 కేజీలు) దిగుబడి వచ్చింది. ధాన్యం అమ్ముకునేందుకు స్థానికంగా ఉన్న లొద్దభద్ర ఆర్‌బికెకు తీసుకువెళ్లి వివరాలు నమోదు చేయించుకున్నారు. ధాన్యాన్ని పలాసలోని ఓ మిల్లుకు కేటాయించారు. మిల్లు దగ్గర అన్‌లోడింగ్ చేయించడానికి నానా అవస్థలు పడ్డారు. మూడు రోజుల పాటు మిల్లుకు సమీపంలోనే పడిగాపులు కాస్తున్నారు. బూర్జ మండలం కింతలి చెందిన ఆర్.పకీరునాయుడు మూడు ఎకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశారు. 120 బస్తాలు వచ్చాయి. అమ్ముకునేందుకు అక్కి గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి వెళ్లగా వివరాలను నమోదు చేసిన సిబ్బంది గార మండలంలోని ఓ మిల్లుకు తరలించాలని చెప్పారు. కింతలి నుంచి సుమారు 55 కిమీ దూరంలోని మిల్లుకు తీసుకు వెళ్లేందుకు అద్దెకు వాహనాన్ని తీసుకుని తరలించారు. సరుకు చూసిన మిల్లరు 10 కేజీలు అదనంగా అడిగారు. ఎనిమిది కేజీలు ఇస్తానని బేరం కుదుర్చుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఉదయం 11 గంటలకు తీసుకు వెళ్లిన ఆ రైతు రాత్రి 10 గంటలకు తిరుగు ముఖం పట్టారు.


పలాసలోని ఓ మిల్లుకు వచ్చిన ధాన్యం ట్రాక్టర్లు

ఎదురవుతున్న ఇబ్బందులు

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఇప్పటి వరకు 3,99,857 మంది రైతుల నుంచి 24.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. వీటి విలువ రూ.5302.09 కోట్లుగా ఉంది. గత రెండేళ్లుగా ఆన్‌లైన్‌లోనే ధాన్యం కొనుగోలు చేస్తున్నా ఈ సంవత్సరం ఆ ప్రక్రియ కొంత క్లిష్టతరంగా మారింది. రాష్ట్రంలో రాజకీయ పలుకుబడి, పైరవీలు చేసే మిల్లర్లే అధిక పరిమాణంలో ధాన్యం తీసుకుంటున్నారని గుర్తించిన ప్రభుత్వం ఈసారి అందరికీ ధాన్యం కేటాయించాలని నిర్ణయించింది. చిన్న మిల్లర్లకు నష్టం రాకూడదని తీసుకున్న ఈ నిర్ణయం రైతులకు తీవ్ర ఇబ్బందులను తెచ్చి పెడుతోంది. చిన్న మిల్లుల కెపాసిటీ తక్కువ ఉండటంతో ధాన్యాన్ని తగినంత స్థలం లేకపోవడంతో అన్‌లోడింగ్‌కు రెండు, మూడు రోజుల పాటు మిల్లుల వద్దే ధాన్యం బస్తాలను తీసుకువెళ్లిన ట్రాక్టర్లు ఉండిపోతున్నాయి. రొటేషన్ పద్ధతిలో మిల్లులకు ధాన్యం కేటాయించాల్సి ఉన్నా... చిన్న మిల్లులకు ధాన్యం వెల్లువలా వచ్చి పడుతున్నాయి. తమకు లోడ్లు ఆపాలని చిన్న మిల్లర్లు సైతం జిల్లా అధికారులు మొత్తుకుంటున్నా... సమస్య పరిష్కారం కావడం లేదు. రాష్ట్ర స్థాయిలోనే ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంటుందని అటు అధికారులు, మిల్లర్లు చెబుతున్నారు.

అన్‌లోడింగ్‌కు రైతుల నిరీక్షణ

ధాన్యం తరలింపులో రైతులకు వ్యయ ప్రయాసలు తప్పడం లేదు. గతేడాది ఒక మండలంలోని రైతులకు వేర్వేరు మండలాల్లోని మిల్లులకు ధాన్యం కేటాయించారు. వీటిని తరలించడానికి రైతులు నానాపాట్లు పడ్డారు. ఈ సంవత్సరం అటువంటి సమస్య ఉత్పన్నం కాదని అధికారులు చెప్పినా అదే పునరావృతం అవుతోంది. అమ్మిన ధాన్యాన్ని 40 నుంచి 50 కిమీ దూరంలో ఉన్న మిల్లులకు తరలించడానికి అన్నదాతలు నానాపాట్లు పడుతున్నారు. ఆన్‌లైన్ ఇబ్బందులు, అన్‌లోడింగ్ సమస్యలతో దళారుల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ధాన్యం అమ్మకంలో రూ.200 నుంచి రూ.300 నష్టపోయినా సరే ఇబ్బందులు ఎవరు పడతారంటూ కమీషన్ ఏజెంట్లకే ఇచ్చేస్తున్నారు. దానికి అదనంగా రెండు, మూడు కేజీలు ధాన్యమిస్తున్నారు. ఆమదాలవలస మండలం ఇసకలపేట గ్రామానికి చెందిన తమ్మినేని నర్సింగరావు 33 ధాన్యం బస్తాలను (80 కేజీలు) బస్తా రూ.1400కు ఇచ్చారు. వాస్తవానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం బస్తాకు రూ.1746.40 రావాల్సి ఉంది. ధాన్యానికి ఎక్కువ ధర కోసం ఓపికతో ఉన్న రైతులు కొనుగోలు కేంద్రం వద్ద నిరీక్షిస్తున్నారు. రబీ సీజన్ పనులు, ధాన్యం కొనుగోలు ఇబ్బందులతో పాటు రబీ సీజన్ పనులు ఉన్న వారు మాత్రం కమిషన్ ఏజెంట్లకే తమ ధాన్యాన్ని ఇచ్చేస్తున్నారు.

ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు దుగ్గి చెన్నారెడ్డి మృతి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం, విస్సన్నపేట



ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమంలో చీఫ్ కొరియర్‌గా పనిచేసిన దుగ్గి చెన్నారెడ్డి (97) బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. వృద్ధాప్య కారణంగా ఎన్‌టిఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం ముచ్చినపల్లి గ్రామంలోని తన స్వగృహంలో మృతి చెందారు. సాయంకాలం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు కుమారుడు శ్రీనివాసరెడ్డి, కుమార్తె అరుణకుమారి ఉన్నారు. ఆయన భార్య స్వరాజ్యమ్మ ఏడేళ్ల క్రితం చనిపోయారు. ఐదో తరగతి వరకు చదువుకున్న ఆయన అప్పటి తిరువూరు తాలూకా ప్రాంతంలో జమీందారులు, భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా నిలబడ్డారు. కమ్యూనిస్టు పార్టీ నిషేధ కాలంలో రహస్యంగా పార్టీ కొరియర్‌గా పనిచేశారు. 1946లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకుని శాఖ కార్యదర్శిగా పనిచేశారు. విస్సన్నపేట మండలం పుట్రేలలో కమ్యూనిస్టు పార్టీకి తోడ్పాటునందించారు. ఆయన కుమారుడు దుగ్గి శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యాయుడిగా ఉంటూ యుటిఎఫ్ మాజీ ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శిగా పనిచేశారు.

పలువురు నేతల నివాళి

చెన్నారెడ్డి మృతి పట్ల సిపిఎం సీనియర్ నాయకులు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మాజీ చైర్మన్ బిఆర్.తులసీరావు సంతాపం తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన నిర్వహించిన పాత్రను గుర్తుచేసుకున్నారు. భౌతికకాయాన్ని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కష్ణ సందర్శించి నివాళులర్పించారు.


నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి సమస్యను వివరిస్తున్న రైతులు

పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్‌కు భూమివ్వం

- నంద్యాల జాయింట్ కలెక్టర్‌కు రైతుల వినతి

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

గ్రీన్ కో పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్‌కు తమ భూమి ఇవ్వబోమని బాధిత రైతులు తేల్చి చెప్పారు. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం యాగంటి, పాతపాడు, పసుపల, పత్తేనగరం, కటికవానికుంట తదితర గ్రామాల రైతులు నంద్యాల జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ గ్రామాల పరిధిలో దాదాపు 650 ఎకరాల సారవంతమైన భూమి ఉందని, ఏడాదికి రెండు సార్లు పంటలు పండుతాయని, 350 మంది రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. దీనికి తోడు పశుసంపదనూ ఈ పొలాల ఆధారం చేసుకుని పోషిస్తున్నామని చెప్పారు. ఇలాంటి ఈ భూమిని పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్ కోసం తమ అనుమతులు లేకుండానే అధికారులు సర్వే చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ ప్రాజెక్టుకు భూములిస్తే తమ కుటుంబాలు వీధినపడతాయని, తమ పిల్లల భవిష్యత్తు అంధకారం అవుతుందని విన్నవించారు. వినతి పత్రం అందజేసినవారిలో ఆయా గ్రామాల రైతులు గడ్డం వెంకట్రామిరెడ్డి, బెడదల నారాయణరెడ్డి, దొర్నిపాటి వెంకటేశ్వర్లు, బెడదల రామేశ్వరరెడ్డి, జక్కల అశోక్ చక్రవర్తి, చెంచు విజయకుమార్ తదితరులు ఉన్నారు..

టిడిపి గెలిస్తే వలంటీర్లు ఉండరు : మంత్రి ధర్మాన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి అధికారంలోకి వస్తే తొలి వేటు వలంటీర్లపైనే పడుతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. బుధవారం గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సభకు ఎమ్మెల్యే మద్దాలిగిరి అధ్యక్షత వహించారు. మంత్రి ధర్మాన మాట్లాడుతూ... తక్కువ వేతనంతో ఎక్కువ సేవలు అందిస్తున్న వలంటీర్లు... వృద్ధులు, వికలాంగులకు వారి పిల్లల కన్నా ఎక్కువ శ్రద్ధ పెట్టి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని నిలబెట్టుకునేందుకు వలంటీర్లు కృషి చేయాలన్నారు. వైసిపి గెలవకపోతే మీరు ఉండరు...మేం ఉండమని వ్యాఖ్యానించారు. అందువల్ల టిడిపి గెలవకుండా వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు వాస్తవ పరిస్థితులు వివరించాలని హితబోధ చేశారు. మంత్రి విడదల రజనీ మాట్లాడుతూ.. అక్కసుతోనే వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


కాకినాడలో బైకు ర్యాలీని నిర్వహిస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించే దాకా సమ్మె

22వ రోజుకు చేరిన ఎస్ఎస్ఎ ఉద్యోగుల ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

తమను రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 22 రోజులుగా సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు.. సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని వారు హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు బుధవారం వివిధ రూపాల్లో సమ్మె కొనసాగించారు. నెల్లూరులో జెఎసి నాయకులు మాట్లాడుతూ ఎన్ని ప్రలోభాలకు గురిచేసినప్పటికీ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. 22 రోజుల నుంచి సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష అనేది ప్రాజెక్టా? లేక సోసైటీనా అనేదానిపై రాష్ట్రంలోని జిల్లా అధికారులు స్పష్టతనివ్వాలని కోరారు. గతంలో ఇది సొసైటీ అంటూ జిఒలు రిజిస్ట్రేషన్లు జరిగాయని ఆరోపించారు. ఉద్యోగులను బెదిరించడానికి చూపించే అంత శ్రద్ధ ఉద్యోగుల సమస్యలు పరిష్కారంచడంలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాపట్లలో ఆకులు తింటూ నిరసనలు తెలిపారు. రాష్ట్ర సిఆర్‌పిల సంఘం అధ్యక్షులు గిరి శ్రీనివాస్ మద్దతు తెలిపారు. కాకినాడలో బైకు ర్యాలీ నిర్వహించారు. ఏలూరులో ఒంటి కాలిపై నిలబడి వినూత్నంగా, పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో గంగిరెద్దుకు వినతిపత్రం అందజేసి నిరసనలు తెలిపారు. అనంతపురం, సత్యసాయి జిల్లా, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లా, ఉమ్మడి చిత్తూరు జిల్లా, నెల్లూరు, గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లా, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అనకాపల్లి, విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లాలో సమ్మె శిబిరాలలో నిరసనలు కొనసాగాయి.

చేనేత కార్మికురాలి బలవన్మరణం

ప్రజాశక్తి-వేటపాలెం (బాపట్ల జిల్లా)

అప్పుల బాధతో చేనేత కార్మికురాలు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన బాపట్ల జిల్లా వేటపాలెంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొణిజేటి చేనేతపురికి చెందిన లేళ్ల విజయలక్ష్మి (44) చేనేత పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆమె భర్త ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నారు. కుమారుడి చదువు, వ్యాపారం నిమిత్తం ప్రయివేటు వ్యక్తుల వద్ద అప్పు చేశారు. ఆ అప్పు తీర్చేందుకు మరొకరి దగ్గర అప్పులు చేసి పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మొత్తం రూ.10 లక్షల వరకు అప్పు తేలడంతో ఉన్న ఇంటిని అప్పుల వాళ్లకు ఇచ్చేసి.. సగం బాకీ తీర్చారు. మిగతా రూ.5 లక్షల తీర్చాలని వేధించడంతో ఆమె ఇంటిలోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వతంత్రంగానే పోటీ

- కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - రాయదుర్గం



రానున్న అసెంబ్లీ ఎన్నికలలో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల నుంచి తాను, తన కుటుంబ సభ్యులు ఎన్నికల బరిలో ఉంటామని రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి చెప్పారు. అమరావతిలో తాను వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన అనంతరం బుధవారం రాయదుర్గంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలుత తనకు కళ్యాణదుర్గం అసెంబ్లీ టికెట్ ఇస్తామని చెప్పిన అధిష్టానం అనంతరం టికెట్ ఇవ్వడం లేదని చెప్పిందన్నారు. దీంతో నిరాశ చెందానని తెలిపారు. తాను స్వతంత్ర అభ్యర్థిగానైనా కళ్యాణదుర్గంలో పోటీలో ఉండాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నుండి టికెట్ వచ్చినా కళ్యాణదుర్గం నుంచి పోటీకి సిద్ధమన్నారు. సిడబ్ల్యూసి సభ్యులు రఘువీరారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- 5 ట్రిలియన్ డాలర్లకు చేరొచ్చు
- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశం
- ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్



గాంధీనగర్ : మానవభివృద్ధి సూచీలో అట్టడుగున వున్న భారత్ వచ్చే నాలుగేళ్లలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సెలవిచ్చారు. 2027-28 ఆర్థిక సంవత్సరం నాటికి భారత జిడిపి ఐదు ట్రిలియన్ డాలర్లు (దాదాపు రూ.415 లక్షల కోట్లు)గా ఉండొచ్చని అంచనా వేశారు. బుధవారం గాంధీనగర్‌లో జరిగిన వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌లో మంత్రి సీతారామన్ మాట్లాడుతూ.. భారత్ మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం భారతదేశం దాదాపు 3.4 ట్రిలియన్ల డాలర్ల (దాదాపు రూ.282 లక్షల కోట్లు) జిడిపితో ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందన్నారు. అమెరికా, చైనా, జపాన్, జర్మనీలు భారత్ కన్నా ముందున్నాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతం వృద్ధి రేటు నమోదయ్యే అవకాశాలున్నాయన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో జిడిపి 7.2 శాతం పెరిగిందన్నారు. దేశంలో 2014 నాటికి 15 కోట్ల బ్యాంక్ ఖాతాలు ఉండగా.. ప్రస్తుతం 50 కోట్ల మందికి పైగా బ్యాంకు ఖాతాలను కలిగి ఉన్నారన్నారు. గడిచిన 23 ఏళ్లలో భారత్‌కు 919 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయన్నారు. ఈ ఎఫ్‌డిఐలో 65శాతం అంటే 595 బిలియన్ డాలర్లు గత ఎనిమిది తొమ్మిది సంవత్సరాల్లో వచ్చాయన్నారు. తయారీలోనే కాకుండా సర్వీస్ సెక్టార్‌లోనూ ఎఫ్‌డిఐలు వస్తున్నాయన్నారు. 2047 నాటికి భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్ల పూర్తికానున్న అమృతకల్ సందర్భంగా కొత్త పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కోవిడ్ అనంతర సవాళ్లను భారతదేశ ప్రజలు ఎదుర్కొన్నారన్నారు. 2047 నాటికి దేశ జిడిపి 30 ట్రిలియన్ డాలర్లకు చేరి.. అభివద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారనుందన్నారు.

అత్యంత విజయవంతమైన ప్రధాని మోడి : ముకేష్ అంబానీ



భారత దేశ చరిత్రలోనే నరేంద్ర మోడి అత్యంత విజయవంతమైన ప్రధానిగా నిలువనున్నారని ముకేష్ అంబానీ అన్నారు. వైబ్రెంట్ గుజరాత్ సమ్మిట్‌లో అంబానీ మాట్లాడుతూ.. ఈ తరంలో ప్రపంచంలోనే గొప్ప నాయకుడని ప్రశంసించారు. భారత ప్రధాని తన పట్టుదల, సంకల్పంతో అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తారన్నారు. గుజరాత్‌లోని హజీరాలో దేశంలోనే తొలి ప్రపంచ స్థాయి కార్బన్ ఫైబర్ ఫెసిలిటీని ఏర్పాటు చేస్తామన్నారు. గడిచిన పదేళ్లలో దేశ వ్యాప్తంగా రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులతో ప్రపంచ స్థాయి ప్రాజెక్టులను చేపట్టామన్నారు. దీంట్లో మూడో వంతు గుజరాత్‌లోనే వెచ్చించినట్లు వెల్లడించారు. 2047 నాటికి భారత్ 35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అన్నారు. దీన్ని ఏ శక్తీ అడ్డుకోలేదన్నారు. ఒక్క గుజరాత్ రాష్ట్రమే మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందని అంచనా వేశారు.

గుజరాత్‌లో అదాని గ్రూప్ రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు



వచ్చే ఐదేళ్లలో గుజరాత్‌లో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు అదాని గ్రూపు ఛైర్మన్ గౌతం అదాని వెల్లడించారు. 2025 నాటికి రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల్లో రూ.55 వేల కోట్ల వ్యయం చేయనున్నామన్నారు. ప్రధాని మోడి దేశ భవిష్యత్తు గురించి ఆలోచించడమే కాకుండా.. ఆచరణలోనూ తీర్చిదిద్దారన్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించబోతోందన్నారు. గుజరాత్ కచ్ జిల్లాలోని ఖావ్‌డాలో ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన పార్కును నిర్మిస్తున్నట్లు అదాని తెలిపారు.

3 నెలల్లో రూ.లక్ష కోట్లు!

- వ్యయంపై తాజా అంచనా
- నిధుల సమీకరణపై ఆర్థికశాఖ ఆపసోపాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా మూడు నెలలే ఉంది. ఖర్చులు మాత్రం భారీగా కనిపిస్తున్నాయి. ఈ మూడు నెలల కాలాన్ని ఆర్థికంగా అధిగమించేందుకు ఏకంగా రూ.లక్ష కోట్ల వరకు కావాల్సి ఉంటుందని రాష్ట్ర ఆర్థికశాఖ అభిప్రాయపడుతోంది. ప్రధానంగా ఎన్నికలకు చివరి మూడు నెలల కాలం కావడంతో ఖర్చులు కూడా ఎక్కువగా ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంత భారీ నిధులను ఎలా సమీకరించాలన్నది కూడా అంతుచిక్కని ప్రశ్నగానే కనిపిస్తోంది.

రాష్ట్ర బడ్జెట్‌లో పొందుపరిచిన అంచనాల మేరకు సగటున ప్రతినెలా రూ.19 వేల కోట్లు నుంచి రూ.20 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. ఇందులో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయంతోపాటు, కేంద్రం నుంచి వచ్చిన నిధులు, ఇతరత్రా సేకరించే రుణాలు కలుపుకుని ఉంటాయి. వీటితోనే మొత్తం ఏడాదిలో ఖర్చులను కూడా అధిగమించాల్సి ఉంటుంది. అయితే ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చివరి మూడు నెలలు మరిన్ని ఎక్కువ నిధులు కావాల్సి ఉంటుందని ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు. తొలి తొమ్మిది నెలల కాలంలో అనేక పథకాలకు నిధుల్లో కోతలు విధించారు. లబ్ధిదారుల సంఖ్యను కూడా కొంతవరకు కుదించినట్లు విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు మాత్రం పాత బకాయిలతోపాటు కొత్త నిధులను కూడా ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా సంక్షేమ కార్యక్రమాలు, నేరుగా నగదు బదిలీ, పింఛన్లు, వేతనాలు వంటివాటి అమలుకే చివరి మూడు నెలల్లో రూ.50 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని ఒక అంచనా. వీటికి అదనంగా ఇతర అభివృద్ధి కార్యక్రమాలు, చేసిన అప్పులకు వాయిదాలు, వడ్డీల చెల్లింపులు, ఇతర అత్యవసరాలకు మరిన్ని రూ.వేలకోట్లు కావాల్సి ఉంటుందని వారు చెబుతున్నారు. సగటున నెలకు రూ.30 వేల కోట్లకుపైగా నిధులను సమకూర్చుకోవడం అన్నది పెద్ద సవాల్‌గా ఉంటుందన్న భావాన్ని ఆర్థికశాఖ వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే భారీగా రుణాలను తీసుకుంటూ కాలం నెట్టుకొస్తోంది. సొంత పన్నుల ఆదాయం అనుకున్న స్థాయిలో రాకపోవడం, గతేడాది కన్నా కొంతవరకు తక్కువగా వస్తున్న కారణంగా భారీ నిధుల సమీకరణ కష్టమేనన్న భావాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. అయితే అవసరమైతే మరిన్ని అప్పులు తీసుకొచ్చయినా సరే అవసరాలను తీర్చాలని ఆర్థికశాఖకు ప్రభుత్వం స్పష్టం చేస్తున్నట్లు తెలిసింది.



బిగ్ సిలో సంక్రాంతి ఆఫర్లు

హైదరాబాద్ : ప్రముఖ మొబైల్ రిటైల్ చెయిన్ బిగ్ సి సంక్రాంతి పండుగ సందర్భంగా వినూత్న ఆఫర్లను అందిస్తున్నట్లు ప్రకటించింది. తమ 250కి పైగా స్టోర్లలో మొబైల్ కొనుగోళ్లపై రూ.3,000 వరకు ఇన్‌స్టాంట్ డిస్కౌంట్‌తో పాటు రూ.4,999 విలువగల స్మార్ట్ వాచ్‌ను ఉచితంగా అందిస్తున్నామని బిగ్‌సి ఫౌండర్, సిఎండి యం బాలు చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. దీనితో పాటు స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.1,10,000 విలువగల హెల్త్‌కేర్‌కు సంబంధించిన ప్రయోజనాలను ఉచితంగా లభిస్తాయన్నారు. ప్రతీ ఫోన్, ల్యాప్‌టాప్, స్మార్ట్ టివి కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతి సహ క్యాష్‌బ్యాక్ పొందవచ్చన్నారు. ఐఫోన్ మొబైల్ కొనుగోలుపై రూ.4,000 వరకు, వన్‌ప్లస్, రియల్‌మీ మొబైల్స్ కొనుగోళ్లపై రూ.3,000 వరకు ఇన్‌స్టాంట్ డిస్కౌంట్ అందిస్తున్నామన్నారు. ఈ సంక్రాంతికి తాము అందిస్తున్న ప్రత్యేక ఆఫర్లను వినియోగదారులు ఉపయోగించుకోవాలని బాలు చౌదరి కోరారు.

ఆథెర్ 450ఎస్‌పై రూ.20వేల తగ్గింపు..

న్యూఢిల్లీ : విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీదారు ఆథెర్ ఎనర్జీ తన అథెర్ 450ఎస్ స్కూటర్‌పై భారీ తగ్గింపును ప్రకటించింది. ఈ ఇవి స్కూటర్‌పై రూ.20,000 మేర తగ్గించినట్లు ఆ సంస్థ తెలిపింది. దీంతో బెంగళూరులో అథెర్ 450ఎస్ ధర రూ.1.09 లక్షలకు, ఢిల్లీలో రూ.97,500కు లభ్యం కానుందని ఆ సంస్థ పేర్కొంది.



హ్యాపీ మొబైల్స్ స్టోర్స్‌లో సంక్రాంతి డిస్కౌంట్లు

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో 85పైగా స్టోర్లు కలిగిన హ్యాపీ మొబైల్స్ సంక్రాంతి పండుగ ప్రత్యేక డిస్కౌంట్లను అందిస్తున్నట్లు ప్రకటించింది. మొబైల్ ఫోన్లు, ఎల్ఇడి స్మార్ట్ టివిలు, ల్యాప్‌టాప్‌లపై అద్భుతమైన ఆఫర్లను పొందవచ్చని ఆ సంస్థ యాజమాన్యం పేర్కొంది. ప్రతీ కొనుగోలుపై 5 శాతం వరకు క్యాష్‌బ్యాక్ పొందే అవకాశం ఉందని తెలిపింది. తమ వినియోగదారులకు ఆన్‌లైన కన్నా అద్భుతమైన స్పెషల్ డిస్కౌంట్స్‌ను అందిస్తున్నామని పేర్కొంది. స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుపై డిస్కౌంట్‌తో పాటుగా స్మార్ట్ కాలింగ్ వాచ్‌ను పూర్తిగా ఉచితంగా ఇవ్వనున్నామని వెల్లడించింది. పలు స్మార్ట్‌ఫోన్లపై అత్యధికంగా 38 శాతం వరకు రాయితీ పొందవచ్చని తెలిపింది. ఎక్స్ఛేంజీ ఆఫరును ఇస్తున్నామని పేర్కొంది. హ్యాపీ స్టోర్లలో 300కు పైగా మోడల్స్, 500కు పైగా రకాల యాక్సరీలు విక్రయాల కోసం అందుబాటులో ఉంటాయని తెలిపింది.

సంపాదకీయం


వృద్ధి కొందరికే

జాతీయ గణాంకాల శాఖ కొద్దిరోజుల క్రితం విడుదల చేసిన ఆదాయ ముందస్తు అంచనాలు భిన్న దృశ్యాలను ఆవిష్కరిస్తున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విడుదలైన ఈ మొదటి అంచనాలు వృద్ధిలో పెరుగుదలను ప్రతిపాదిస్తూనే సరుకుల డిమాండ్ మాత్రం అంతంతమాత్రంగానే ఉంటుందని పేర్కొంది. కీలకమైన సేవా రంగంలో సైతం పురోగతి అంతంతమాత్రంగానే ఉంటుందని అంచనా వేసింది. మరో మాటలో చెప్పాలంటే సరుకుల, సేవల వినియోగం కరోనా మహమ్మారి విరుచుకుపడిన ముందు సంవత్సరాలతో పోలిస్తే వెనుకబాటే! ప్రైవేటు వినియోగం ఇంకా కుంటుతూనే ఉంది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పట్టణాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ కొనుగోలు శక్తి ఇప్పుడప్పుడే పుంజుకునే అవకాశం లేదని గణాంకశాఖ అంచనా! మెట్రోపాలిటన్ సిటీల్లో కొంతమేర కొనుగోళ్లు జోరుగా సాగుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ అది కూడా పాక్షికమేనని, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అధ్యయనం జరిగితే ఇక్కడ కూడా అనేక వైరుధ్యాలు బయటపడతాయని, మెట్రో పాలిటన్‌లో కనపడుతున్న అరకొర మెరుపు మేడిపండు తీరేనని నిపుణులు అంటున్నారు. దీని అర్థం ఏమిటి? డిమాండ్ లేని వృద్ధి చెబుతున్న దేమిటి? వృద్ధి ఫలాలు నిజంగా ప్రజలందరికీ అందితే, వారి కొనుగోలు శక్తి ఎందుకు పెరగదు? ఈ ప్రశ్నలకు జవాబు స్పష్టం. నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా వృద్ధి దేశంలోని కొందరికే పరిమితమౌతోంది. ఫలితంగా అసమానతలు కొనసాగడమే కాక, ఏడాదికేడాదికి తీవ్రమౌతున్నాయి. ప్రజానీకం సృష్టిస్తున్న సంపదలో 30 శాతం ఒక శాతంగా ఉన్న కొద్దిమంది వద్ద పోగుపడుతుండగా, అట్టడుగున ఉన్న 25 శాతం మంది చేతిలో కేవలం 11 శాతం మాత్రమే ఉంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిడిపి 7.3 శాతానికి చేరుకుంటుందని గణాంక శాఖ అంచనా వేసింది. ఇది గత (2022-23) ఆర్థిక సంవత్సరానికన్నా ఎక్కువ. అదే సమయంలో జివిఎ (గ్రాస్ వాల్యు యాడెడ్ గ్రోత్) ఏడు శాతం నుండి 6.9 శాతానికి తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన రంగాల్లో వృద్ధి అంతంతమాత్రంగానో, లేదా గతానికన్నా తక్కువగానో ఉండటం దీనికి కారణం. వ్యవసాయం, పశుసంపద, అటవీ, మత్స్య రంగాల్లో వృద్ధి నామమాత్రమే. ఈ రంగాల్లో 1.8 శాతం మాత్రమే పెరుగుదల ఉందని గణాంక శాఖ నిర్ధారించింది. గత సంవత్సరంలో ఈ రంగాల్లో 4 శాతం వృద్ధిరేటు ఉండగా, ఈ ఏడాది దానిలో సగానికన్నా తక్కువ నమోదు కావడం గమనార్హం. ఎనిమిది సంవత్సరాల్లో ఇదే అత్యంత తక్కువ. సేవారంగం తరువాత దేశ ఆర్థిక వ్యవస్థకు విలువను అందించే కీలకమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఇంత తక్కువ వృద్ధిని నమోదు చేయడం ఆందోళనకరం. ఖరీఫ్ ఉత్పత్తి తగ్గడం, రబీలో సాగు విస్తీర్ణం తక్కువగా ఉండటంతో ఈ మాత్రపు వృద్ధి నమోదు కావడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సేవా విభాగంలో కీలకమైన రవాణా, కమ్యూనికేషన్స్-బ్రాడ్ కాస్టింగ్, హోటల్స్ రంగాల్లో వృద్ధి వేగం సగానికిపైగా తగ్గుతుందని అంచనా! గత ఆర్థిక సంవత్సరంలో ఈ రంగంలో 14 శాతం వృద్ధి నమోదుకాగా, ఈ ఏడాది 6.3 శాతానికే పరిమితమయ్యే అవకాశం ఉందని గణాంకశాఖ పేర్కొంది. నవంబర్ నెలలో విడుదల చేసిన నివేదికలో కూడా ఈ రంగాలకు సంబంధించి దాదాపు ఇవే అంశాలను ఆ శాఖ పేర్కొంది. రెండు దశాబ్దాల క్రితం జిడిపిలో 60 శాతం కన్నా ఎక్కువ వాటాతో ఉన్న ప్రైవేటు వ్యయం (వ్యక్తులు చేసే ఖర్చు) కరోనా సమయంలో కనిష్ట స్థాయికి పడిపోయిన విషయం తెలిసిందే. 2022-23లో ఈ రంగంలో 7.5 శాతం వృద్ధి సాధించగా, ప్రస్తుత సంవత్సరం 4.4 శాతానికే పరిమితం కానుందన్నది తాజా అంచనా! సబ్బులు, డిటర్జెంట్లు, షాంపూల నుండి ద్విచక్ర వాహనాల వరకు కొనుగోళ్లు పుంజుకోలేదని, ప్రజలు ఆసక్తి చూపడం లేదని తాజా నివేదికలో పేర్కొన్నారు.

వాస్తవాలు ఇలా ఉండగా, మోడీ ప్రభుత్వం మాత్రం తన కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక ఎజెండాను కొనసాగిస్తూనే ఉంది. ఉపాధి హామీ చట్టం (నరేగా)కు నిధులు తెగ్గోయడంతో పాటు, అనేక ఆంక్షలు పెడుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ లేకపోగా, ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలు కుదించుకు పోతున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలు దాటుతున్నాయి. ఈ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఎన్నికల వేళ అయోధ్య వంటి సున్నిత అంశాలను తెరమీదకు తెచ్చి ప్రజలను చీల్చడానికి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తున్నాయి. ఈ తరహా కుట్రల పట్ల ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలి.

మహనీయుల మాట



నేను స్వేచ్ఛను, స్వేచ్ఛాయుతమైన అభివృద్ధిని కోరుకుంటున్నా. కేవలం నా దేశానికి మాత్రమే కాదు. ప్రపంచంలో వున్న ప్రజలందరి కోసం కోరుకుంటున్నా.

- లాల్ బహదూర్ శాస్త్రి,
భారత మాజీ ప్రధాని.

మోడీ పాలనలో మహిళల భద్రతకు తూట్లు

విశ్లేషణ



వి.బి.పరమేశ్వరన్


దేశానికి గొప్ప బలం మహిళలని...తల్లులు, సోదరీమణులు, ఆడపిల్లల అభివృద్ధికి అవసరమైన పథకాలను చేపడతామని..ఇది మోడీ హామీ అని...'స్త్రీ శక్తి మోడీ కథన్' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇటీవల కేరళలోని త్రిసూర్ వెళ్లిన ప్రధాని అన్నారు. ఇంకేముంది మహిళా సాధికారతకు మోడీ ఇచ్చిన హామీ అంటూ మీడియా కథనాలను వండి వార్చింది.

అయితే...ఈ సందర్భాన్ని మీడియా పండుగ చేసుకుంటుండగానే... ప్రధాని లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో ముగ్గురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. బనారస్ హిందూ యూనివర్శిటీకి చెందిన 20 ఏళ్ల ఐఐటి విద్యార్థినిపై అత్యాచారం చేసి, వివస్త్రను చేసి వీడియో రికార్డ్ చేసిన వ్యక్తులను రెండు నెలల తర్వాత అరెస్టు చేశారు. బిజెపి నేతృత్వంలోని వారణాసి మహానగర్ ఐటీ సెల్ కన్వీనర్ కునాల్ పాండే, కో-కన్వీనర్ ఎస్. పటేల్, ఐటీ టీమ్ సభ్యుడు అభిషేక్ చౌహాన్ (ఆనంద్) లను అరెస్టు చేశారు. ప్రధాని నియోజకవర్గంలోని అధికార పార్టీ ఐటీ సెల్ రేపిస్ట్ సెల్‌గా మారిపోయింది.

పెద్దల పంచన ...

నవంబర్ 1వ తేదీ అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో, ఆ విద్యార్థిని తన స్నేహితుడితో కలిసి క్యాంపస్‌లో నడుచుకుంటూ వెళుతుండగా బయటి నుంచి మోటార్ బైక్‌పై వచ్చిన ముగ్గురు ఆమెను బలవంతంగా పొదల్లోకి లాక్కెళ్లి చిత్రహింసలు పెట్టారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మరుసటి రోజే విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. వారం రోజుల్లోనే నిందితుడిని బాలిక గుర్తించినప్పటికీ పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కాగా, ముగ్గురు నిందితులు మధ్యప్రదేశ్ వెళ్లి అక్కడి అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి తరపున ప్రచారం ప్రారంభించారు.

తన సొంత నియోజకవర్గంలోనే దారుణమైన లైంగిక వేధింపులు జరిగినా ప్రధాని ఇప్పటి వరకు స్పందించలేదు. తాను బాధితురాలి పక్షాన ఉన్నట్లు తెలిపేలా మోడీ ఎలాంటి సంకేతమూ ఇవ్వలేదు. చర్యా చేపట్టలేదు. గోడీ మీడియా కూడా ఈ విషయాన్ని లోకానికి తెలియకుండా దాచిపెట్టేందుకు పోటీ పడింది. అయితే, కునాల్ పాండే, ఎస్ పటేల్ విమానాశ్రయంలో ప్రధానికి పూలమాలలతో స్వాగతం పలికిన చిత్రాలు సోషల్ మీడియాలో వచ్చాయి. అంతేగాక కునాల్ పాండే...ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్, కేంద్రమంత్రులు స్మృతి ఇరానీ, అనురాగ్ ఠాకూర్, బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాతో ఉన్న ఫొటోలు కూడా బయటపడ్డాయి. నిందితులకు బిజెపి కేంద్ర, రాష్ట్ర నేతలతో సన్నిహిత సంబంధాలున్నట్లు ఈ చిత్రాలు తెలియజేస్తున్నాయి. ఈ రేపిస్టులు హై-సెక్యూరిటీ ప్రధానమంత్రికి దగ్గరయ్యేంతగా కనెక్ట్ అయ్యారనే వాస్తవాన్ని కూడా ఈ చిత్రాలు తెలియజేస్తున్నాయి. ఏ ప్రతిపక్ష నాయకుడి నియోజకవర్గంలోనైనా ఇలాంటి ఘటన జరిగిందంటే మోడీ, యోగి, స్మృతి ఎంత రగడ చేసేవారో ఊహించవచ్చు. నిందితులు ఏదైనా మైనారిటీ వర్గానికి చెందిన వారైతే, వారి మీద ఉగ్రవాద నిరోధక చట్టం ప్రయోగించబడుతుంది. ఈ కేసుకు సంబంధించి మాత్రం పోలీసు వర్గాలు ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. మీడియా ఈ సంఘటనను కప్పిపెట్టేందుకు ప్రయత్నిస్తోంది.



మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక ధోరణి వల్లే భారతదేశం మహిళల భద్రత విషయంలో బాగా వెనుకబడి ఉంది. భారతదేశం మహిళలకు అత్యంత ప్రమాదకరమైన దేశమని థామ్సన్ రాయిటర్స్ ఫౌండేషన్ (2018) పేర్కొంది. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మరింత దిగజారింది. దీనికి ప్రధాన కారణం ఆర్‌ఎస్‌ఎస్ ముందున్న మనుస్మృతి. సమానత్వాన్ని నొక్కి చెప్పే భారత రాజ్యాంగానికి బదులుగా, 'మహిళలు స్వేచ్ఛకు అర్హులు కాదు' అని ప్రకటించే మనుస్మృతిని తీసుకొచ్చేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ప్రయత్నిస్తున్నాయి. మహిళలకు సభ్యత్వం లేని సంస్థ ఆర్‌ఎస్‌ఎస్. ఆ సంస్థ మహిళలకు ఎలాంటి స్వేచ్ఛను ఇవ్వదు. ఆర్‌ఎస్‌ఎస్ దృష్టిలో మహిళలు పిల్లలను కనే యంత్రాలు మాత్రమే. ఇంక వారికి రక్షణ ఎక్కడ!

'సిగ్గుపడే ఘటన....'

మే 2023లో మణిపూర్‌లో ఇద్దరు కుకీ మహిళలను వివస్త్రలను చేసి తుపాకీతో చిత్రహింసలకు గురిచేసినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనం వహించాయి. ఈ వార్త ప్రపంచమంతటా తెలిసి, భారతదేశ ప్రతిష్ట మంటకలిసినంత పనైంది. అప్పుడు పార్లమెంటు వార్షిక సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి మాత్రమే అత్యంత సాధారణంగా స్పందించారు. "ఇది 140 కోట్ల మంది ప్రజలు సిగ్గుపడే సంఘటన. దోషులను విడిచిపెట్టేది లేదు" అన్నారు. అల్లర్లు జరిగిన ఎనిమిది నెలల తర్వాత కూడా మణిపూర్‌లో పర్యటించాలని మోడీ అనుకోలేదు. హోంమంత్రి అమిత్ షా ఒక్కసారి మాత్రమే వెళ్లారు. మణిపూర్‌లో వేధింపులకు గురైన మహిళల పట్ల ఉదాసీనత అనేక సందర్భాలలో కొనసాగుతున్నది.

...వేటగాళ్ల పక్షమే!

రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు, బాధితుల నిరసనలు మరో అంకం. ఈ విషయమై ఢిల్లీలో రెజ్లర్లు రెండుసార్లు నిరసన తెలిపినా ప్రభుత్వంలో ఇసుమంత కదలిక కూడా లేదు. యు.పి లోని కైసర్‌గంజ్ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై ఢిల్లీ పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ, ఇప్పటి వరకు అతనిని అరెస్ట్ చేయలేదు. ఒలింపిక్స్‌తోపాటు ప్రపంచ పోటీల్లో భారత్‌కు బంగారు, రజత, కాంస్య పతకాలు అందించిన రెజ్లర్ల ఫిర్యాదులను పట్టించుకోనేలేదు. బ్రిజ్ భూషణ్ లేదా అతని మద్దతుదారులు రెజ్లింగ్ ఫెడరేషన్‌లో ఉండరని అమిత్ షా చేసిన వాగ్దానాన్ని ఉల్లంఘించిన తర్వాత, సాక్షి మాలిక్ రెజ్లింగ్ మ్యాచ్‌ల నుండి వైదొలిగారు. బజరంగ్ పునియా, వినేష్ ఫోగట్ తమ అవార్డులను వెనక్కి ఇచ్చేస్తామన్నా...స్పందనే లేదు. అప్పటి వరకు మౌనంగా ఉన్న ప్రధాని మోడీ...ఆడపిల్లలను క్రీడా రంగంలో ప్రోత్సహిస్తామంటూ...ఇది మోడీ హామీ అంటూ త్రిసూర్‌లో పెద్ద ఉపన్యాసమే ఇచ్చారు.

బాధితుల పట్ల నిలువెత్తు నిర్లక్ష్యం

ఉన్నావో బాలికపై అత్యాచారం-హత్య కేసు యు.పి లోనే మరో సంచలనం. 2017లో బిజెపి నేత, ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సంగర్ 17 ఏళ్ల బాలికను చిత్రహింసలకు గురిచేసి హత్య చేసిన కేసు కూడా ఉంది. రెండేళ్ల తర్వాత రాయ్‌బరేలీ కోర్టులో విచారణ నిమిత్తం బాలిక కుటుంబ సభ్యులతో వెళుతుండగా ఐదుగురు వ్యక్తులు ఆమెను అడ్డుకుని నిప్పంటించారు. బాలికకు 90 శాతం కాలిన గాయాలు కాగా, ఆమెను ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించినప్పటికీ రక్షించలేకపోయారు. సంగర్‌పై సాక్ష్యం చెప్పినందుకు ప్రతీకారంగా అమ్మాయి తండ్రిని తప్పుడు కేసులో ఇరికించి జైలుకు పంపారు. జ్యుడిషియల్ కస్టడీలో ఉండగానే మరణించాడు. మరో ఘటనలో...బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న ప్రమాదంలో బాలిక గాయపడింది. ఆమె బంధువులు ఇద్దరు మరణించారు. దాంతో బాలిక హత్యకు జరిగిన కుట్ర ఇదని ఆరోపించారు. లక్నోలోని ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ నివాసం ఎదుట బాలిక ఆత్మహత్యాయత్నం చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన చోటుచేసుకుంది. చివరికి సంగర్‌కి జీవిత ఖైదు పడింది. కానీ ఆ అమ్మాయి అప్పటికే ఈ లోకాన్ని విడిచిపెట్టింది.

రక్తమోడినా...కనికరం లేదు

2018 జనవరిలో జమ్మూ కాశ్మీర్‌లోని కథువా ఆలయంలో జరిగిన మరో ఘోర ఉదంతం మోడీ అండ్ కో బాధితుల పక్షాన లేదని నిరూపించింది. ఎనిమిదేళ్ల బాలికను నలుగురు పోలీసులతో సహా ఎనిమిది మంది వ్యక్తులు అపహరించి సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన కేసు ఇది. దేవాలయంలో సామూహిక అత్యాచారం జరిగింది. వారం తర్వాత ఇంటికి కిలోమీటరు దూరంలో బాలిక మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనకు సంబంధించి ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ కూడా నిరసన వ్యక్తం చేశారు. ఎనిమిది మంది హిందూ నిందితులను అరెస్ట్ చేయడాన్ని నిరసించేందుకు బిజెపి మంత్రులు సిద్ధమయ్యారు. ఆ సమయంలో జమ్మూ కాశ్మీర్ పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ, బిజెపి అధికారంలో ఉన్నాయి. నిందితులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి మంత్రులు లాల్ సింగ్ చౌధురి (అటవీ శాఖ మంత్రి), చందర్ ప్రకాష్ (పరిశ్రమ) ప్రదర్శన నిర్వహించారు. సామూహిక అత్యాచారానికి గురై రక్తమోడుతున్న బాలిక పక్షాన కాకుండా...ఆ పసి శరీరాన్ని ఛిద్రం చేసిన రాక్షసుల పక్షాన బిజెపి నిలబడింది.

రేపిస్టులకు పూలమాలలు

బిల్కిస్ బానో! తన మూడేళ్ల కూతురును కళ్ల ముందే నరికి చంపేస్తుంటే నిస్సహాయంగా చూస్తుండి పోవాల్సి వచ్చింది. 2002 గుజరాత్ అల్లర్ల సమయంలో సామూహిక అత్యాచారానికి గురైనప్పుడు ఇరవై ఒక్క ఏళ్ల బిల్కిస్ బానో ఐదు నెలల గర్భవతి. క్రిమినల్ ముఠా ఆమె కుటుంబంలోని 14 మందిని చంపేసింది. అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర దామోదర్ దాస్ మోడీ. ఈరోజు ఆయన ఢిల్లీ పాలనలో చక్రం తిప్పుతుండగా.. బిల్కిస్ బానోపై అత్యాచారం చేసిన నేరంలో జైలుకెళ్లిన 14 మందిని విడుదల చేశారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆజాదీకే అమృత్ మహోత్సవ్‌గా జరుపుకుంటున్న సందర్భంగా 14 మంది రేపిస్టులను జైలులో వారి సత్ప్రవర్తనను పేర్కొంటూ విడుదల చేశారు. నిర్దోషులుగా విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించి నిందితులను విడుదల చేశారని 'ది హిందూ' పత్రిక కూడా రాసింది. నిందితులు హేయమైన నేరానికి పాల్పడ్డారని, వారు దయకు అర్హులు కాదని సిబిఐ చెప్పినా గుజరాతీ అమిత్ షా నేతృత్వంలోని కేంద్ర హోంశాఖ వినలేదు. జైలు నుంచి బయటకు రాగానే బిజెపి సహా సంఘ పరివార్ కార్యకర్తలు పూల మాలలతో స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. దహూద్‌కు చెందిన బిజెపి ఎంపీ జస్వంత్ సింగ్ బాబోర్, అతని సోదరుడు, ఎమ్మెల్యే శైలేష్ బాబోర్ ఈ రేపిస్టులలో కలిసి ప్రభుత్వ వేదికను పంచుకున్నారు. బిజెపి ఎవరి పక్షాన ఉందో పదే పదే రుజువవుతూనే వుంది.

జర్నలిస్టుతో సహా ఇద్దరిని చంపి, ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసి జైలు పాలైన గుర్మీత్ రామ్ రహీమ్‌కు మోడీ నేతృత్వంలోని బిజెపి వత్తాసు పలుకుతోంది. నవంబర్ ఐదు రాష్ట్రాల ఎన్నికలలో రామ్ రహీమ్ చేసిన సేవలకు బిజెపి 21 రోజుల పెరోల్‌ను మంజూరు చేసింది. ఎన్నికలలో డేరా సచ్చా సౌదా, దాని సభ్యుల మద్దతును పొందడానికే ఇదంతా. రాజస్థాన్‌లోని గంగానగర్ జిల్లాలో వారి ప్రభావాన్ని ఉపయోగించుకునేందుకే ఈ పెరోల్. నవంబర్ నుంచి రామ్ రహీమ్‌కు అరడజను సార్లు పెరోల్ మంజూరైంది. భీమా కోరేగావ్ కేసులో స్టాన్ స్వామికి బెయిల్ రాలేదు గానీ... హంతకులు, రేపిస్టులు మాత్రం విముక్తి పొందగలిగారు.

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక ధోరణి వల్లే భారతదేశం మహిళల భద్రత విషయంలో బాగా వెనుకబడి ఉంది. భారతదేశం మహిళలకు అత్యంత ప్రమాదకరమైన దేశమని థామ్సన్ రాయిటర్స్ ఫౌండేషన్ (2018) పేర్కొంది. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మరింత దిగజారింది. దీనికి ప్రధాన కారణం ఆర్‌ఎస్‌ఎస్ ముందున్న మనుస్మృతి. సమానత్వాన్ని నొక్కి చెప్పే భారత రాజ్యాంగానికి బదులుగా, "మహిళలు స్వేచ్ఛకు అర్హులు కాదు" అని ప్రకటించే మనుస్మృతిని తీసుకొచ్చేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ప్రయత్నిస్తున్నాయి. మహిళలకు సభ్యత్వం లేని సంస్థ ఆర్‌ఎస్‌ఎస్. ఈ సంస్థ మహిళలకు ఎలాంటి స్వేచ్ఛను ఇవ్వదు. ఆర్‌ఎస్‌ఎస్ దృష్టిలో మహిళలు పిల్లలను కనే యంత్రాలు మాత్రమే. ఇంక వారికి రక్షణ ఎక్కడ!

/'దేశాభిమాని' సౌజన్యంతో/



అన్ని విధాలా మాల్దీవులతో సంబంధాలు ఆ చిన్న దేశం కన్నా ఇండియాకు వ్యూహాత్మకంగా అవసరం ఎక్కువని భావించి సన్నిహిత సంబంధాలు కొనసాగించడానికి అన్ని ప్రభుత్వాలు ప్రాధాన్యతనిచ్చాయి. అందుకు అనుగుణంగానే ఇండియా నుంచి భారీగా ఆర్థిక సహాయమే కాకుండా బియ్యం, పప్పులు, పంచదార, బంగాళాదుంపలు వంటివన్నీ ఎగుమతి అవుతాయి. అలాంటి దేశంతో సంబంధాలు చెడిపోతున్నా సరిచేసుకోలేకపోవడం, చిన్న దేశాన్ని దౌత్యపరంగా దారికి తెచ్చుకోవడంలో స్పష్టమైన వైఫల్యం ఇండియా వైపు కనిపిస్తోంది. పాకిస్తాన్‌కి తోడుగా ఓవైపు శ్రీలంక, మరోవైపు నేపాల్, బర్మా, ఇప్పుడు మాల్దీవులు వంటి దేశాలన్నీ చైనాకి చేరువవుతున్నా చేతులు కట్టుకుని చూసి, ఇప్పుడు కుర్చీ మడతపెట్టేశామనే ఎలివేషన్లు ఏం ఉపయోగం చెప్పండి.

చిన్న దేశంతో పెద్ద తగాదా

అంతర్జాతీయం

మాల్దీవుల వ్యవహారం ముదురుతోంది. 5 లక్షల జనాభా కలిగిన దేశం గురించి ఇప్పుడు 140 కోట్ల జనాభా వున్న భారతదేశంలో ఇంత పెద్ద చర్చ జరుగుతోందంటేనే దాని ప్రాధాన్యత అర్థమవుతోంది. 24 ప్రధాన దీవులు, మరో 1200 చిన్న చిన్న ద్వీపాలు ఆ దేశ పరిధిలో ఉన్నాయి. 1965లో ఆ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇండియాకు మిత్రదేశం. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో కొత్త అధ్యక్షుడు మహహ్మద్ మెయిజు గద్దెనెక్కే వరకూ సంబంధాలు సవ్యంగానే ఉండేవి. కానీ ఇప్పుడు అక్కడి పరిస్థితులు మారాయి.

మాల్దీవుల జనాభాలో 95 శాతం ముస్లింలు. ఇక్కడ మైనార్టీల మీద అణచివేత ప్రభావం ప్రపంచమంతా ఉన్నట్టే మాల్దీవుల వాసుల్లోనూ ఇండియా మీద వ్యతిరేకతను పెంచింది. ఫలితంగా అక్కడి పార్టీలు ఇండియా నుంచి చైనా అనుకూల వైఖరికి షిఫ్ట్ అయ్యాయి. దానికోసమే వేచి చూస్తున్న చైనా మాల్దీవులను ఆదరించి సహకరించే పని చేసింది. చివరకు ఇప్పుడు ఎలా అయ్యిందంటే ఆ దేశంలో అధికార, ప్రతిపక్షాలు రెండూ చైనా అనుకూల వైఖరినే తీసుకున్నాయి.

ఇండియా రక్షణ అవసరాల రీత్యా మాల్దీవులు కీలకం. ఆర్థిక వ్యవహారాల్లోనూ అంతే ప్రధానం. మాల్దీవులు కేంద్రంగా సూట్‌కేస్ కంపెనీలు ఏర్పాటు చేసి పన్ను రాయితీలు పొందడంలో ఇండియన్ కార్పొరేట్లకు కొట్టిన పిండి. మన ఎస్బీఐ అక్కడ క్రియాశీలకంగా ఉంటుంది. ఇండియన్ నేవీ శిక్షణా కేంద్రాలున్నాయి. 1988లో అక్కడ శ్రీలంక సహకారంతో తిరుగుబాటు జరిగితే ఇండియా తోడ్పాటుతోనే అణచివేసిన చరిత్ర ఉంది. అన్ని విధాలా మాల్దీవులతో సంబంధాలు ఆ చిన్న దేశం కన్నా ఇండియాకు వ్యూహాత్మకంగా అవసరం ఎక్కువని భావించి సన్నిహిత సంబంధాలు కొనసాగించడానికి అన్ని ప్రభుత్వాలు ప్రాధాన్యతనిచ్చాయి. అందుకు అనుగుణంగానే ఇండియా నుంచి భారీగా ఆర్థిక సహాయమే కాకుండా బియ్యం, పప్పులు, పంచదార, బంగాళాదుంపలు వంటి వన్నీ ఎగుమతి అవుతాయి.

అలాంటి దేశంతో సంబంధాలు చెడిపోతున్నా సరిచేసుకోలేకపోవడం, చిన్న దేశాన్ని దౌత్యపరంగా దారికి తెచ్చుకోవడంలో స్పష్టమైన వైఫల్యం ఇండియా వైపు కనిపిస్తోంది. పాకిస్తాన్‌కి తోడుగా ఓవైపు శ్రీలంక, మరోవైపు నేపాల్, బర్మా, ఇప్పుడు మాల్దీవులు వంటి దేశాలన్నీ చైనాకి చేరువవుతున్నా చేతులు కట్టుకుని చూసి, ఇప్పుడు కుర్చీ మడతపెట్టేశామనే ఎలివేషన్లు ఏం ఉపయోగం చెప్పండి. మాల్దీవులకు టూరిజం ప్రధాన ఆదాయ వనరులు నిజమే. 2023లో ఇండియా నుంచి 2,09,198 మంది టూరిస్టులు వెళ్లారు. కరోనాకి ముందుతో పోలిస్తే ఇది లక్ష మంది తక్కువ. నిరుడు రష్యా నుంచి అంతే మంది 2,09,146 మంది అక్కడ అడుగుపెట్టారు. శ్రీలంక పరిస్థితులతో రష్యన్లు అటు మళ్లారు. 1,87,118 మంది చైనీయులు కూడా పర్యటించారు. 2022లో చైనా నుంచి 1.3 లక్షల మంది అక్కడికి వెళ్తే ఏడాదిలో అర లక్ష పెరిగారు. ఇండియన్లు 30 వేల మంది తగ్గారు.

ఇండియా నుంచి పర్యాటకులు గత కొన్నేళ్లుగా తగ్గుతున్నారని అధికారిక డేటా ఉండగా, ఇప్పుడేదో జరిగిపోయిందని కహానీలు అల్లుతూ, చివరకు బాయ్‌కాట్ మాల్దీవుల కోసం మాల్దీవుల ఫోటోలను వాడుకుంటూ సోషల్ మీడియాలో దేశం పరువు తీస్తున్న బ్యాచ్ తీరు విడ్డూరంగా ఉంది. ఇదంతా ఎందుకంటే సరిగ్గా ఇప్పుడే మాల్దీవుల అధ్యక్షుడు చైనాలో పర్యటిస్తున్నాడు. వాస్తవానికి అక్కడ అధికారంలోకి వచ్చిన ప్రతీ అధ్యక్షుడూ తొలుత ఇండియా వచ్చేవారు. ఈసారి మాత్రం మొదట టర్కీ, తర్వాత దుబాయ్ వెళ్లి అనంతరం ఢిల్లీకి వచ్చారు. వెంటనే బీజింగ్ బయలుదేరాడు. ఇది అర్థమయితే మాల్దీవుల్లో మన పరువు ఎలా తగ్గిపోతుందో అర్థమవుతుంది. చేతగానితనానికి చక్కెర పూసి దేశవాసులను మభ్యపెట్టాలనే ప్రయత్నంలో ఉన్న వాట్సాప్ యూనివర్సిటీ కహానీలు వింటుంటే టూరిస్టులను ఆపేసి, మాల్దీవులను దిగ్బంధిస్తామని ఊహించడం ఎలా ఉంటుందంటే అప్పుడెప్పుడో గాల్వాన్ లోయ ఘటన తర్వాత చైనా టీవీలు పగులగొట్టిన వాళ్ల చందం అన్నమాట.

సత్తా ఉంటే సమీప, వ్యూహాత్మక దేశాన్ని దారికి తెచ్చుకోవాలి. అంతే తప్ప అల్ప సంతోషులయిన ప్రజలను అపోహల్లో ముంచేసే యత్నం ఏమి ఉపయోగం మహాశయా! చిన్న దేశంతో దౌత్యపరమైన వ్యవహారాన్ని సోషల్ మీడియాలో రచ్చ చేసి ప్రపంచ ముందు పలుచనవ్వడమే తప్ప ప్రయోజనం ఉంటుందా అన్నది సందేహమే!

- అమన్

అభిప్రాయం

శాస్త్రీయ దృక్పథంతోనే అభివృద్ధి


ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే ఆ దేశంలో మూఢనమ్మకాలు ఎంత తక్కువగా ఉంటే, ఆ దేశం అంతగా అభివృద్ధి పథంలో ముందుకు పోతుంది. మన దేశంలో ముఖ్యంగా తరతరాలుగా పెద్దల నుండి వస్తున్న ఆచారాలు, సాంప్రదాయాల పేరుతో చాందసభావాలను ప్రజలు వదులుకోలేకపోతున్నారు. సైన్సు ఎంతగా అభివృద్ధి చెందినా కుడా మన మెదళ్లలో మన తాతయ్యలు, అమ్మమ్మలు నూరిపోసిన దేవుడూ, దెయ్యం, అడుగో బూచోడు లాంటి మాటలు, పుక్కిటి పురాణాల, మంత్రాలు శాపాలూ బారి నుండి బయటపడలేకపోతున్నాం. ఎంత చదువుకున్నా శాస్త్రీయ దృక్పథం లోపించిన కారణంగా డాక్టర్లు సైతం మృత్యుంజయ యాగాలు చేస్తున్నారు.

విద్యార్థులకు శాస్త్రీయ విద్య అందించాల్సిన అనంతపురం కె.డి. యూనివర్శిటీ వైస్ చాన్సలర్లు యూనివర్శిటీలలో మృత్యుంజయ యాగాలు చేస్తున్నారు. వారణాశి లోని బెనారస్ హిందూ యూనివర్సిటీలో భూతవైద్యాన్ని కొర్సులుగా పెడుతున్నారు. ఇప్పటికే కొన్ని యూనివర్శిటీలలో వాస్తు, జ్యోతిష్యాలను కోర్సులుగా పెట్టి, జనాన్ని మోసం చేసి బతకండని సర్టిఫికెట్లు ఇస్తున్నారు.

'పదార్థం సృష్టించబడదు, నాశనం కాదు, మార్పు చెందుతుంది' అని విద్యార్థులకు బోధించే ఫిజిక్స్ ప్రొఫెసర్, ఎవడో ఒక బాబా నోట్లోంచి లింగం తీస్తే, అమాంతం వెళ్లి అతగాడికి సాష్టాంగ పడుతున్నాడు. సూర్యుడు చంద్రుడు భూమి ఒకదాని చుట్టూ ఒకటి తిరిగే క్రమంలో సూర్య గ్రహణం, చంద్ర గ్రహణం ఏర్పడతాయని పాఠాలు చేప్పే సైన్సు పంతులు గ్రహణం రోజున గ్రహణ సమయంలో కదిలేే అరిష్టమని దుప్పటి కప్పుకుని ముసుగు పెడుతున్నారు.

ఆర్టికల్ 51 ఏ (హెచ్)లో రాసుకున్న ప్రశ్నించేతత్వం, శాస్త్రీయ ఆలోచన, మానవ వాదాన్ని పెంచటం ప్రతి పౌరుని బాధ్యత అన్న సూత్రాలను అమలుపరుస్తామని ప్రమాణం చేసిన మోడీ గారు ఒక సైన్సు కాంగ్రెసు సభలో, పురాణాలలో వినాయకునికి ఏనుగు తల అతికించడాన్ని ఈరోజు జరిగే సర్జరీలతో పోల్చి చెప్పారంటే పాలకులు ఎంత అజ్ఞానంతో కూరుకుపోయారో ఉహించుకోవచ్చు. ప్రధానులకు సైతం సైన్సు తెలియదనుకోవాలా !!

ప్రభుత్వ భూములు ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తున్న బాబాల దగ్గరకు అధికారికంగా వెళ్లి సాష్టాంగపడుతున్న ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, గవర్నర్లు, ప్రజాప్రతినిధులు రాజ్యాంగంలోని లౌకికవాదాన్ని మంటగలుపుతున్నా ఫరక్ వుండడంలేదు.



ఆధునిక విజ్ఞానంతో తయారుచేసిన ప్రచార సాధనాలు టీవీ, రేడియోలలో రంగురాళ్ళ మీ జీవితాలు మారుస్తాయని, పేరు మార్చుకుంటే మీ జీవితాలు మారతాయని, పలానా రుద్రాక్షలు ధరిస్తే జీవితాలు మారతాయని, అశాస్త్రీయమైన వాస్తు జ్యోతిష్యాలను బోధించటం, అష్టలక్ష్మి యంత్రాలు ధరిస్తే లక్ష్మీ అమ్మవారు మీ ఇంట తిష్ట వేస్తుందని ప్రచారంచేసే ప్రకటనల వలన అమాయక ప్రజలు తమ ధన మాన ప్రాణాలను పోగొట్టుకుంటున్నా కూడా ప్రభుత్వాలకు పట్టడం లేదు. 2019లో కర్ణాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప సంఖ్యా శాస్త్రజ్ఞుడు చెప్పాడని తన పేరుని యడియూరప్పగా మార్చుకున్నారు.

ఆ మధ్య మదనపల్లిలో ఒక బాబా బోధనలకు లోనై తల్లిదండ్రులు తమ ఇద్దరు కుమార్తెలను అత్యంత కిరాతకంగా చంపారు. గోదావరి జిల్లాలో యేసు ప్రభు పిలుస్తున్నాడంటూ ముగ్గురు మహిళలు ఉరివేసుకుని చనిపోయారు. కేరళలో ఒక ముస్లిం మహిళ ఆరు సంవత్సరాల కొడుకుని దైవం పేర బలి ఇచ్చింది.

ఈ రకంగా దేశంలో మూఢనమ్మకాలు పెరిగిపోతున్నాయి. అరికట్టాల్సిన అధికారులు సైతం మూఢనమ్మకాలతో మునిగిపోతున్నారు. వీటికి విరుగుడు ఒక్కటే. మూఢనమ్మకాల నిర్మూలన చట్టం. మూఢ నమ్మకాలను ప్రచారం చేసేవారిపైనా, వాటిని ప్రచారం చేసే ప్రసార సాధనాలపైనా చట్టం ఉండాలి. కర్ణాటక, మహారాష్ట్ర, మరికొన్ని రాష్ట్రాలలో ఉన్నట్లుగా మన రాష్ట్రంలో కూడా మూఢనమ్మకాల నిర్మూలన చట్టం ఆవశ్యకత ఎంతో ఉంది. అందుకోసం రాష్ట్రాల్లోని అన్ని హేతువాద నాస్తిక సంఘాలూ జెవివి, ఇతర అభ్యుదయ సంఘాలు కలసి పోరాడవలసిన అవసరం ఉంది.

- నార్నె వెంకట సుబ్బయ్య,
ఎ.పి హేతువాద సంఘం అధ్యక్షుడు.



బస్సులు, రైళ్లు కిటకిట

- పండగకు సొంత ఊళ్లకు జనం పయనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

సంక్రాంతికి ఊరెళ్లాలి అనగానే ఠక్కున గుర్తుకొచ్చేవి బస్సులు, రైళ్లే. పండగ సంతోషాలలో వీటి పాత్ర కీలకమైనది. అందుకే ఈసారీ పెద్ద పండగకు ఇవి కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి సమయంలో బస్ టికెట్ ఛార్జీలను పెంచడం మొన్నటి వరకూ ఆనవాయితీగా ఉండేది. కానీ ఈసారి ఆర్‌టిసి బస్సు ఛార్జీలను ప్రభుత్వం పెంచలేదు. అదే సందర్భంలో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్ టికెట్లను ముందుగానే రిజర్వ్ చేసుకుంటే అటు, ఇటు రెండు వైపులా ఛార్జీలో 10 శాతం తగ్గిస్తూ రాయితీ ప్రకటించారు. దీంతో ప్రయాణికులు విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు అధికంగా తరలి వస్తున్నారు. ఈ నెల 9 నుంచి 18 వరకు స్కూళ్లకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు ఇది వర్తిస్తుంది. దీంతో సంక్రాంతికి సొంతూర్లకు వెళ్లేవారు బస్సుల కోసం తరలిరావడంతో స్థానిక ద్వారకా ఆర్‌టిసి కాంప్లెక్స్ బుధవారం కిటకిటలాడుతూ కనిపించింది.

ఇదే రద్దీ ఆదివారం వరకూ ఉంటుందని, వచ్చే బుధవారం నుంచి తిరుగు ప్రయాణికులతో బస్ స్టేషన్ రద్దీగా ఉంటుందని ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు. గతంలో కంటే ఈసారి 250 బస్సులను అదనంగా నడుపుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, నరసాపురం, రాజమండ్రి, కాకినాడ, శ్రీకాకుళం ప్రాంతాలకు బస్సులను అధికంగా వేసినట్టు వెల్లడించారు. ఇదిలా ఉండగా విశాఖ రైల్వే స్టేషనూ బుధవారం జన రద్దీతో కనిపించింది. ఎక్కడ చూసినా లగేజీలతో ప్రయాణికులే కనిపించారు.

కో'ఢీ' ఆగేనా..!

- ప్రతియేటా అమలు కాని హైకోర్టు ఉత్తర్వులు
- పండుగ మూడు రోజులు పోలీసు, రెవెన్యూ అధికారులు మౌనముద్ర
- ఉమ్మడి జిల్లాలో గతేడాది 400కుపైగా బరుల్లో పందేల జోరు
- యథేచ్ఛగా గుండాట, మూడు ముక్కలాట
- ఈసారైనా పందేలకు అడ్డుకట్ట వేయాలని అంతా ఎదురుచూపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కోడి పందేలను అడ్డుకోవాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల అమలులో పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రతియేటా విఫలమవుతున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పుడు మరోసారి కోడి పందేలను అడ్డుకోవాలంటూ హైకోర్టు జారీ చేసిన ఆదేశాలు అమలయ్యేనా అంటూ చర్చలు సాగుతున్నాయి. కోడి పందేలను అడ్డుకుంటామంటూ కలెక్టర్, ఎస్‌పి నుంచి కిందిస్థాయి అధికారులు వరకూ ప్రకటనలు గుప్పించడం, పండుగ మూడు రోజులు మౌనముద్ర పాటించడం ప్రతియేటా పరిపాటిగా మారిపోయింది.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రతియేటా 400కుపైగా బరుల్లో కోడి పందేలు సాగుతున్నాయి. దాదాపు రూ.200 కోట్లకుపైగా సొమ్ము చేతులు మారుతోంది. ప్రధాన రహదారులకు పక్కగా టెంట్లు వేసి, ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో కోడిపందేలు జరుగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంటోంది. కోడి పందేలపై గతంలో కొంతమంది హైకోర్టును ఆశ్రయించగా పందేలను అడ్డుకోవాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా కోర్టు ఆదేశాలను అమలు చేసిన పరిస్థితి లేదు. కోడి పందేలతోపాటు గుండాట, మూడు ముక్కలాట సైతం యథేచ్ఛగా బరుల వద్ద సాగుతున్నాయి. సామాన్య ప్రజానీకం ఎంతోమంది పందేలకు ఆకర్షితులై జేబులు ఖాళీ చేసుకుని రోడ్డున పడుతున్నారు. ఈ ఏడాది సైతం కోడిపందేలకు పందెంరాయుళ్లు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. ఇప్పటికే బరుల ఏర్పాటుకు స్థలాల ఎంపికతోపాటు, అతిథులకు ఆహ్వానాలు సైతం పంపించేశారు. పందెం కోళ్లకు పెద్దఎత్తున తర్ఫీదు ఇస్తున్నారు. ప్రస్తుతం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పందేలు పెద్దఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భీమవరం, కాళ్ల, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, ఆకివీడు, ఉండి వంటి మండలాలతోపాటు ఏలూరు జిల్లాలో పెదవేగి, జంగారెడ్డిగూడెం, దెందులూరు, ఉంగుటూరు వంటి అనేక మండలాల్లో పందేలకు జోరుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈసారి 300కుపైగా బరుల్లో పందేలు నిర్వహించనున్నట్లు పందెంరాయుళ్లు చెబుతున్నారు. దీనికోసం పోలీసులకు, రెవెన్యూ అధికారులకు పెద్దఎత్తున మాముళ్లు సైతం ముట్టజెప్పేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల తరుణంలో ప్రభుత్వం కోడిపందేలను మరింత ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే అదునుగా పందెంరాయుళ్లు మరింత రెచ్చిపోతున్నారు. ఏలూరు, భీమవరం వంటి పట్టణాల్లో ఇప్పటికే ముందస్తుగా హోటల్ గదులు సైతం బుక్ చేసినట్లు తెలుస్తోంది. సంప్రదాయం ముసుగులో కొంతమంది పందెంరాయుళ్లు వీటిని ప్రోత్సహిస్తున్నారు. వీరికి రాజకీయ నేతల అండ ఉండటంతో ఆడింది ఆట.. పాడింది పాట అన్నట్లు సాగుతోంది. పోలీసుల బైండోవర్ కేసులు, బరుల తొలగింపు లెక్కలన్నీ కేవలం కోర్టుకు చూపించడానికే తప్ప కోడి పందేలను నిరోధించడానికి కాదని స్పష్టంగా అర్థమవుతోంది. సంక్రాంతి వస్తుండటంతో మరోసారి కోడిపందేలను అడ్డుకుంటామంటూ అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా కన్పిస్తోంది. బరులు నిర్వహించే నిర్వాహకులను పిలిపించుకుని పోలీసులు తమ వాటాలు మాట్లాడుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈసారైనా హైకోర్టు ఆదేశాలను అమలు చేసి కోడిపందేలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

అక్రమంగా తరలిస్తున్న రూ.12 లక్షలు విలువ చేసే 8 ఎర్రచందనం దుంగలను, కారును స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు అటవీశాఖ సంచారదళ నిఘా విభాగం డిఎఫ్‌ఒ జెవి.సుబ్బారెడ్డి తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందని మంగళవారం రాత్రి తమకు అందిన సమాచారం మేరకు, చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం కొత్తపేట సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా రొంపిచర్ల వైపు నుంచి వేగంగా వచ్చిన కారును ఆపాలని సిగ్నల్ ఇచ్చామని చెప్పారు. బుధవారం ఉదయం ఆ వాహనం ఆగకుండా వేగంగా గంగాధరనెల్లూరు వైపు దూసుకు వెళ్ళిందని తెలిపారు. అప్రమత్తమైన తమ సిబ్బంది ఆ వాహనాన్ని వెంబడించగా గంగాధర నెల్లూరు మండలం కొత్త వెంకటాపురం వద్ద కారు ఆపి డ్రైవర్ చీకట్లో పరారయ్యాడని తెలిపారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 208 కేజీల బరువు గల 8 ఎర్రచందనం దుంగలను గుర్తించినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న కారు ఎర్రచందనం విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఆర్ఒఎన్ వెంకటరమణ, ఎఫ్‌బిఒకె. ప్రతాప్, ప్రొటెక్షన్ వాచర్లు ప్రభుతేజ, వెంకటేష్, మల్లికార్జున, డ్రైవర్, చరణ్ పాల్గొన్నారు.

రైల్వే లైన్ నిర్మాణానికి సహకరించాలి

- రైతులను కోరిన సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ప్రజాశక్తి- టెక్కలి (శ్రీకాకుళం జిల్లా)

మూలపేట పోర్టు నిర్మాణం నేపథ్యంలో నిర్మాణం చేపట్టనున్న రైల్వే లైన్ నిర్మాణానికి రైతులు సహకరించాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ కోరారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంతబొమ్మాళి మండలం పోతునాయుడుపేట, యామాలపేట, కూర్మనాథపురం గ్రామాలకు చెందిన రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోర్టు నిర్మాణం వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. రవాణా సౌకర్యం నిమిత్తం రైల్వే లైన్ నిర్మాణం అవసరమని పేర్కొన్నారు. కూర్మనాథపురానికి చెందిన 49 మంది రైతుల వద్ద నుంచి 6.94 సెంట్లు, పోతునాయుడుపేటకు చెందిన 32 మంది రైతుల వద్ద నుంచి 35 ఎకరాలు, యామాలపేటకు చెందిన 35 మంది రైతుల నుంచి 6.38 సెంట్లు చొప్పున స్థలాన్ని సేకరించనున్నామని తెలిపారు. నౌపడ కూడలి నుంచి రైల్వే లైన్ నిర్మాణం నేపథ్యంలో ప్రభుత్వం అందించే సహాయాన్ని వివరించారు. అనంతరం రైతుల అభిప్రాయాలను సేకరించారు. రైతులు మాట్లాడుతూ ఏటా ఈ భూములపైనే తమ కుటుంబాలు పోషించుకున్నామని, అటువంటి భూమిని రైల్వేలైన్ నిర్మాణం నేపథ్యంలో సేకరించడం వల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు పడతామని సబ్ కలెక్టర్ ముందు తమ ఆవేదనను వెల్లబుచ్చారు. అభివృద్ధికి తాము వ్యతిరేకులం కాదని స్పష్టం చేశారు. అయితే ప్రభుత్వం చెల్లించే నష్టపరిహారం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, మిగిలిన గ్రామాల రైతులకు ఇచ్చే విధంగానే ఎకరాకు రూ.45 నుంచి 40 లక్షల వరకు నష్టపరిహారం అందించాలని కోరారు. రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సబ్ కలెక్టర్ తెలిపారు. సమావేశంలో సంతబొమ్మాళి తహశీల్దార్ జాలారి చలమయ్య, రైతులు పిలక రవికుమార్‌రెడ్డి, దల్లి ప్రసాద్‌రెడ్డి, గిన్ని ప్రకాష్, కోట అప్పలరెడ్డి, శీరపు చిరంజీవి, దల్లి లచ్చయ్య పాల్గొన్నారు.

రైతులు అసహనం

పోర్టు నిర్మాణం నేపథ్యంలో రైల్వేలైన్ నిర్మాణానికి భూమి సేకరించనున్న రైతుల అభిప్రాయాలను తెలుసుకునే నిమిత్తం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులు అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు సమావేమని చెప్పి సాయంత్రం 5 గంటల వరకు ప్రారంభించక పోవడంతో రైతులు చిరాకు పడ్డారు. ఒకానొక దశలో సమావేశాన్ని బహిష్కరించేందుకు సిద్ధమయ్యారు. రైతులు సయమనం పాటించాలని కార్యాలయ అధికారులు కోరారు. పండగ ముందు ధాన్యం అమ్మకాలు చేపట్టాలని, సమావేశమని పిలిచి ఆలస్యం చేయడం సబబుకాదని వాపోయారు.

ఎయులో వెస్టన్ ఆస్ట్రేలియన్ కార్నర్ సాఫ్ట్‌లాంచ్

ప్రజాశక్తి-విశాఖపట్నం

ఆంధ్రవిశ్వవిద్యాలయంలో వెస్టన్ ఆస్ట్రేలియన్ కార్నర్ సాఫ్ట్‌లాంచ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత, యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా ప్రో చాన్సలర్ జెన్నిఫర్ హెూవెల్‌లు దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత మాట్లాడుతూ, ఆంధ్రవిశ్వవిద్యాలయం అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది, ప్రయోగశాలలు, గ్రంథాలయం వంటి వసతులను కలిగి ఉందని వివరించారు. ఏయూలో 1084 మంది 58 దేశాలకు చెందిన విదేశీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యశిస్తున్నారన్నారు. వీరికి అవసరమైన హాస్టల్స్, వసతులను ఏయూ కల్పించిందని తెలిపారు. ఆస్ట్రేలియా వర్సిటీ ప్రో చాన్సలర్ జెన్నిఫర్ హెూవెల్ మాట్లాడుతూ, విభిన్న రంగాలలో ఏయూతో కలసి పనిచేస్తామన్నారు. ఏయూలో నిర్వహిస్తున్న కోర్సులు, వసతులు, విదేశీ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు తదితర అంశాలపై ఒఎస్‌డి ఆచార్య వి.కృష్ణమోహన్ వివరించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ ఏయూలో ఇప్పటికే సమర్థవంతంగా నిర్వహిస్తున్న అమెరికన్ కార్నర్ పనితీరు, నిర్వహించిన కార్యక్రమాలు వివరించారు. ఉన్నత విద్యమండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి వర్చువల్ విధానంలో పాల్గొని రెండు విశ్వవిద్యాలయాల ప్రతినిధులను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గవర్నమెంట్ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడ్ కమిషనర్ (ఇండియా-గల్ఫ్) నషీద్ చౌధురి, ఇన్వెస్ట్ అండ్ ట్రేడ్ వెస్టన్ ఆస్ట్రేలియా ఎడ్యుకేషన్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఆంటోని జోసెఫ్, ఏయూ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్‌కె.భట్టి, వి.విజయలక్ష్మి, వై.రాజేంద్రప్రసాద్, ఎ.నరసింహారావు, జి.శశిభూషణరావు, ఆచార్య టి.శోభశ్రీ, గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అటకెక్కిన ఆధునీకరణ పనులు

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

నిత్యం దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాకు సాగునీటి ఆవశ్యకత చాలా అవసరముంది. అయితే ఉన్న అతి కొద్ది సాగునీటి వసతిని సక్రమంగా అందించే నీటి వ్యవస్థల్లేక రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోనున్న ఏకైక ప్రధాన ప్రాజెక్టు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ. ఈ సిస్టమ్ కింద అనేక ఉప కాలువలు ఉన్నాయి. ఇప్పుడు ఈ వ్యవస్థలన్నీ పూర్తి దెబ్బతిన్నాయి. వీటిని బాగు చేసేందుకు చేపట్టిన ఆధునీకరణ పనులన్నీ అర్థాంతరంగా ఆగిపోయాయి. వీటిని తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వంపై నేతలు ఒత్తిడి పెంచిన దాఖలాలు కనిపించలేదు. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా 12 మంది వైసిపి ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్న విమర్శలున్నాయి.

ఆగిన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ :

తుంగభద్ర డ్యామ్ నుంచి అనంతపురం జిల్లాకు సాగునీటి వనరు ఇచ్చిన ప్రధాన కాలువ ఆధునీకరణ పనులు 2008లో ప్రారంభమయ్యాయి. నాలుగేళ్లలో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువను పూర్తి స్థాయిలో ఆధునీకరించడంతోపాటు ప్రవాహ సామర్థ్యాన్ని 2000 క్యూసెక్కుల నుంచి 4200 క్యూసెక్కులకు పెంచారు. ఆరు ప్యాకేజీలతో రూ.458.72 కోట్లతో చేట్టారు. ఇందులో 309.74 కోట్లు పూర్తయ్యాయి. అయితే ఆ తరువాత పనులను ఆపివేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక 2019లో రద్దు చేసింది. శింగనమల నియోజకర్గానికి సాగు,తాగునీటిని అందించే మిడ్ పెన్నార్ దక్షిణ కిలువ ఆధునీకరణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇక పనులు చేయలేమని రద్దు చేయమని కాంట్రాక్టరు విజ్ఞప్తి చేయడం గమనార్హం. మిడ్‌పెన్నార్ డ్యామ్ నుంచి 84 కిలోమీటర్ల మేరకు ఈ కాలువ ఉంది. రూ. 509.16 కోట్లతో పనులు చేపట్టడంతో రూ.205.79 కోట్లు పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు ఆ పనులు ఆగిపోయాయి.

మహిళా మావోయిస్టు లొంగుబాటు

ప్రజాశక్తి- సీలేరు

ఆంధ్ర -ఒడిశా సరిహద్దుల్లోని మావోయిస్టు పార్టీ చత్తీస్‌ఘడ్ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులుగా పని చేస్తున్న ఉంగి మాధవి అలియాస్ రోషిణి బుధవారం ఉదయం 10 గంటల సమయంలో మల్కనగిరి జిల్లా ఎస్పీ నితీష్ వద్వానీ ఎదుట లొంగిపోయారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లా పిట్టదబ్బా గ్రామానికి చెందిన మాధవి 2016 నుంచి మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నారు. ఆమెపై లక్ష రూపాయలు రివార్డు ఉన్నట్లు ఎస్‌పి తెలిపారు. ఒడిశాలో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ పరిధిలో పనిచేస్తున్న మాధవి ఒడిశా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితురాలై మావోయిస్టు పార్టీని వీడి జనజీవన స్రవంతిలో కలవడానికి వచ్చినట్లు ఎస్పీ నితీష్ వాద్వానీ చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కల్పించే పునరావస సదుపాయాలన్నీ మాధవికి కూడా కల్పిస్తామని ఎస్పీ వెల్లడించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశం మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, అధ్యక్షులు, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ జునైద్ అహ్మద్ మౌలానా సూచనపై ఎచ్చెర్లలోని టిటిడిసిలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు వినియోగదారుల హక్కులు, చట్టాలపై బుధవారం న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న అభ్యర్థులందరూ వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తప్పనిసరిగా కొన్న వస్తువుకి రసీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్, డిస్టర్బ్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.వి.రమణ, టిటిడిసి ఇన్‌ఛార్జిలు వరాహ నరసింహులు, కృష్ణారావు, ట్రైనర్ సింహాద్రి నాయుడు, నాగమణి, ప్రభావతి, సూర్యప్రకాశ్‌రెడి, ప్రియాపాల్, రామ్మోహన్ పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం

పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని, యజమానులు శిక్షకు గురవుతారని, చిన్న పిల్లల భవిష్యత్‌కు చదువు మాత్రమే మార్గం చూపుతుందని, పిల్లలను బడిలో చేర్పించాలని ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా చిలకపాలెంలో రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ ఆఫ్ చైల్డ్ లేబర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షాపుల యజమానులు చిన్నపిల్లలను పనిలో పెట్టుకున్నారా? అనే విషయంపై ఆరాతీశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.వి.రమణ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు, న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు కొండలరావు, ఆర్‌వి శ్రీనివాసరావు, ఎన్‌జిఒలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు శిక్షణ కరువు

- ప్రారంభం కాని స్టడీ సర్కిళ్లు
- దగ్గరపడుతున్న స్క్రీనింగ్ టెస్టు
- ఆందోళనలో పేద నిరుద్యోగులు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-1, 2 నోటిఫికేషన్లు విడుదల చేసి నెల రోజులు గడిచినా ఇప్పటి వరకు స్టడీ సర్కిళ్లు ప్రారంభించకపోవడంతో పేద నిరుద్యోగ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. డబ్బులు పెట్టి శిక్షణ తీసుకునే స్తోమత లేకపోవడంతో పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలో తెలియక అయోమయంలో ఉన్నారు. ఇంటిదగ్గరే ఒంటరిగా సిద్ధమవుతూ లోలోపల మదనపడుతున్నారు. సాంఘిక, బిసి సంక్షేమశాఖల ఆధ్వర్యంలో నడవాల్సిన స్టడీ సర్కిళ్లపై ప్రభుత్వం ఇప్పటి వరకు దృష్టి సారించకపోవడంతో ఏం చేయాలో వారికి అర్థం కావడం లేదు. సరైన శిక్షణ లేకుండా పోటీ పరీక్షల్లో ఎలా నెగ్గాలో అనే ఆందోళన ఎస్‌సి, బిసి, మైనార్టీ తరగతుల నిరుద్యోగుల్లో నెలకొంది. నోటిఫికేషన్ల కంటే ముందే ఏర్పాటు చేయాల్సిన స్టడీ సర్కిళ్లను ఇప్పటి వరకు ప్రారంభించకపోవడంతో అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ఇటీవల 81 గ్రూప్-1, 897 గ్రూప్-2 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రూప్-2కు దరఖాస్తు గడువు ఈ నెల 10వ తేదీతో, గ్రూప్-1 గడువు ఈ నెల 21తో ముగియనుంది. 2022లో విడుదల చేసిన 99 గ్రూప్-1 పోస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా 1,26,449 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. 2018లో విడుదల చేసిన 446 గ్రూప్-2 పోస్టులకు 6.5 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఐదేళ్ల తరువాత గ్రూప్-2 పోస్టులు విడుదల చేయడంతో ఈసారి అభ్యర్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మొత్తంగా 10 లక్షల మంది గ్రూప్-1, 2కు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంది. గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష ఫిబ్రవరి 25న, గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష మార్చి 17న నిర్వహిస్తామని ఎపిపిఎస్‌సి ప్రకటించింది. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టడీ సర్కిళ్లు, బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పూలే స్టడీ సర్కిళ్లు ఉన్నప్పటికీ పరీక్ష తేదీలు దగరపడుతున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు వీటిని ప్రారంభించలేదు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో ఉన్న స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1 అభ్యర్థులకు, తిరుపతిలో ఉన్న స్టడీ సర్కిల్‌లో గ్రూప్-2 అభ్యర్థులకు మాత్రమే శిక్షణ నడుస్తోంది. వీటిల్లో కూడా కేవలం 100 మంది చొప్పున మాత్రమే ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు పరీక్ష నిర్వహించి స్టడీ సర్కిళ్లకు ఎంపిక చేసి శిక్షణ ఇస్తారు. బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడవాల్సిన స్టడీ సర్కిళు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. స్క్రీనింగ్ పరీక్షల తేదీలు దగ్గర పడుతున్నా ప్రభుత్వంలో ఎలాంటి కదలిక లేకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది.

గ్రంథాలయాల్లోనూ మెటీరియల్ కొరత

గ్రంథాలయాల్లోని మెటీరియళ్ల ఆధారంగా కొంతమంది అభ్యర్థులు పరీక్షలకు సిద్ధమవుతారు. అయితే అక్కడ కూడా కేవలం పత్రికలు తప్పితే పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్స్ అందుబాటులో ఉండటం లేదు. గతంలో ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ముద్రించిన గ్రూప్-1, 2 మెటీరియల్స్ ఉండేవి. ప్రస్తుతం వీటిని కూడా ప్రభుత్వం సరఫరా చేయడం లేదు. దీంతో గ్రంథాలయాలకు వెళ్లే వారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది.

అప్పులు చేసి ప్రైవేట్ కేంద్రాలకు

ప్రభుత్వం స్టడీ సర్కిళ్లను ప్రారంభించకపోవడంతో అభ్యర్థులు అప్పులు చేసి మరీ ప్రైవేట్ శిక్షణ కేంద్రాలకు వెళ్తున్నారు. ఇవి కూడా ఎక్కువగా రాష్ట్రంలో లేని పరిస్థితి నెలకొంది. హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో ఉన్న కేంద్రాలకు ఎక్కువగా వెళ్తున్నారు. కేవలం మూడు నెలల కోసం సుమారు రూ.లక్ష వరకు శిక్షణ కోసం చెల్లించాల్సి వస్తోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికోసం తమ తల్లిదండ్రులు అప్పులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే శిక్షణ అందించాలి

నోటిఫికేషన్ ఇచ్చిన వెంటనే శిక్షణ ఇవ్వాలి. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రారంభించకపోవడం సరికాదు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఎస్‌సి, ఎస్‌టి, బిసి అభ్యర్థులకు అవకాశం కల్పించాలి. గ్రంథాలయాల్లోనూ గ్రూప్-1, 2 మెటీరియల్స్ సరఫరా చేయాలి.

- అంద్ర మాల్యాద్రి, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలి

స్టడీ సర్కిళ్లను ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేయాలి. బిసి, సోషల్, మైనార్టీశాఖల ఆధ్వర్యంలో విడివిడిగా ఏర్పాటు చేయాలి. శిక్షణ లేకపోవడంతో పేద అభ్యర్థులు ఉద్యోగాలు కోల్పోతున్నారు. వెంటనే శిక్షణ కేంద్రాలను ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- జి రామన్న, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి

ఎమ్మెల్యే టికెట్ రాని వాళ్లు అదృష్టవంతులు

- మాజీ మంత్రి దగ్గుబాటి

ప్రజాశక్తి -కారంచేడు (బాపట్ల జిల్లా)

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎమ్మెల్యే టికెట్ రాని వాళ్లు అదృష్టవంతులని, పొరపాటున పోటీ చేసి ఓడిపోతే వారి భవిష్యత్తు, వారి పిల్లల భవిష్యత్తును రోడ్డు పాలు చేసుకోవాల్సి వస్తుందని మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు అన్నారు. బాపట్ల జిల్లా కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో ఎన్‌ఆర్‌ఐల సహాయంతో అభివృద్ధి చేసిన మహాప్రస్థానం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దగ్గుబాటి మాట్లాడుతూ.. ఇప్పుడున్న పరిస్థితుల్లో రూ.30 నుంచి రూ.40 కోట్లు ఖర్చు పెట్టి గెలిచినా ఎమ్మెల్యే సంపాదించుకునేది శూన్యమన్నారు. టికెట్ రాని ఎమ్మెల్యేలు, ఎంపిలు తన దృష్టిలో చాలా అదష్టవంతులని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిలను ఉత్సవ విగ్రహాలుగా చేసి సంపదనంతా పార్టీ అధినేతల వద్దకే చేరుతుందన్నారు. చివరకు ప్రకృతి వనరులను దోచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇప్పుడున్న ప్రజా సేవచేసే అవకాశం లేదన్నారు. ఓడిన ఎమ్మెల్యే అక్కడే ఏడుస్తారని, గెలిచిన ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి ఏడుస్తారని తెలిపారు. తాను గానీ, తన కుమారుడుగానీ రాజకీయాల్లోకి వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. తాను ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేయడం లేదని, ఇప్పుడున్న పరిస్థితులు అలా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగులకు బకాయిలను చెల్లించండి

- ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులకు 2020 జనవరి 1 నుండి చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలను చెల్లించాలని ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ కోరింది. ఈ మేరకు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదర్‌రావు, జివి నర్సయ్యలు బుధవారం రాష్ట్ర ఆర్థిక ముఖ్యకార్యదర్శి ఎస్ఎస్ రావత్‌కు వినతి పత్రం అందజేశారు. విలీనం అనంతరం ఆర్‌టిసి ఉద్యోగులకు బకాయిల పెండింగ్ పెరిగిపోయిందని తెలిపారు. పిఆర్‌సి అరియర్స్, అలవెన్స్‌లు, ప్రోత్సహకాలను చెల్లించాలని కోరారు. అలాగే రిటైర్డ్ అయిన ఆర్‌టిసి ఉద్యోగులకు అన్ని రకాల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను చెల్లించాలని కోరారు.

కండక్టర్ శ్యామలను ఆదుకోండి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాకినాడ ఆర్‌టిసి డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న వి శ్యామలకు వైద్యసేవలకుగాను తగు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని ఎపిపిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ కోరింది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలానిభాష, రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, ఎం అయ్యపరెడ్డిలు బుధవారం ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు వినతి పత్రం అందజేశారు. శ్యామల చాలా కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతోందని తెలిపారు. ఆమెకు రెగ్యులర్‌గా చేయాల్సిన డయాలసిస్ కోసం ఆర్‌టిసి యజమాన్యం తగుసాయం చేయాలని కోరారు. ఆమెకు వైద్యసౌకర్యం కల్పించి ఆమె ప్రాణాన్ని కాపాడాలని కోరారు.

ఆర్‌టిసి కార్గోలో పికప్ సేవలు

- నెలాఖరులో కొత్త బస్సుల రాక
- సంక్రాంతి రద్దీకి అనుగుణంగా మరో వెయ్యి
- ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రైవేట్ కార్గో సేవలకు మించి సేవలు అందిస్తున్న ఆర్‌టిసి కార్గోలో ఇకపై ఇంటి నుండి వస్తువుల బుకింగ్‌లను తీసుకునేలా కార్గో పికప్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తెలిపారు. బుధవారం ఆర్‌టిసి హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్‌టిసి పికప్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్‌డి మాట్లాడుతూ.. ఎపిఎస్‌ఆర్‌టిసి 2017 నుంచి రాష్ట్రంలో సొంతంగా కార్గో సేవలు అందిస్తోందన్నారు. 2017కు ముందు 2016లో ఆర్‌టిసికి ఎఎన్ఎల్ ద్వారా కేవలం ఏడాదికి రూ.9 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చేదన్నారు. ఆర్‌టిసిలోకి వచ్చాక మొదటి ఏడాదే రూ.58.57 కోట్ల ఆదాయం రావడంతో కార్గో సేవలను విస్తృతం చేసేందుకు ఆర్‌టిసి చర్యలు తీసుకుందన్నారు. గతేడాది రూ.169 కోట్లు ఆర్జించగా, ఈ ఏడాది ఇప్పటికే రూ.147.37 కోట్లను ఆర్జించిందని తెలిపారు. 2021 నుంచి డోర్ డెలివరీ సౌకర్యాన్ని తీసుకొస్తే మరింత ఆదరణ పెరిగిందన్నారు. కార్గో సేవలను మరింత ప్రజలకు చేరువ చేసేందుకు ఇకపై పికప్ సేవలను కూడా అందిస్తామని తెలిపారు. కార్గో వెబ్‌సైట్‌లోకి వెళ్లి బుక్ చేసి, పేమెంట్ చేయగానే కార్గో తరపున ఒకరు వారి ఇంటికి వెళ్లి బుక్‌చేసిన వస్తువులను తీసుకుని గమ్యస్థానాలకు చేరుస్తామన్నారు. ఈ మేరకు బుకింగ్ దగ్గర నుండి డెలివరీ పాయింట్ వరకూ ప్రతి కదలికనూ ఎస్ఎంఎస్‌ల ద్వారా సమాచారం ఇస్తామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 84 కేంద్రాల్లో డోర్ డెలివరీ వ్యవస్థ వుందని తెలిపారు. పికప్ సర్వీసును ప్రస్తుతం విజయవాడలో మొదలు పెట్టామని, అంచెలంచెలుగా 84 కేంద్రాలకు విస్తరిస్తామని అన్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో 6,795 ప్రత్యేక సర్వీసులను నడపాలని నిర్ణయించామని, అవసరాన్ని బట్టి మరో వెయ్యి సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కెఎస్ బ్రహ్మానందరెడ్డి, ఎ కోటేశ్వరరావు, పి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్‌టిసి బస్ స్టేషన్‌లో 499 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు ప్రారంభించారు.

10 శాతం పెరగనున్న విద్యుత్ డిమాండ్

- థర్మల్ యూనిట్ల మరమ్మతులు పూర్తి చేయాలి
- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ డిమాండ్ దేశవ్యాప్తంగా ప్రతియేటా 10 శాతం పెరుగుతుందని కేంద్ర ఇంధనశాఖ కూడా అంచనా వేసిందని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. 2030 వరకూ పెరుగుదల ఇలానే ఉంటుందన్నారు. రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి ఉంటుందని స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డిసి) అంచనా వేసిందన్నారు. విజయవాడలో జరిగిన సదరన్ రీజనల్ పవర్ కమిటీ (ఎస్ఆర్‌పిసి) 210వ ఆపరేషన్ కో-ఆర్డినేషన్ సబ్ కమిటీలో బుధవారం ఆయన మాట్లాడారు. గడువు దాటిన పాత థర్మల్ విద్యుత్ కేంద్రాలకు మరమ్మతులు చేసి 2030 వరకూ విద్యుదుత్పత్తి కొనసాగించాలని కేంద్ర ఇంధనశాఖ ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. ఈ పనులు పూర్తిచేయడంతో పాటు నిర్మాణంలో ఉన్న ప్లాంట్లను పూర్తిచేసి ఉత్పత్తి ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముందు జాగ్రత్తలు తీసుకోకపోతే రానున్న వేసవిలో డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరా చేయడం కష్టమవుతుందని వివరించారు. రాష్ట్రంలో గతేడాది ఊహించని విధంగా రోజువారీ విద్యుత్ డిమాండ్ 265 మిలియన్ యూనిట్ల(ఎంయు)కు చేరిందని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు సమైక్యంగా పనిచేయాలని ఎస్ఆర్‌పిసి నిర్ణయించిందని అన్నారు. ఈ లక్ష్యంతో ఉత్తమ ఫలితాల సాధన దిశగా చర్చించి కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో కృష్ణపట్నం, ఎన్‌టిటిపిఎస్ ప్లాంట్లలో 800 మెగావాట్ల యూనిట్ల చొప్పున విద్యుదుత్పత్తి ప్రారంభమైందని చెప్పారు. రాష్ట్ర విద్యుత్ డిమాండ్‌కు మరో 15 నుంచి 20 ఎంయుల విద్యుత్ అందుబాటులోకి వచ్చిందన్నారు. భవిష్యత్తులో పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్లకు అత్యధిక ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అంశం థర్మల్ ప్లాంట్లకు సవాల్‌గా మారుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఆర్‌పిసి కో-ఆర్డినేషన్ సబ్ కమిటీ కార్యదర్శి సభ్యులు అజిత్ సింగ్, ఎపి ట్రాన్స్‌కో డైరెక్టర్ కెవి భాస్కర్, ఎస్ఆర్ఎల్‌డిసి సిజిఎం రమేష్, జెన్‌కో థర్మల్ డైరెక్టర్ బాబ్జీ, హెచ్‌ఆర్ సయ్యద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

మిలాన్ విన్యాసాలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఇండియన్ నేవీ మల్టీ నేషనల్ నావల్ ఎక్సర్‌సైజ్ మిలాన్ 2024ను విశాఖపట్నంలో ఫిబ్రవరి 19-27 మధ్య నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. గతంలో 11వ ఎడిషన్‌ను కూడా విశాఖలోనే నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈస్టర్న్ నేవల్ కమాండ్ బాధ్యతాయుతమైన సముద్ర శక్తిగా మరింత ఎత్తుకు ఎదిగేందుకు, సముద్ర భద్రతను మరింత మెరుగుపరుచుకోవడానికి ఈ విన్యాసాలు తోడ్పడతాయని నేవీ అధికారులు భావిస్తున్నారు.

'ఓటుకు నోటు' కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ఓటుకు నోటు' వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాత్రపై విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఏప్రిల్ లో ఈ పిటిషన్ పై విచారణ చేపడతామని తెలిపింది. ఓటుకు నోటు వ్యవహారంలో చంద్రబాబు పాత్రపై నిగ్గు తేల్చేందుకు సిబిఐ విచారణ జరిపించాలని 2018లో వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై బుధవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్ పై స్పందించేందుకు తమకు మరికొంత సమయం కావాలని ప్రతివాది రేవంత్ రెడ్డి తరపు న్యాయవాదులు ధర్మాసనాన్ని కోరారు. ఈ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను ఏప్రిల్ కు వాయిదా వేసింది.

పట్టాలు తప్పిన చార్మినార్ ఎక్స్‌ప్రెస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



నాంపల్లి రైల్వే స్టేషన్‌లో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పూర్తి వివరాల్లోకెళ్తే... బుధవారం చార్మినార్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ చెన్నై నుంచి ప్రయాణికులతో నాంపల్లికి వచ్చింది. రైలు నాంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే స్పీడ్ తగ్గినా.. ప్రమాదవశాత్తు డెడ్‌ఎండ్ గోడను ఢీకొట్టింది. దాంతో ఎస్2, ఎస్3, ఎస్6 బోగిలు పక్కకు ఒరిగాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులకు గాయాలు కాగా, వారిని వెంటనే లాలాగూడ రైల్వే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. లోకో పైలట్ నిర్లక్ష్యం కారణంగా రైలు పట్టాలు తప్పిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రమాదంలో మేజర్ గాయాలైన వారికి రూ. రెండు లక్షల చొప్పున, మైనర్ గాయాలైన వారికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారాన్ని అందజేశారు. రైలు ప్రమాదానికి గల కారణాలపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది. పట్టాలను పునరుద్ధరించి రైళ్లను పునరుద్ధించినట్టు దక్షిణ మధ్య రైల్వే ఎస్‌సిఆర్, సిపిఆర్ఒ రాకేష్ తెలిపారు.

మూడు కేసుల్లో చంద్రబాబుకు ముందస్తు బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

చేయబోదు' అని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ సందర్భంగా పిటిషనర్లకు పలు షరతులు విధించింది. 'ఉత్తర్వుల జారీ నాటి నుంచి వారం రోజుల్లోగా కేసుల దర్యాప్తు అధికారి ఎదుట లొంగిపోవాలి. రూ.లక్ష విలువైన రెండు వ్యక్తిగత పూచీకత్తులు సమర్పించాలి. దర్యాప్తు చేయదలిస్తే సంబంధిత అధికారి 48 గంటల వ్యవధితో కూడిన నోటీసు ఇవ్వాలి. దర్యాప్తు అధికారి పిలిచినప్పుడు హాజరుకావాలి. దర్యాప్తు అధికారికి సహకరించాలి. సాక్ష్యాలను తారుమారు చేయకూడదు. సాక్షులను ప్రలోభపెట్టకూడదు. కేసుకు చెందిన వివరాల గురించి బహిరంగ ప్రకటనలు చేయకూడదు' అని షరతులు విధించింది.

'ఇవి ప్రాథమిక అభిప్రాయాలే. కేవలం ముందస్తు బెయిల్ పిటిషన్లకు సంబంధించినవే. కేసులోని అభియోగాలకు సంబంధించినవి కావు. ముందస్తు బెయిల్ ఉత్తర్వులు ప్రధాన కేసు దర్యాప్తుపై ఏమాత్రం ప్రభావం ఉండకూడదు. ఇటీవల నారా లోకేష్ ఒక టివి ఇంటర్వ్యూ ఆధారంగా చేసుకుని చంద్రబాబుకు ముందస్తు బెయిల్ నిరాకరణ చేయలేం' అని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

బూత్‌లు ఏర్పాటు చేయాలని, వలంటీర్ల జోక్యం, సచివాలయ సిబ్బందిని బిఎల్‌ఒలుగా నియమించడం వంటి పలు అంశాలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఫిర్యాదులన్నిటినీ నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న 7.88 లక్షల ఓటర్లు

ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో 18-19 ఏళ్లకు పైబడిన యువత 7.88 లక్షల మంది తమ ఓటు హక్కును తొలిసారిగా వినియోగించుకోనున్నారని రాజీవ్‌కుమార్ తెలిపారు. గిరిజన ప్రాంతాలకు సంబంధించి 4,29,106 మంది ఓటర్లు కాగా, ఇందులో 18 ఏళ్లకు పైబడిన జనాబా 2,94,750 మంది ఉన్నారన్నారు.

46,185 పోలింగ్ కేంద్రాలు

రాష్ట్ర వ్యాప్తంగా 46,165 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో అర్బన్ 11,978, రూరల్‌లో 34,187 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 80 ఏళ్ల వయసు దాటిన ఓటర్లు 5.8 లక్షల మంది ఉన్నట్లు సిఇఒ వెల్లడించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఫిర్యాదులను పరిష్కరించేందుకు సి విజిల్ యాప్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు.

ఓటర్ హెల్ప్‌లైన్ కోసం సువిధ పోర్టల్

ఓటరు తమ ఓటును చేర్చుకునేందుకు వీలుగా ఆన్‌లైన్‌లో ఓటరుకు సువిధ పోర్టల్ అందుబాటులో ఉండనుంది. దీని ద్వారా తమ ఓటు ఎక్కడ ఉంది? ఏ పోలింగ్ పోలింగ్ బూత్‌లో నమోదైంది? వంటి సమాచారం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండనుంది. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని సిఇసి రాజీవ్‌కుమార్ తెలిపారు.

గాజాలో పౌరుల మరణాలు సహించరానివి !

- ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో భారత రాయబారి రుచిరా కాంభోజ్
- ఒకే రోజు 147మంది పాలస్తీనియన్లు మృతి
- సురక్షిత జోన్‌లనూ విడిచిపెట్టని ఇజ్రాయిల్ బలగాలు
- అబ్బాస్‌తో బ్లింకెన్ భేటీ



ఐక్యరాజ్య సమితి : గాజాలో పౌరుల మరణాలు సహించరానివని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో భారత శాశ్వత రాయబారి రుచిరా కాంభోజ్ అన్నారు. గాజాపై ఇజ్రాయిల్ యుద్ధం ఆరంభించినప్పటి నుండి ఇజ్రాయిల్, పాలస్తీనా నేతలతో భారత్ నిరంతరంగా సంబంధాలను కలిగివుందని చెప్పారు. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని భారత్ కోరుతూ వస్తోందన్నారు. మానవతా సాయం నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని, శాంతి, సుస్థిరతలు త్వరగా పునరుద్ధరించాలన్నది భారత్ వైఖరని స్పష్టం చేశారు.

గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న భీకర దాడుల్లో పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరుగుతోందని, ముఖ్యంగా మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో చనిపోతున్నారని రుచిరా కాంభోజ్ బుధవారం పేర్కొన్నారు. దాడుల ఫలితంగా మానవతా సంక్షోభం నెలకొందన్నారు. ఇది ఎంత మాత్రమూ సహించరానిది, ఆమోదించరానిదని అన్నారు. పౌరుల మరణాలను భారత్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తీవ్రవాదం ఏ రూపంలో, ఎలా వున్నా భారత్ ఎన్నడూ సహించబోదన్నారు. పౌరులను బందీలుగా చేపట్టడం సమర్ధనీయం కాదన్నారు. తక్షణమే బందీలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మధ్య ప్రాచ్యంలోని నేతలతో భారత నాయకత్వం సంబంధాలను కలిగివుందని చెబుతూ, చర్చలు, దౌత్య మార్గం ద్వారా ఈ ఘర్షణలకు శాశ్వత, శాంతియుత పరిష్కారాన్ని కనుగొనాలన్నదే భారత్ వైఖరని, తాము మొదట నుండి ఇదే చెబుతున్నామని అన్నారు. గాజాలో మానవతా సాయాన్ని అందించడంపై భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానానికి రష్యా సవరణను ప్రతిపాదించగా, అమెరికా గత నెల 22న వీటో చేసింది. అనంతరం జరిగిన జనరల్ అసెంబ్లీ సమావేశంలో రుచిరా కాంభోజ్ ప్రసంగించారు.

సెంట్రల్, దక్షిణ గాజాల్లో ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న ముమ్మర దాడుల్లో మంగళవారం నాడు 147మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో రఫా నగరంలోని ఒకే కుటుంబానికి చెందిన 15మంది కూడా వున్నారు. ఒకప్పుడు సురక్షిత జోన్ అని ప్రకటించిన రఫా నగరంలో కూడా ఇజ్రాయిల్ భీకరంగా దాడులకు దిగుతోంది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ బలగాలు వరుస దాడులు చేపడుతున్నాయి. పేలుడు పదార్ధాలతో పాలస్తీనా ఫైటర్లను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇదిలావుండగా, రమల్లా నగరంలో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంపై అమెరికా విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. గాజాలో పౌరులకు జరుగుతున్న నష్టాన్ని తగ్గించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై బ్లింకెన్ చర్చించారని, అలాగే మానవతా సాయాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా అందచేయడం కూడా వేగంగా సాగాలని కోరినట్లు ఆ ప్రకటన పేర్కొంది. రెండు దేశాల ఏర్పాటు దిశగా స్పష్టమైన చర్యలు తీసుకోవడానికి అమెరికా మద్దతిస్తుందని విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ చెప్పారు. ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 23,357మంది మరణించగా, 59,410మంది గాయపడ్డారు.

సెంట్రల్ గాజాలోని డేర్ ఎల్ బాలాహ్‌లో అల్ అక్సా ఆస్పత్రికి సమీపంలోని ఇంటిపై ఇజ్రాయిల్ బలగాలు దాడి చేయడం 40మందికి పైగా మరణించారు, పలువురు గాయపడ్డారని గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సెంట్రల్ గాజాలో ఇజ్రాయిల్ ఆర్మీ సురక్షిత ప్రాంతమని ప్రకటించిన చోటే జరిగిన ఈ భీకర దాడితో వారు చెబుతున్న అసత్యాలు, చేస్తున్న మోసాలు తేటతెల్లమవుతున్నాయని మీడియా కార్యాలయం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. గాజాలో ఎక్కడా కూడా సురక్షితమైన ప్రాంతమనేదే లేదని దీంతో స్పష్టమైందని పేర్కొంది.

గాజాలో ఇళ్లను విధ్వంసం చేయడాన్ని ఊచకోతకు సాక్ష్యాధారాలుగా అంతర్జాతీయ న్యాయస్థానం పరిగణించాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల నిపుణుడు బాలకృష్ణన్ రాజగోపాల్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు గాజాలో 56శాతానికి పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయని చెప్పారు. ఉత్తర గాజాలో పరిస్థితి మరీ దారుణంగా వుందన్నారు. 82శాతం గృహాలు నేలమట్టమయ్యాయన్నారు.

గాజాలో ఆస్పత్రుల్లో పరిస్థితి చాలా దారుణంగా వుందని రెడ్ క్రాస్ తెలిపింది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ డైరెక్టర్ రాబర్ట్ మార్దిని మాట్లాడుతూ, అన్ని ఆస్పత్రుల్లోనూ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందన్నారు. ఇది ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కానిదని, ప్రమాదకరమైనదని వ్యాఖ్యానించారు.

షిండే గ్రూపే అసలైన శివసేన

- మహారాష్ట్ర స్పీకర్ తీర్పు

ముంబయి : మహారాష్ట్రలో శివసేన చీలికపై ఆ రాష్ట్ర స్పీకర్ ఊహించినట్లుగానే తీర్పు ఇచ్చారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే గ్రూపే అసలైన శివసేన అని రాష్ట్ర స్పీకర్ రాహుల్ నర్వేకర్ బుధవారం తీర్పు ఇచ్చారు. శివసేన ఎమ్మెల్యేల్లో చీలికకు సంబంధించి ఉద్ధవ్ థాక్రే, షిండే గ్రూపుల పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బుధవారం స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించారు. షిండే గ్రూపులోనే మెజార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారన్న స్పీకర్.. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరతూ దాఖలైన పిటిషన్లన్నింటినీ తిరస్కరించారు. అలాగే, శివసేన పార్టీ 2018 రాజ్యాంగాన్ని పరిగణించాలన్న ఉద్ధవ్ గ్రూపు అభ్యర్థనను స్పీకర్ తోసిపుచ్చారు.

సుప్రీంకోర్టు వెళతాం : ఉద్ధవ్ థాక్రే

స్పీకర్ రాహుల్ నర్వేకర్ నిర్ణయంపై ఉద్ధవ్ థాక్రే తీవ్రస్థాయిలో స్పందించారు. స్పీకర్ నిర్ణయం సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని హత్య చేసే కుట్రగా విమర్శించారు. స్పీకర్ నిర్ణయాన్ని శివసేన (యూబీటీ) గ్రూపు సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నట్లు చెప్పారు. "స్పీకర్ రాహుల్ నర్వేకర్ తీరు చూస్తే ఆయన కుమ్మక్కైనట్లు తేలిపోయింది. ఆయన ప్రకటించిన నిర్ణయం ప్రజాస్వామ్యాన్ని హత్య చేసే పన్నాగమనే సందేహం నిన్ననే వ్యక్తం చేశాను. సుప్రీంకోర్టులో ధిక్కరణ కేసు వేయాలా.. లేదా అనేది చూస్తాం. ఒకవేళ మా పార్టీ రాజ్యాంగం చెల్లకపోతే.. మరి మమ్మల్ని ఎందుకు అనర్హులుగా ప్రకటించలేదు? సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందన్న విశ్వాసం మాకు పూర్తిగా ఉంది. " అని ఉద్ధవ్ అన్నారు.

ఇది బిజెపి కుట్ర: సంజయ్ రౌత్

షిండే గ్రూపే అసలైన శివసేన అని స్పీకర్ రాహుల్ నర్వేకర్ వెల్లడించిన నిర్ణయంపై శివసేన (యూబీటీ) నేత, ఎంపి సంజయ్ రౌత్ స్పందించారు. 'ఇది బిజెపి కుట్ర. ఏదో ఒకరోజు బాలాసాహెబ్ థాక్రే ఏర్పాటు చేసిన శివసేనను అంతం చేయాలన్నది వారి కల అన్నారు. అయితే, ఈ ఒక్క నిర్ణయంతో శివసేన ముగిసిపోదని.. తాము సుప్రీంకోర్టులో తేల్చుకుంటాం' అని అన్నారు.

ఎన్నికలకు ముందు మహిళా రైతులకు నగదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం మహిళా రైతులకు వార్షిక చెల్లింపును రూ. 12,000కి రెట్టింపు చేయాలని పరిశీలిస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తుంది. ఈ అంశాన్ని ఫిబ్రవరి 1న బడ్జెట్‌లో ప్రకటించే అవకాశం ఉంది. ప్రభుత్వానికి అదనంగా రూ. 12,000 కోట్లు ఖర్చవుతుందని, బడ్జెట్ ప్రతిపాదనపై చర్చిస్తుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 2019లో సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రకటించిన ప్రస్తుత పిఎం కిసాన్ పథకం ఆధారంగా ఇది దీన్ని తయారు చేస్తున్నట్లు సమాచారం. "ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం కిసాన్)" కార్యక్రమం కింద, ప్రభుత్వం పురుషులు, మహిళలు ఇద్దరికీ సంవత్సరానికి రూ.6,000 బదిలీ చేస్తుంది. ప్రభుత్వ అంచనాల ప్రకారం ఇప్పటివరకు 15 విడతలుగా 110 మిలియన్లకు పైగా రైతులకు రూ.2,81,000 కోట్లకు పైగా పంపిణీ చేసింది. దేశంలో 260 మిలియన్లకు పైగా రైతులు ఉన్నారు. వీరిలో 60 శాతం మంది మహిళలు ఉన్నారు.

ఐసిజె లో దక్షిణాఫ్రికాకు పెరుగుతున్న మద్దతు

- ఇజ్రాయిల్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఒత్తిడి



ప్రిటోరియా : గాజాలో ఇజ్రాయిల్ సైనిక చర్యలను నిలుపు చేస్తూ తక్షణమే అత్యవసర చర్యలు చేపట్టాలని అంతర్జాతీయ న్యాయ స్థానాన్ని (ఐసిజె) దక్షిణాఫ్రికా కోరింది. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికా తీసుకున్న ఈ చర్యకు మద్దతు పెరుగుతోంది. ఇప్పటికే బొలీవియా, మలేసియా, బంగ్లాదేశ్‌లు మద్దతుగా ప్రకటనలు జారీ చేశాయి. ఈ అంశంపై అంతర్జాతీయ న్యాయ స్థానం గురువారం విచారణ చేపట్టనుంది. పాలస్తీనియన్లకు మద్దతుగా దక్షిణాఫ్రికా తీసుకున్న చారిత్రక చర్యను బొలీవియా ప్రభుత్వం గుర్తించిందని తెలిపింది. పాలస్తీనాలో ఇజ్రాయిల్ పాల్పడుతున్న నేరాలపై దర్యాప్తు చేయాలని బొలీవియా కోరుతోంది. గాజాలో సాగుతున్న అత్యాచారాలకు ఇజ్రాయిల్‌ను జవాబుదారీని చేసే దిశగా సకాలంలో, స్పష్టమైన చర్యలు తీసుకోవాలని మలేసియా కోరింది. టర్కీ, 57 దేశాలతో కూడిన ఇస్లామిక్ సహకార సమాఖ్య (ఒఐసి)లు కూడా ఈ విషయంలో దక్షిణాఫ్రికాకు మద్దతు పలికాయి. ఇజ్రాయిల్ విచక్షణా రహితంగా పాలస్తీనియన్లపై జరిపే దాడులు, సాగించే హత్యలు, విధ్వంసం, ఇవన్నీ కూడా మారణకాండ కిందకే వస్తాయని, పాలస్తీనా జాతి నిర్మూలన చర్యలుగానే పరిగణించాలని ఓఐసి పేర్కొంది. 30ఏళ్ల క్రితం ఇజ్రాయిల్‌తో శాంతి ఒప్పందంపై సంతకాలు చేసిన జోర్డాన్ కూడా ఐసిజెలో దక్షిణాఫ్రికాకు మద్దతిచ్చింది. అంతర్జాతీయ న్యాయ స్థానంలో దక్షిణాఫ్రికా పెట్టిన దరఖాస్తుకు మద్దతుగా ఈ నెల 8న 900కి పైగా ప్రజా ఉద్యమాలు, రాజకీయ పార్టీలు, యూనియన్లు, ఇతర సంస్థలు, సంఘాలు 'డిక్లరేషన్ ఆఫ్ ఇంటర్‌వెన్షన్' దాఖలు చేయాల్సిందిగా ప్రపంచవ్యాప్తంగా గల దేశాలకు పిలుపిచ్చాయి.



సబ్సీడీల్లో కోతకు వ్యతిరేకంగా జర్మనీలో రైతుల నిరసన

బెర్లిన్ : వ్యవసాయ రంగానికి చెందిన సబ్సీడీల్లో ప్రభుత్వం కోత విధించడానికి నిరసనగా జర్మనీ వ్యాప్తంగా రైతులు ఆందోళనకు దిగారు. సబ్సీడీల్లో కోత విధించడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పరికరాలు, డిజెల్‌కు ఇచ్చే సబ్సీడీల్లో జర్మన్ ప్రభుత్వం ఇటీవల కోత విధించింది. దీంతో సాగు మరింత భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

చాంగ్-6 లూనార్ మిషన్‌కు చకచకా ఏర్పాట్లు

- ప్రయోగ వేదిక వద్దకు చేరుకున్న రోదసీ నౌక విడిభాగాలు

బీజింగ్ : ఈ ఏడాది మొదటి అర్ధభాగంలో చాంగ్-6 లూనార్ మిషన్‌ను ప్రారంభించడానికి చైనా జాతీయ రోదసీ సంస్థ (సిఎన్ఎస్ఎ) సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చకా చకా పూర్తవుతున్నాయి. అంతరిక్ష నౌక విడి భాగాలు సోమ, మంగళవారాల్లో రెండు రవాణా విమానాల్లో హైనన్ ప్రావిన్స్‌లోని వెన్‌చాంగ్ రోదసీ ప్రయోగ వేదిక వద్దకు చేరుకున్నాయని గ్లోబల్ టైమ్స్ పేర్కొంది. చంద్రునిపై అన్వేషణలో భాగంగా నాల్గో దశ కార్యక్రమాల్లో భాగంగా ఇవన్నీ జరుగుతున్నాయని సిఎన్ఎస్ఎ పేర్కొంది. ప్రయోగ వేదిక వద్ద అన్ని సదుపాయాలు చక్కగా వున్నాయని, అనుకున్న ప్రణాళిక ప్రకారమే కావాల్సిన ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈ ఏడాది మొదటి అర్ధభాగంలో చాంగ్-6ను ప్రయోగించనున్నట్లు సిఎన్ఎస్ఎ తెలిపింది. చంద్రుని తిరోగమన కక్ష్య రూపకల్పన, నియంత్రణలో కొత్త పుంతలు తొక్కాలన్నది చాంగ్-6 మిషన్ లక్ష్యంగా వుంది. చంద్రుని ఆవల వైపు నుండి నమూనాలు సేకరించడం, చంద్రుని ఉపరితలంపై దిగడం వంటి లక్ష్యాలు కూడా ఈ మిషన్‌లో వున్నాయి. రోదసీ నౌక చంద్రునిపై దిగే ప్రాంతం శాస్త్రీయ అన్వేషణ కూడా దీనితో పాటు కొనసాగుతుందని సిఎన్ఎస్ఎ తెలిపింది.

భూటాన్ ప్రధానిగా త్సెరింగ్ టోబ్గే

థింపూ : మంగళవారం జరిగిన భూటాన్ పార్లమెంట్ ఎన్నికల్లో పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) విజయం సాధించింది. బుధవారం ఎన్నికల కమిషన్ అధికారికంగా వెలువరించిన ఫలితాల్లో మొత్తం 47 నేషనల్ అసెంబ్లీ సీట్లకు గానూ 30సీట్లను పిడిపి గెలుచుకోగా, భూటాన్ టెండరల్ పార్టీ 17 స్థానాలను కైవసం చేసుకుంది. కాగా, లిబరల్ పిడిపి అధ్యక్షుడు త్సెరింగ్ టోబ్గే రెండోసారి ప్రధాని పదవిని చేపట్టనున్నారు. తొలుత 2013 నుండి 2018 వరకు ఆయన ప్రధానిగా చేశారు. 2008లో మొదటిసారిగా భూటాన్ పార్లమెంట్ ఏర్పడినపుడు టోబ్గే ప్రతిపక్ష నేతగా వున్నారు. స్థూల జాతీయాభివృద్ధి కన్నా స్థూల జాతీయ ఆనందానికే ప్రాధాన్యతనిస్తూ సుదీర్ఘంగా అనుసరిస్తూ వచ్చిన భూటాన్ విధానాన్ని ప్రశ్నించేలా ఈసారి తీవ్ర ఆర్థిక సవాళ్ళు ఎన్నికల్లో ముఖ్య పాత్ర పోషించాయి. యువతలో నిరుద్యోగం రేటు 29శాతంగా వుండగా, గత ఐదేళ్ళుగా సగటున ఆర్థిక వృద్ధి రేటు 1.7శాతంగా వుంది. ప్రజల సంతోషం, సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తామని టోబ్గే హామీ ఇచ్చారు. కాగా భూటాన్ కీలక వాణిజ్య భాగస్వామి అయిన భారత్ ప్రధాని నరేంద్ర మోడీ, టోబ్గేకు అభినందనలు తెలియచేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలనకు అధికారులతో వెంటనే కమిటీ వేస్తామని తెలిపారు. సమావేశ అంశాలకు సంబంధించిన మినిట్స్‌ను కూడా గురువారంనాడే సంఘాల నాయకులకు అందిస్తామని వివరించారు. పారిశుధ్య కార్మికులను పది కేటగిరీలుగా మార్చి ప్రస్తుతం ఇస్తున్న రూ.15 వేల గౌరవవేతనం, ఆరువేల హెల్త్ అలవెన్సును కలిపి రూ.21 వేల వేతనంగా మార్చామని పేర్కొన్నారు. డ్రైవర్లు, క్లీనర్లు, మలేరియా, యుజిడి వర్కర్లకు ప్రస్తుతం ఇస్తున్న రెమ్యునరేషన్‌కు అదనంగా ఆరువేల కలిపి ఇస్తామని చెప్పారు. పాఠశాలల్లో పనిచేస్తున్న కంటింజెన్సీ వర్కర్లకూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుండి జీతాలు ఇస్తామని, పారిశుధ్యేతర కార్మికుల కేటగిరీల అంశాన్ని పరిష్కరిస్తామని చెప్పారు. పని సమయంలో చనిపోతే సుప్రీం కోర్టు నిబంధనల మేరకు రూ.30 లక్షలు, శాశ్వత అంగవైకల్యానికి రూ.20 లక్షలు, వైకల్యానికి రూ.10 లక్షలు చొప్పున ఇస్తామని పేర్కొన్నారు. సిబ్బందికి సరెండర్ లీవులు, ఇతర పరిహారాలు అందిస్తామని అన్నారు. కొంతమంది సిబ్బందికి పిఎఫ్ ఎకౌంట్లు లేవని, వారికి ఏర్పాటు చేస్తామని అన్నారు. 2019లో చనిపోయిన కొంతమంది కార్మికులు పరిహారానికి దరఖాస్తు చేసుకోలేదని, వీరికి పరిహారం అందించేందుకు జిఒ ఇచ్చి దరఖాస్తుకు రెండు నెలల సమయం ఇస్తామని పేర్కొన్నారు. ఈలోపు చేసుకున్న వారికి పరిహారం అందిస్తామని వివరించారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది రిటైరైతే రూ.75 వేలు ఇస్తామని, కనీసం పది సంవత్సరాలు విధులు నిర్వహించిన వారికి ఇది వర్తిస్తుందని చెప్పారు. అదనంగా విధులు నిర్వహించిన వారికి ఏటా రూ.2 వేలు పెంచుతామని వివరించారు. ప్రమాదంలో చనిపోయిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.7 లక్షలు పరిహారం అందిస్తామన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో సర్టిఫికెట్ లేకుండా చేస్తున్న వారికి సర్టిఫికెట్ తెచ్చుకుంటే ఖాళీలు వచ్చిన సమయంలో వారితోనే భర్తీ చేస్తామని పేర్కొన్నారు. మట్టి ఖర్చులు రూ.15 వేల నుండి రూ.20 వేలకు పెంచుతామని అన్నారు. కరోనా సమయంలో కొంతమంది పనిచేశారని, వారిని ఔట్‌సోర్సింగ్‌లో చేర్చుకోలేదని భవిష్యత్‌లో ఖాళీలు వస్తే అటువంటి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. కొత్త మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వర్కర్లకు కూడా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కింద వేతనాలు ఇస్తామని తెలిపారు. విలీన పంచాయతీల్లో, సిఆర్‌డిఏ పరిధిలో మంగళగిరిలో కలిసిన గ్రామాలకు మున్సిపల్ వేతనాలు ఇస్తామని, మిగిలిన గ్రామాల్లో మున్సిపాలిటీ లేనందున సిఆర్‌డిఏ పరిధిలో ఇచ్చే వేతనాలే ఇస్తామని పేర్కొన్నారు. పండుగ నేపథ్యంలో ప్రతి కార్మికుడికి వేయి రూపాయలు అదనంగా ఇస్తామని వివరించారు.

'భారత్ జోడో న్యాయ యాత్ర'కు మణిపూర్ అనుమతి నిరాకరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ నిర్వహించనున్న 'భారత్ జోడో న్యాయ యాత్ర' ప్రారంభానికి మణిపూర్ ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ఈ యాత్ర ఈ నెల 14న ప్రారంభం కావాల్సిఉంది. ఈ నేపథ్యంలో మణిపూర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కె మేఘచంద్ర, ఇతర నాయకులతో కలిసి బుధవారం ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్‌ను కలిశారు. రాహుల్ గాంధీ యాత్ర ప్రారంభానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి సిఎం స్పందిస్తూ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిని సాకుగా చూపుతూ అనుమతి నిరాకరించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. యాత్రను తమ ప్రభుత్వం అనుమతించదని సిఎం ఎన్ బీరెన్ సింగ్ చెప్పారని కె మేఘచంద్ర వెల్లడించారు. మణిపూర్ ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ స్పందిస్తూ ఇది రాజకీయ ప్రయత్నం కాదని, యాత్రను రాజకీయం చేయొద్దని తెలిపారు. రాహుల్ గాంధీ రాజకీయాలు చేయడానికి అక్కడికి వెళ్లడం లేదని, శాంతి సందేశం ఇవ్వబోతున్నారని చెప్పారు. అక్కడ అనుమతించకపోతే వేరే ప్రదేశానికి వెళ్తామని, మరో ప్రదేశానికి వెళ్లేందుకు సిఎం అనుమతి ఇచ్చి ఉండవచ్చని అన్నారు.



సమీక్షలో పాల్గొన్న సిఎం, మంత్రులు

త్వరలో నూతన విద్యుత్తు పాలసీ

- తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీలో విస్తృత చర్చ, సంబంధిత నిపుణులతో సంప్రదింపుల అనంతరం త్వరలోనే సమగ్ర నూతన విద్యుత్ విధానం తీసుకొస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో విస్తృతంగా చర్చించడంతో పాటు అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకుంటామని, అందరికీ ఆమోదయోగ్యమైన విద్యుత్ పాలసీ రూపొందిస్తామని చెప్పారు. విద్యుత్ శాఖ పనితీరుపై బుధవారం బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు హాజరయ్యారు. రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం, 24 గంటలపాటు నిరంతర విద్యుత్తు సరఫరా, ఉత్పత్తి, కొత్త ప్లాంట్లు, గృహజ్యోతి పథకం అమలు తీరుతెన్నులు, తదితర అంశాలపై చర్చించారు. 2014 నుంచి ఇప్పటిదాకా విద్యుత్ కంపెనీలకు, విద్యుత్ నియంత్రణ మండలి (ఇఆర్‌సి) మధ్య జరిగిన ఒప్పందాల వివరాలు, ధరలపై సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను సిఎం ఆదేశించారు. బహిరంగ మార్కెట్‌లో ఎక్కడ తక్కువ ధరకు విద్యుత్ లభిస్తుందో, ఆ కంపెనీల నుంచే విద్యుత్ కొనుగోలు చేయాలని ఆదేశించారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యుత్తు విధానాలను అధ్యయనం చేసి నివేదిక అందజేయాలని ట్రాన్స్ కో సిఎండి రిజ్వీని ఆదేశించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చి తీరాలని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలలో ఒకటైన గృహజ్యోతి పథకం ద్వారా ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

మెగా డిఎస్‌సి అడిగితే నిరుద్యోగ ఉపాధ్యాయులు అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ అమలు చేయకుండా నయవంచన చేసిందని డివైఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు వై రాము, జి రామన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్ల నుంచి డిఎస్సి పేరుతో టోపి పెట్టిందని విమర్శించారు. వెంటనే 25వేల టీచర్ పోస్టులతో మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 40వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పార్లమెంట్‌లో కేంద్రప్రభుత్వం ప్రకటించిందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 117 జివో పేరుతో 2వేల పాఠశాలలను మూసివేసిందని తెలిపారు. తెలుగు మీడియం రద్దు చేసి మరో 15వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిందన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో 9వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయ పోస్టుల నోటిఫికేషన్ కోసం 10లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని తెలిపారు.కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం-2020 అమలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు.

అరెస్టులను ఖండించిన ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్

నిరుద్యోగ అభ్యర్థుల అరెస్టులను ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ విడివిడిగా ఖండించాయి. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు కె ప్రసన్న కుమార్ఎ అశోక్, కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి వేరువేరుగా ప్రకటనలు విడుదల చేశారు. మెగా డిఎస్సి విడుదల చేస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రకృతి సాగు సాకు ఎరువులకు కేంద్రంకోత

(మొదటి పేజీ తరువాయి)

తీసుకొచ్చామని ప్రచారం సాగుతోంది. వాస్తవానికి రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల అంతగా సానుకూలంగా లేరు. ప్రచారం చేసినంతగా విస్తీర్ణమేమీ పెరగలేదు. అదొక స్కామ్ అని ఆరోపణలొస్తున్నాయి.

వాస్తవ విరుద్ధం

ప్రతి సీజన్‌లోనూ వ్యవసాయశాఖ ఇ-క్రాప్‌లో సాగులను నమోదు చేస్తోంది. అన్ని పథకాలకూ ఇ-క్రాప్ తప్పనిసరి చేసింది. ప్రకృతి వ్యవసాయానికి ఎంపిక చేసిన మండలాల్లో ప్రత్యేకంగా క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సిఆర్‌పి) పని చేస్తున్నారు. ఇ-క్రాప్‌లో నమోదు చేస్తున్న రైతు భరోసా కేంద్రం (ఆర్‌బికె) సహాయకులకు సిఆర్‌పిలు ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల డేటా ఇస్తున్నారు. ఆ డేటాను ఇ-క్రాప్‌లో ఎంటర్ చేస్తున్నారు. సిఆర్‌పిలు ఇచ్చే సమాచారం చాలా మట్టుకు వాస్తవ విరుద్ధంగా ఉంటోంది. ప్రకృతి వ్యవసాయం కిందకు వచ్చిందంటూ పెద్ద ఎత్తున విస్తీర్ణాన్ని పెంచుతున్నారు. డేటాను కేంద్రానికి పంపుతున్నారు. ఈ సమాచారం ఆధారంగా రాష్ట్రానికి యూరియా, డిఎపి, కాంప్లెక్స్, ఎంఒపి వంటి ముఖ్యమైన రసాయన ఎరువుల కేటాయింపులను, సరఫరాను కేంద్రం తగ్గిస్తోంది. ఫలితంగా అదనుకు రైతులకు ఎరువులు దొరకట్లేదని స్వయంగా వ్యవసాయశాఖే చెబుతోంది.

రాముడి పేరుతో బిజెపి డ్రామా

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. దేశాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు, వారి సమస్యలను పట్టించుకోకుండా మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న వారికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బివి.రాఘవులు మాట్లాడుతూ... అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా సాగదీస్తే రాజకీయంగా వైసిపి పతనం ఖాయమని, అధికారాన్ని పళ్లెంలో పెట్టి ప్రతిపక్షాలకు అప్పగించడమేనని హెచ్చరించారు. అంగన్‌వాడీల సమ్మె మొదలైన 26 రోజుల తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్మా గుర్తుకొచ్చిందా? అని ప్రశ్నించారు. గతంలో జయలలిత ప్రభుత్వం ఉద్యోగులపై ఎస్మా ప్రయోగించగా తరువాత ఆమె ప్రభుత్వాన్ని జనం తొలగించారన్నారు. అణచివేత చర్యలు మంచివి కావని, చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు రాజకీయ పార్టీలు అంగన్‌వాడీ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనలేదని, మద్దతు ప్రకటించాయని చెప్పారు. రాజకీయ సహాయం తీసుకుని తక్షణం పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి సాయం అడిగితే చేతనైన సహాయం చేస్తామన్నారు. ప్రభుత్వం మొండివైఖరి విడనాడకుంటే రాజకీయ పార్టీగా ప్రత్యక్ష పోరాటాల్లోకి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

మీడియాను కూడా ఉగ్రవాద చట్టాల వంటి పరిధిలోకి తీసుకొచ్చి నియంత్రించే విధంగా కేంద్రం చర్యలు ఉన్నాయని చెప్పారు. న్యూస్‌క్లిక్ వంటి పలు పోర్టల్స్ విషయంలో జర్నలిస్టులను వేధిస్తున్నారని, దీన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిస్తూ.. వచ్చే ఎన్నికల్లో పరిస్థితులను బట్టి పొత్తులపై నిర్ణయం తీసుకుంటామని, ఎన్‌డిఎలో భాగస్వాములైన పార్టీలతో తాము ఎట్టి పరిస్థితుల్లోనూ పొత్తు పెట్టుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. అఖిలభారత స్థాయిలో ఇండియా వేదిక ఏర్పడిందని, ఎన్నికల్లో ఆ పార్టీలు తగిన విధంగా వ్యవహరిస్తాయన్నారు. జగన్ ఇండియా వేదికకు రారు, బిజెపిని వదలరని పేర్కొన్నారు. జనసేన, టిడిపి ఏ కూటమిలో ఉంటాయో తేలాల్సి ఉందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి పాల్గొన్నారు. అనంతరం రెండురోజులపాటు జరిగే సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభమయ్యాయి.





మీ కోసం

బియ్యం పిండి చెక్కలు కరకరలాడాలంటే, పిండిని వేడినీటితో కలుపుకోవాలి. ఆ పిండిలో అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి మెత్తగా నూరి కలుపుకుంటే రుచిగా ఉంటాయి. వేయించిన వేరుశనగ గింజలు, నువ్వులు కలపడం వల్ల అదనపు రుచి కూడా చేరుతుంది.

జీవన సౌరభం

జీవితంలో సాధ్యం కాని ప్రయాణమంటే, అసలు ప్రారంభించనిదే. ప్రారంభించని పనే అసాధ్యంగా కనిపిస్తుంది.

పువ్వు నవ్వు

పువ్వు పువ్వు పువ్వు
నవ్వు నవ్వు నవ్వు
పూసిన పువ్వుల నవ్వు
నవ్వులు నవ్వే పువ్వు!

విరిసిన పువ్వు నవ్వు
మురిసిన మనసు పువ్వు
చిలక నవ్వే నవ్వు
బోసి నవ్వులే నవ్వు !

విరిసీ విరియని పువ్వు
ముసి ముసి నవ్వుల నవ్వు
పూసిన పూవుల పున్నమి
జాబిలి నవ్వుల వెన్నెల


నవ్వు నవ్వులో పువ్వు
పువ్వు పువ్వులో నవ్వు
పువ్వే నవ్వు నవ్వే పువ్వు
నువ్వు నవ్వు నవ్వే నవ్వు



- పి.బక్కారెడ్డి,
97053 15250.

ఖాళీలు పూరించండి

పిల్లలూ, కింద ఇచ్చిన క్లూ ఆధారంగా ఇక్కడ ఇచ్చిన పదకేళిని సరైన ఆంగ్ల అక్షరాలతో నింపండి.



Across

3. gr _ _ _ _
5. st _ _ w _ e _ _ y
6. l _ _ _ _
7. m _ _ g _
8. p _ n _ ap _ _ _
9. b _ n _ n _

Down

1. w _ t _ r m _ l _ n
2. p _ _ r
4. or _ _ _ _
8. p _ _ _ _

నేను గీసిన బొమ్మ



సి. నరసింహ,
5వ తరగతి,
దిగువ సాంబయ్య పాలెం,
తొట్టంబేడు మండలం,
తిరుపతి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పండగ వేళ.. ఇల్లు ఇలా శుభ్రపర్చుకోండి..

పండగ దగ్గర పడుతోంది. పిల్లలు, బంధువులు, సన్నిహితులతో ఇళ్లన్నీ కళకళలాడాలని అందరూ ఆశిస్తారు. ఇంత ఆహ్లాదకర వేళ, ఇంటి శుభ్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి. ఉద్యోగాలు చేసుకునే మహిళలు, ఇంటి పనులతో తీరిక లేకుండా గడిపే గృహిణులకు ఇంటి శుభ్రత అదనపు పని. అయితే ఒక్కసారే పనంతా మీదేసుకుని ఒళ్లు హూనం చేసుకోకుండా ఒక ప్రణాళిక ప్రకారం శుభ్రం చేసుకుంటూ వెళితే శ్రమ లేకుండా తేలిగ్గా ఉంటుంది.



పల్లెటూళ్లో ఇప్పటికే పండగ పనులు మొదలయ్యే ఉంటాయి. నగర ప్రజలు కూడా అన్నీ సిద్ధం చేసుకునే వుంటారు. ఒకటి, రెండు గదులున్న మధ్య తరగతి ప్రజానీకం కూడా పండగలప్పుడు ఇల్లు సర్దుకోవడంలో తెగ గాబరా పడిపోతారు. అలా కాకుండా ఒక్కోక్క గది శుభ్రం చేసుకుంటే పని తేలిక అవుతుంది. ఒంటి నొప్పులు రాకుండా ఉంటాయి.

కొంతమంది ఇళ్లల్లో ఇత్తడి, గాజు, రాగి సామానులు ఎక్కువగా ఉంటాయి. పండగొచ్చిందంటే అటకమీద నుండి, అలమరల్లో నుండి అవన్నీ కిందకి వచ్చేస్తాయి. వాటితో పాటు ఇంట్లో ఇతర సామాను కూడా దించేస్తాం. అన్నీ ఒకసారే శుభ్రం చెయ్యాలని ముందేసుకుంటారు. అలా కాకుండా వేటికవే, ముందు రాగి, ఇత్తడి, గాజు సామాను శుభ్రం చేసుకుని వాటిని ప్రత్యేకంగా భద్రపర్చుకోవాలి. ఆ తరువాత స్టీలు సామాను శుభ్రం చేసుకుంటే వస్తువులు పాడవ్వవు. పనీ సులువవుతుంది.

సామాను శుభ్రం చేసుకోవడం కంటే ముందు ఇంట్లో ఉన్న పనికిరాని వస్తువులన్నింటినీ ఒకపక్క చేర్చుకోవాలి. దుస్తులు, ప్లాస్టిక్ సామాను, పిల్లలు వాడి పారేసిన బొమ్మలు ఇలా ఒక్కొక్క ఇంట్లో ఒక్కో రకంగా చెత్త పేరుకుపోతుంది. దానంతటినీ ముందే తీసి పారేస్తే, ఒక స్పష్టత వస్తుంది. వేగంగా శుభ్రం చేసుకోవచ్చు.

బూజులు దులిపిన తరువాత అలమర్లను శుభ్రం చేసుకునేటప్పుడు తడి గుడ్డ ఉపయోగించకూడదు. పొడి గుడ్డతోనే దుమ్ము తుడవాలి. అప్పుడే మరకలు పడకుండా ఉంటాయి. అలాగే అరమరల్లోని వస్తువులను ఇంతకు ముందు పెట్టిన స్థానాల్లో కాకుండా స్థానం మారిస్తే కొత్తగా వుంటుంది. కొత్తగా కనిపిస్తుంది.

ఇక టీవీలు, ఫ్రిజ్‌ల పైభాగం శుభ్రం చేసేటప్పుడు మెత్తటి టవల్ ఉపయోగిస్తే దుమ్ము త్వరగా పోతుంది. అలాగే గ్లాస్ టేబుల్స్, డోర్లు, కిటికీలు, అద్దాలను మార్కెట్లో దొరికే క్లీనర్స్ లేక ఇంట్లో ఉండే సర్ఫ్‌ను నీళ్లల్లో కలిపి ఆ నీళ్లతో శుభ్రం చేసుకోవచ్చు. కిటికీ, తలుపు మెష్‌పై ఉన్న దుమ్ము స్టీల్ బ్రష్ సహాయంతో సులభంగా శుభ్రం చేయొచ్చు.

చెక్క తలుపులకు, కిటికీలకు, మంచం పట్టెలకు వార్నిష్ రాస్తే కొత్తగా ఉంటాయి. పుచ్చుపోకుండా ఉంటాయి. సీలింగ్ ఫ్యాన్ రెక్కలపై పేరుకుపోయిన దుమ్ము వదలాలంటే పాత దిండు కవర్‌ను ఫ్యాన్‌రెక్కకు తొడిగి రుద్దుతూ తుడవాలి. దీని వల్ల దిండు కవర్‌లో దుమ్ము, ధూళి పడుతుంది.

చాలామంది అరమరల్లో న్యూస్ పేపర్లు వేస్తుంటారు. ఈ పండక్కి తెల్ల పేపర్ వేసి చూడండి. అలాగే నీలం, లేత గులాబి రంగు కర్టెన్లు అమర్చుకుంటే ఇల్లంతా కొత్త శోభతో కళకళలాడుతుంది.

వాడకుండా ఉండే సామానంతా శుభ్రం చేసుకున్న తరువాత, తడి లేకుండా తుడుచుకుని ప్రత్యేకంగా సర్దుకోవాలి. మూట కట్టి అటక మీద పెట్టుకుంటే మంచిది. వాడుకునే సామానునే అరమరల్లో సర్దుకోవాలి. వాటి మధ్యలో మంచి వాసన వచ్చేలా కలరా ఉండలను అక్కడక్కడ వేయాలి.

ఇప్పుడు మార్కెట్లో బట్టలు భద్రపర్చుకునే బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. బీరువాలో బట్టలే కాకుండా కొంతమంది అరమరల్లో కూడా బట్టలు గుట్టలు గుట్టలుగా పేర్చేస్తుంటారు. ఈ సారి ఈ బ్యాగుల్లో ఎవరి బట్టలు వాళ్లకి ప్రత్యేకంగా సర్దుకుని చూడండి.


ఇల్లంతా శుభ్రం చేశాక ఇంటి మూలల్లో సీసాల్లో గాని, చిన్న డబ్బాల్లో గాని, మనీప్లాంట్, ఇండోర్ మొక్కలు పెడితే చాలా అందంగా కనిపిస్తాయి. ఇంటికి రంగులు వేసేటప్పుడు నీలం, లేత గులాబి రంగు పెయింట్ చేయిస్తే చాలా బాగుంటుంది. లోపల గోడల మీద అక్కడక్కడ పక్షులు, పూలు, చెట్లు చార్టులను అతికిస్తే గదంతా అందంగా కనపడుతుంది.



వేరుశెనగ పప్పులతో ఎంతోమేలు

సాధారణంగా మనం తీసుకొనే ఆహారంలో వేరుశెనగలు (పల్లీలు) బలమైన ఆహారం. నూనెశాతం ఎక్కువగా ఉంటాయి. శాఖాహారంగా చౌకగా మాంసకృత్తులు వీటిలో దొరుకుతాయి. కోడి గుడ్డులో కంటే రెండున్నర రెట్లు ఎక్కువగానే మాంసకృత్తులు ఉంటాయి. 70 శాతం సాచ్యురేటెడ్, 15 శాతం పోలి అన్సాచ్యురేటెడ్, 15 శాతం మోనో అన్సాచ్యురేటెడ్ ఉన్నాయి. మోనో అన్ సాచ్యురేటెడ్ కొవ్వులే శరీరానికి మేలు చేస్తాయి. ఇంట్లో ఉండే వేరుశనగ పప్పు ప్రతి రోజూ గుప్పెడు తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. కాబట్టి ప్రతిరోజూ ఆహారంలో వీటిని తీసుకుంటే మంచిది. ప్రతి 100 గ్రాముల వేరుశెనగల్లో 8 గ్రాముల విటమిన్ 'ఇ' ఉంటుంది. నియాసిన్, ప్రోటీన్, మాంగనీసు పోషకాలు అధికం. అమినో యాసిడ్స్ కూడా ఎక్కువ. ఇవి పిత్తాశయంలో రాళ్ళు ఏర్పడకుండా నివారిస్తుంది. అమినో యాసిడ్స్ మెదుడు నాడీకణాలకు సంబంధించిన కెరోటినిన్ ఉత్పత్తి చేస్తుంది. ఇది మెదడు ఒత్తిడికి గురికాకుండా సహాయపడుతుంది. మెదడు కణాలు దెబ్బతినకుండా రక్షణ కల్పించి జ్ఞాపకశక్తి మెరుగుపరుస్తుంది. ఫ్యాట్ శరీరానికి శక్తిగా మార్పు చెందుతుంది. శరీరంలో జీవక్రియలన్నీ ఆరోగ్యంగా జరగడానికి ఇవి సహాయపడతాయి. క్యాల్షియం, విటమిన్-డి లు ఎముకపుష్టికి దోహదపడతాయి. రెబోఫ్లేవిన్, నియాసిన్, థయామిన్, విటమిన్ బి6, ఫొలేట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీరాడికల్స్ చర్యలను నిరోధిస్తుంది. చర్మ ఇన్ఫెక్షన్లు రాకుండా దోహదపడతాయి. రోజూ గుప్పెడు వేరుశెనగలు లేదా పది గ్రాముల నట్స్, డ్రైఫ్రూట్స్ తింటే ఆరోగ్యం మెరుగుపడుతుందని పరిశోధకులు చెబుతున్నారు.

రంగవల్లి



15 చుక్కలు
8 వచ్చే వరకు
(మధ్య చుక్క)



జక్కు భారతి,
వడ్లపూడి,
విశాఖపట్నం.

ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496



18 చుక్కలు
2 వచ్చే వరకు
(సరి చుక్క)



ఆర్ వెంకాయమ్మ,
విజయవాడ.



అభిమానానికి ధన్యవాదాలు : చిరంజీవి

గతేడాది సంక్రాంతికి విడుదలైన వాల్తేరు వీరయ్య సినిమాను ఇంకా ఆదరిస్తున్న తన అభిమానులకు హీరో చిరంజీవి ధన్యవాదాలు తెలిపారు. గతేడాది నుంచి ఈ ఏడాది సంక్రాంతి వరకూ కృష్ణా జిల్లా అవనిగడ్డ రామకృష్ణ థియేటర్‌లో ఈ సినిమా ఆడుతోంది. 'మీరు నన్ను ఎంతలా అభిమానిస్తున్నారో అర్థమవుతుంది. ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు. ఈ రోజుల్లో ఇది ఎవ్వరూ టచ్ చేయలేని రికార్డు. దీనికి కారణం మీకు నచ్చేలా చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు బాబీకి దక్కుతుంది. దేవీశ్రీ ప్రసాద్, రవితేజ, ఇతర తారాగణం, మైత్రీ మూవీ మేకర్స్ ఇలా అందరి సమిష్టి కృషి ఫలితం. వాల్తేరు వీరయ్య లాంటి మరెన్నో చిత్రాలను మీకు అందించేందుకు ప్రతిక్షణం ప్రయత్నిస్తూనే ఉంటా' అంటూ ట్వీట్ చేశారు.

మహేష్.. అభిమానులకు ఒక ఎమోషన్..

- నమ్రత



మహేశ్‌బాబు, త్రివిక్రమ్ కాంబోలో వస్తోన్న 'గుంటూరు కారం' చిత్ర ప్రీరిలీజ్ కార్యక్రమం ఇటీవల గుంటూరులో నిర్వహించారు. ఈవెంట్ సక్సెస్ కావడంపై మహేశ్ భార్య నమ్రత ఆసక్తికర పోస్ట్ చేశారు. 'మహేశ్ సూపర్ ఫ్యాన్స్ గురించి మాట్లాడే చివరి వ్యక్తి బహుశా నేనే అనుకుంటా. మన రెండు రాష్ట్రాల ప్రజలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు ఆయనపై అపారమైన ప్రేమను కురిపిస్తారు. అన్ని వేళలా ఆయనకు మద్దతుగా ఉన్నారు. మీరు సపోర్ట్ చేస్తూ ఆయన మరింత కష్టపడి పనిచేసేలా చేశారు. మా సొంత ఊరు గుంటూరులో మీరు చూపించిన ప్రేమను చూసి ఓ విషయం గర్వంగా చెప్పాలని ఉంది. మహేశ్.. అభిమానులకు మీరొక ఎమోషన్. ఈ ప్రేమ ఇలాగే మనం జీవించి ఉన్నంత కాలం ఉండాలని కోరుకుంటున్నా. ఆయనను ఎంతగానో ప్రేమిస్తున్న మీ అందరికీ ధన్యవాదాలు. మీ అభిమానానికి నా హృదయం సంతోషంతో నిండిపోయింది' అంటూ ఆమె పోస్ట్ చేశారు. మంగళవారం జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతూ మహేశ్ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. 'మీరే నాకు అమ్మా, నాన్న' అంటూ మాట్లాడారు. దీనికి సంబంధించిన వీడియోను ఇన్‌స్టాలో షేర్ చేసిన నమ్రత పైవిధంగా పోస్ట్ చేశారు.

10 ఏళ్ల షూటింగ్ తరువాత ...




'ఆనందం' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైన జై ఆకాశ్ హీరోగా ఓ తమిళ సినిమా తెరకెక్కింది. ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'మామరం'. ఇందులో బ్రహ్మానందం, కాదల్ సుకుమార్, రాహుల్‌దేవ్ ముఖ్యపాత్రలు పోషించారు. నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో థియేటర్లలో విడుదల కానుంది. ఇది తన జీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కించిన కథా చిత్రమని ఆకాష్ ఇటీవల నిర్వహించిన ఈ సినిమా ఆడియో లాంచ్ కార్యక్రమంలో చెప్పారు. ఈ చిత్రాన్ని గత 2012లో ప్రారంభించి 10 ఏళ్లుగా షూటింగ్ నిర్వహించినట్లు కూడా ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కథ డిమాండ్ కారణంగా ఇన్నేళ్లు షూటింగ్ చేసినట్లు తెలుస్తోంది. ఇందులో ఆకాష్ పాత్ర 25 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వరకు మూడు కోణాల్లో సాగుతుంది. దీంతో రియాలిటీ కోసం 10 ఏళ్లు దశల వారీగా షూటింగ్ నిర్వహించినట్లు ఆకాష్ వివరించారు.



ఫిబ్రవరి 9న 'ఊరు పేరు భైరవకోన'

సందీప్ కిషన్ హీరోగా 'ఊరు పేరు భైరవకోన' చిత్రం రాబోతోంది. వి.ఐ ఆనంద్ హెల్మ్ తెరకెక్కించిన ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. పోస్టర్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ చిత్రంలో వర్ష బొల్లమ్మ కథానాయికగా నటిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ అనిల సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మిస్తున్నారు.

సరికొత్తగా 'శోభన్‌బాబు'



సినిమాల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ట్రెండ్ వైరల్‌గా మారుతోంది. తాజాగా శోభన్‌బాబు బీచ్‌లో నడుస్తున్నట్లుగా వచ్చిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతోంది. శోభన్‌బాబు 1959లో నటుడిగా తన కెరీర్‌ను ప్రారంభించి, 1996 వరకూ 230కుపైగా సినిమాల్లో నటించారు. ఎఐ టెక్నాలజీతో బీచ్ ఒడ్డున శోభన్‌బాబు సిక్స్ ప్యాక్‌తో నడిచొస్తున్న వీడియో రాంగోపాల్‌వర్మ ట్వీట్ చేయగా ఇది ఇప్పుడు వైరల్ అవుతోంది. మరో వీడియోలో సూట్ వేసుకున్న లుక్ ఆకర్షణీయంగా కనిపిస్తోంది.

కుర్రాళ్లకు సదవకాశం

- నేడు ఆఫ్ఘనిస్తాన్‌తో తొలి టి20
- కోహ్లి, రషీద్‌ఖాన్ దూరం
- రాత్రి 7.00గం॥లకు



టి20 సిరీస్ కెప్టెన్లు జద్రాన్(ఆఫ్ఘనిస్తాన్), రోహిత్ శర్మ(భారత్)

మొహాలి: దక్షిణాఫ్రికా పర్యటనను దిగ్విజయంగా ముగించిన టీమిండియా స్వదేశంలో ఆఫ్ఘనిస్తాన్‌తో టి20 సిరీస్‌కు సిద్ధమైంది. ఐసిసి టి20 ప్రపంచకప్‌కు ముందు జరిగే ఆఖరి అంతర్జాతీయ సిరీస్ కూడా ఇదే కావడంతో యువ క్రికెటర్ల ప్రదర్శనపైనే బిసిసిఐ ప్రధానంగా దృష్టి సారించింది. ఆఫ్ఘనిస్తాన్‌తో మూడు టి20ల సిరీస్‌లో భాగంగా గురువారం పంజాబ్‌లోని బింద్రా స్టేడియంలో తొలి మ్యాచ్ జరగనుంది. దక్షిణాఫ్రికాతో వైట్‌బాల్ సిరీస్‌లకు దూరంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీతో ఈ సిరీస్‌లో బరిలో దిగనున్నారు. విరాట్ కోహ్లి వ్యక్తిగత కారణాల రీత్యా తొలి టి20కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు బోర్డుకు తెలిపాడు. ఈ విషయాన్ని స్వయంగా భారత జట్టు హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడే వెల్లడించాడు. పాత్రికేయులతో నిర్వహించిన ప్రీమ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ద్రావిడ్ ఈ విషయాన్ని చెప్పాడు. వ్యక్తిగత కారణాలతోనే కోహ్లీ ఈ మ్యాచ్‌కు దూరమవుతున్నాడని, అయితే అతడు ఇండోర్‌తో ఈనెల 14న జరగబోయే రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని తెలిపాడు. అఫ్గాన్‌తో సిరీస్‌కు రోహిత్ శర్మ ఇన్నింగ్స్‌ను ఆరంభిస్తాడని, అతడికి తోడు యశస్వి జైస్వాల్ ఇన్నింగ్స్‌ను ఓపెన్ చేస్తాడని తెలిపాడు. రైట్ హ్యాండ్, లెఫ్ట్ హ్యాండ్ కాంబినేషన్ వైపే టీమ్ మేనేజ్‌మెంట్ మొగ్గుచూపినట్లు తెలిపాడు. దీంతో 2022 టి20 ప్రపంచకప్‌లో ఆడిలైడ్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్ తర్వాత రోహిత్ టి20ల్లో బరిలోకి దిగనున్నాడు.

రషీద్‌ఖాన్ ఔట్..

ఆఫ్ఘనిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్‌ఖాన్ భారత్‌తో జరిగే మూడు టి20ల సిరీస్‌కు దూరమయ్యాడు. వెన్నునొప్పికి ఆపరేషన్ చేయించుకున్న రషీద్ ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదని, అతడు ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడని కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ తెలిపాడు. వన్డే ప్రపంచకప్ తర్వాత లోయర్ బ్యాక్ పెయిన్‌కు సర్జరీ చేయించుకున్నాడు. రషీద్ లేకపోవడంతో ఆఫ్ఘన్ స్పిన్ దళాన్ని ముజీబ్ ఉర్ రెహ్మాన్, నూర్ అహ్మద్ నడిపించనున్నారు.

జట్లు(అంచనా)..

భారత్: రోహిత్(కెప్టెన్), జైస్వాల్, శుభ్‌మన్, తిలక్ వర్మ, రింకు సింగ్, సంజూ శాంసన్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, అవేశ్ ఖాన్, కుల్దీప్, బిష్ణోయ్, ముఖేశ్ కుమార్.

ఆఫ్ఘనిస్తాన్: హజ్మతుల్లా గుర్బాజ్, జద్రాన్ (కెప్టెన్), నజీబుల్లా, నబి, ఒమర్జాయ్, ముజీబ్, షరాఫుద్దీన్, ఖ్విజ్ అహ్మద్, నూర్ అహ్మద్/నవీన్, ఫారూఖీ.

టాప్-10లో విరాట్, రోహిత్

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) తాజా టెస్ట్ బ్యాటర్స్ జాబితాలో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ సత్తా చాటారు. విరాట్ కోహ్లీ మూడు స్థానాలు ఎగబాకి 6వ స్థానానికి చేరుకోగా.. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ 10వ స్థానంలో నిలిచాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో టీమిండియా తరపున నాలుగు ఇన్నింగ్స్‌లో 172 పరుగులు చేశాడు. దీంతో 9వ ర్యాంకు నుంచి 775 పాయింట్లతో 6వ ర్యాంక్‌కు చేరాడు. ఇక రోహిత్ శర్మ 14వ ర్యాంక్ నుంచి 748 పాయింట్లతో 10వ స్థానానికి ఎగబాకాడు. ఐసిసి టెస్ట్ బ్యాటర్స్‌లో కేన్ విలియమ్సన్ (864 పాయింట్లు) అగ్రస్థానంలో ఉండగా.. జో రూట్(ఇంగ్లండ్-859), స్టీవ్ స్మిత్(ఆస్ట్రేలియా-818), మార్నస్ లబూషేన్ (ఆస్ట్రేలియా- 802 పాయింట్లు), డారిల్ మిచెల్ (786 పాయింట్స్) టాప్-5లో నిలిచారు. బౌలింగ్ విభాగంలో టీమిండియా స్పిన్నర్ అశ్విన్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు.

కిదాంబి సంచలనం


- తొలిరౌండ్‌లో 5వ ర్యాంకర్ క్రిస్టీపై గెలుపు
- రెండో రౌండ్‌కు సాత్విక్-చిరాగ్ జోడి
- మలేషియా ఓపెన్



కౌలాలంపూర్: మలేషియా ఓపెన్ సూపర్-1000లో హైదరాబాద్ స్టార్ షట్లర్, మాజీ నంబర్‌వన్ ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ పెను సంచలనాన్ని నమోదు చేశాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 24వ ర్యాంకర్ శ్రీకాంత్ 12-21, 21-18, 21-16తో ప్రపంచ ఐదో ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీ(ఇండోనేసియా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. రెండో రౌండ్‌లో లాంగ్-అంగుస్(హాంకాంగ్)తో శ్రీకాంత్ తలపడ నున్నాడు. డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ శెట్టి రెండోరౌండ్‌లోకి దూసు కెళ్లారు. గురువారం జరిగిన పురుషుల డబుల్స్‌లో 2వ ర్యాంక్ జోడీ సాత్విక్-చిరాగ్ జోడీ శుభారంభం చేశారు. తొలిరౌండ్ పోటీలో సాత్విక్-చిరాగ్ 21-18, 21-19తో మహ్మద్ షోహిబుల్, మౌలానా బగస్(మలేషియా)పై పోరాడి నెగ్గారు. ఈ మ్యాచ్‌ను భారత జోడీ కేవలం 44 నిమిషాల్లోనే ముగించింది. 2వ రౌండ్‌లో చైనా, థాయ్‌లాండ్ డబుల్స్ మ్యాచ్ విజేత తో తలపడనున్నారు. ఇక మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా(భారత్) జోడీ 21-13, 21-16తో ఫ్రాన్సెస్కా కోర్బి-అలీసన్ లీ(అమెరికా) జంటపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరారు.

జకో, స్వైటెక్‌కు టాప్ సీడింగ్

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



మెల్‌బోర్న్: 2024 సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ సీడింగ్‌ను నిర్వాహకులు బుధవారం విడుదల చేశారు. పురుషుల సింగిల్స్‌లో సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్‌కు, మహిళల సింగిల్స్‌లో ఇగా స్వైటెక్(పోలండ్)కు టాప్ సీడింగ్ దక్కాయి. గ్రాండ్‌స్లామ్ నిర్వాహకులు సింగిల్స్‌లో మొత్తం 32మంది పురుషుల, మహిళల క్రీడాకారుల ర్యాంకింగ్స్‌ను విడుదల చేశారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయింగ్ పోటీలు ముగిసిన తర్వాత డ్రా విడుదల చేయనున్నారు. ఈ టైటిల్‌ను అత్యధికంగా నొవాక్ జకోవిచ్(10సార్లు) గెలుచుకొని 11వ టైటిల్ వేటలో నిలిచాడు. భారత్‌నుంచి సుమిత్ నాగల్ సింగిల్స్ అర్హత రౌండ్ ఆడుతున్నాడు.

టాప్-10 సీడింగ్

1. నొవాక్ జకోవిచ్(సెర్బియా)	1. ఇగా స్వైటెక్(పోలండ్)
2. కార్లోస్ అల్కరాజ్(స్పెయిన్)	2. ఆర్యానా సబలెంకా
3. డానియెల్ మెద్వదెవ్	3. ఎలెనా రైబకినా(కజకిస్తాన్)
4. జన్నిక్ సిన్నర్(ఇటలీ)	4. కోకా గాఫ్(అమెరికా)
5. ఆండ్రీ రుబ్లేవ్	5. జెస్సికా పెగూల(అమెరికా)
6. అలెగ్జాండర్ జ్వెరేవ్(జర్మనీ)	6. ఆన్స్ జబీర్(ట్యునీషియా)
7. స్టెఫానాస్ సిట్సిపాస్(గ్రీస్)	7. మార్కెటా ఓండ్రుసోవా(చెక్)
8. హోల్జర్ రూనే(డెన్మార్క్)	8. మరియా సక్కారి(గ్రీస్)
9. రూబెర్ట్ హుర్కరాజ్(పోలండ్)	9. బ్రబోరా క్రేజికోవా(చెక్)
10. అలెక్స్-డి-మినర్(ఆస్ట్రేలియా)	10. బీట్రిజ్ హద్దాడ్ మరియా(బ్రెజిల్)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68